నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA

మన రాష్ట్రం మన పత్రిక

బుధవారం WEDNESDAY 9.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 14 + 4 + 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 125 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

షష్ఠి

బుధవారం, సూర్యోదయం: 6-08, సూర్యాస్తమయం: 5-58. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం తిథి: షష్ఠి పగలు 12-15 వరకు, తదుపరి సప్తమి. నక్షత్రం: మూల తెల్లవారుజామున 5-15 వరకు. వర్జ్యం: రాత్రి 3-35 నుంచి తెల్లవారుజామున 5-15 వరకు. రాహుకాలం: పగలు 12-03 నుంచి పగలు 1-31 వరకు. దుర్ముహూర్తం: రాత్రి 11-39 నుంచి రాత్రి 12-26 వరకు. అమృతకాలం: రాత్రి 10-33 నుంచి రాత్రి 12-13 వరకు. సరస్వతి ఆవాహనం.

మెషీన్ లెర్నింగ్ ఆవిష్కరణలకు నోబెల్




భౌతిక శాస్త్రంలో ఇద్దరికి పురస్కారం

జాన్ హోప్‌ఫీల్డ్, హింటన్‌కు అవార్డు

› 11

2 లక్షల్లోపే రుణం అయినా మాఫీ కాలె



ఇట్లయితే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులు ఓటెయ్యరు

తుమ్మల ముందే తెగేసిచెప్పిన కాంగ్రెస్ కార్యకర్త › 2

హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్

- 3 రాష్ట్రాల్లో ప్రజలను వంచించిన ఫలితం
- కాంగ్రెస్‌ను ఈడ్చికొట్టిన హర్యానా ఓటర్
- ఏడు గ్యారెంటీలతో ఏమార్చాలనుకొన్న హస్తానికి దిమ్మదిరిగిపోయేలా జవాబు
- కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ఎఫెక్ట్‌తో అప్రమత్తమై.. ఎవరూ ఊహించని తీర్పు

జమ్ముకశ్మీర్‌లో ఇండియా కూటమి జయకేతనం

6 సీట్లకే కాంగ్రెస్ పరిమితం



జమ్ముకశ్మీర్‌లో నాలుగు గ్యారెంటీలు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు. హిమాచల్‌లో 10 గ్యారెంటీలు.. హర్యానాలో ఏడు గ్యారెంటీలు అంటూ ఓట్ల కోసం అర్రాసు పాట పాడిన కాంగ్రెస్‌కు ఓటర్లు కర్రు కాల్చి వాత పెట్టారు. హిమాచల్, కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో ఓట్లు వేయించుకొని గద్దె నెక్కిన తర్వాత బోడి మల్లన్న అంటున్న సంగతిని హర్యానా ప్రజలు గుర్తించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తిరగరాస్తూ , ఆశలను ఆవిరిచేస్తూ కాంగ్రెస్‌ను ప్రతిపక్ష పాత్రకు పరిమితం చేశారు. తెలంగాణను మాడల్‌గా చూపించి హర్యానాలో గెలవాలనుకున్న కాంగ్రెస్ పెద్దల ఆశలను ఓటర్లు చిదిమివేశారు. కర్ణాటక, తెలంగాణలలో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని, ఇది ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ విజయావకాశాల మీద ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉందన్న అధిష్ఠానం భయం అఖరికి అక్షరాలా నిజమైంది. రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మరీ కాంగ్రెస్ తెలంగాణలో మోసం చేసిందనే వాస్తవం, అక్కడి జాట్ రైతుల మనసులో ఎంత వ్యతిరేకత ఉన్నా బీజేపీవైపు మొగ్గేలా చేసింది. › 11

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్

- 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ ఉప కులాల వర్గీకరణ
- విద్య, ఉద్యోగ నియామకాల్లో ఉప కులాల వాటా తేల్చాలి
- ఏజీ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి
- యుద్ధప్రాతిపదికన బీసీ కులగణన చేపట్టాలి
- సర్కార్‌కు మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు
- పంజాబ్, తమిళనాడులో అధికారుల స్టడీ



హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటుచేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసింది. అమలులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని, యుద్ధప్రాతిపదికన బీసీ కులగణన చేపట్టి ఓటర్ల లెక్క తేల్చాలని › 6వ పేజీలో

పీఆర్టీయూలో పదవుల కొట్లాట!

- రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు పోటాపోటీ
- ఒకరి నామినేషన్ తిరస్కరణతో గొడవ, తోపులాట
- నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి › 8

మరో రైతు ఆత్మహత్య › 2

- ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారం
- కామారెడ్డి జిల్లా ఆత్మకూరులో విషాదం

‘మెయిన్’ లింక్ అక్కడే

అమరావతి గ్రాఫిక్స్.. మూసీలో ఫిక్స్

మెయిన్‌హార్ట్ వల్లే లక్షన్నర కోట్లతో మూసీ!

- తొలుత 50 వేల కోట్లుగా ప్రకటించిన సీఎం రేవంత్
- ఫిబ్రవరి 6న సెక్రటేరియట్‌లో కన్సల్టెన్సీ బృందం భేటీ
- 3 నెలల తర్వాత లక్షన్నర కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు
- అప్పటినుంచే సీఎం నోటి వెంట లక్షన్నర కోట్ల వ్యాఖ్యలు
- సింగపూర్ కన్సార్షియంకు తొలుత అమరావతి బాధ్యతలు
- మూసీ సుందరీకరణపైనా అదే మాయాజాలం



ఫిబ్రవరి 1న సీఎం రేవంత్‌తో ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ సమావేశం



జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబుతో ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ భేటీ

50 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తాం. కాలుష్య రహిత మూసీగా తీర్చిదిద్దుతాం

-పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏప్రిల్ 21న భువనగిరిలో రేవంత్‌రెడ్డి

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయం 71 వేల కోట్లు

- జూన్ 14న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఐదేండ్లలో లక్షన్నర కోట్లు ఖర్చు చేసి మూసీ నదికి ఊపిరిపోస్తాం

-గోపనపల్లి పై ఓవర్ ప్రారంభోత్సవం సందర్భంగా జూలై 4న రేవంత్‌రెడ్డి

మూసీ మజిలీ కథలు -2

రెండున్నర నెలల్లోనే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వ్యయం ఏకంగా రూ. లక్ష కోట్లు అదనంగా ఎందుకు పెరిగింది? సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు లేదు.. అంచనాలు అంతకన్నా లేవు.. కానీ, అంచనాలను సీఎం ఎలా పెంచి ప్రకటించారు? ఈ మధ్యలో ఏం జరిగింది? అంచనాలు పెంచింది ఎవరు? వీటన్నింటికీ అన్ని వేళ్లు ‘మెయిన్‌హార్ట్’ వైపే చూపిస్తున్నాయి. అవును.. పొరుగున ఉన్న ఏపీలో అమరావతి గ్రాఫిక్స్ మాయాప్రపంచానికి సూత్రధారి అయిన ఈశ్వరన్‌కు చెందిన ఈ కంపెనీ రంగ ప్రవేశంతోనే మూసీ సుందరీకరణ అంచనా వ్యయం అమాంతంగా పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమరావతి రాజధాని అభివృద్ధి పేరిట ఈశ్వరన్ కంపెనీ కన్సార్షియం స్టార్టప్ రాజధాని పేరుతో ఏకంగా రూ.66 వేల కోట్ల అవినీతికి స్కెచ్ వేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అదే ఈశ్వరన్‌కు చెందిన మెయిన్‌హార్ట్ మూసీ సుందరీకరణలో ప్రవేశిస్తున్న దరిమిలా మున్ముందు అమరావతి గ్రాఫిక్స్ తరహాలోనే కాకుండా సుందరీకరణ ఏ మలుపులు తిరగనున్నాయనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. › 2

హై రిస్క్‌లో భారీ వెంచర్లు

- డిప్యూటీ సీఎం ప్రజెంటేషన్‌లో 11 బడా నిర్మాణాలు
- వాటన్నింటి విలువ దాదాపు 15 వేల కోట్లపై మాటే! › 11
- అవన్నీ అక్రమమేనంటూ ప్రకటించిన భట్టి విక్రమార్క
- వాటన్నింటినీ కూల్చేస్తారా? లేదా క్రమబద్ధీకరిస్తారా?
- కోట్లు గుమ్మరించిన కొనుగోలుదారుల్లో టెన్షన్ టెన్షన్

హైదరాబాద్‌లో తగ్గిన ఇండ్ల అమ్మకాలు › 7

భట్టి పీపీటీ మతలబేమిటి! › 11

- ఫారిన్ నుంచి రాగానే హైడ్రాపై మీడియా భేటీ
- చెరువుల ఆక్రమణలు అంటూ పవర్ పాయింట్
- ముఖ్యమంత్రి మాటలకు భిన్నంగా వ్యాఖ్యలు
- హైడ్రా, మూసీ.. ఏదీ ఆయన పరిధిలో లేదు
- మున్సిపల్ శాఖా లేదు, ఇరిగేషన్ మంత్రీ కాదు
- అయినా ఎందుకు మీడియా భేటీ పెట్టినట్టు?
- గంటన్నర సేపు ఎందుకు ముచ్చటించినట్టు?
- డిప్యూటీ భట్టి వైఖరిపై కాంగ్రెస్‌లో గుసగుసలు





మంగళవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన నాగార్జున- అమల, కుమారుడు నాగచైతన్య

నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

- మంత్రి కొండా సురేఖపై కేసులో నాగార్జున వాంగ్మూలం
- సుప్రియ వాంగ్మూలాన్నీ నమోదు చేసిన నాంపల్లి కోర్టు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సినీనటుడు అక్కినేని నాగార్జున, ఆయన భార్య అమల, కుమారుడు నాగచైతన్య, కోడలు యార్లగడ్డ సుప్రియ మంగళవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అనంతరం నాగార్జున, సుప్రియ వాంగ్మూలాలను కోర్టు నమోదు చేసింది. రెండో సాక్షిగా ఉన్న వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని ఈ నెల 10న నమోదు చేయనున్నట్టు కోర్టు ప్రకటించింది. తెలుగు సినిమా పరిశ్రమలో ఎంతో పేరు ప్రతిష్ఠలున్న వ్యక్తిగా భారతీయ సినిమా రంగంలో తనకు సమున్నత స్థానం ఉన్నదని నాగార్జున కోర్టుకు తెలిపారు. దాదాపు 4 దశాబ్దాల నుంచి సినీ రంగంలో నటుడిగా, నిర్మాతగా, › 2వ పేజీలో



బీజేపీ మౌనం అందుకేనా?!

వివాదాస్పద మెయిన్‌హార్ట్‌కు మూసీ రివర్ ప్రాజెక్టు

- లక్షన్నర కోట్ల వ్యయం.. నోరుమెదపని కమలదళం
- మోదీ డ్రీమ్ ప్రాజెక్టులను మెయిన్‌హార్ట్ కట్టినందుకా?
- మూసీకి నిధులిస్తున్న పాండ్యన్.. మోదీ-బాబు మిత్రుడనా?
- సోషల్‌మీడియాలో బీజేపీ నేతలను నిలదీస్తున్న నెటిజన్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన రేవంత్ ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేపడుతామంటూ హడావుడి చేస్తున్నది. ఈ ప్రాజెక్టును వివాదాస్పద చరిత్ర కలిగిన మెయిన్‌హార్ట్ కంపెనీకి కట్టబెట్టింది కూడా. కాంగ్రెస్ ప్రభుత్వ ఏకపక్ష వైఖరిని, మెయిన్‌హార్ట్‌కు మూసీ ప్రాజెక్టును కట్టబెట్టడాన్ని బీఆర్‌ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. బీజేపీ నేతలు మాత్రం ఈ అంశంపై ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడకపోవటం చర్చనీయాంశమవుతున్నది. మూసీ ప్రాజెక్టుపై, దాన్ని మెయిన్‌హార్ట్ కంపెనీకి అప్పగించడంపై కమలనాథులు నోరుమెదపకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయని నెటిజన్లు సోషల్‌మీడియాలో పలు కామెంట్లు పెడుతున్నారు.

ప్రధాని మోదీ ఏరికోరి..

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులనిచ్చేందుకు చైనాకు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండ్యన్ గత ఫిబ్రవరి 1న సీఎం రేవంత్ రెడ్డికి హామీనిచ్చారు. పాండ్యన్ పూర్తిపేరు డీ జగదీశ పాండ్యన్. తమిళనాడుకు చెందిన మాజీ ఐఏఎస్. దాదాపు 13 ఏండ్లపాటు గుజరాత్‌కు సీఎంగా చేసిన నరేంద్రమోదీ 2014 మేలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆనందీబెన్‌ను గుజరాత్‌కు సీఎంగా ప్రకటించారు. అయితే, అప్పటికే తన ప్రభుత్వంలో వివిధ కార్పొరేషన్లలో కీలక పాత్ర పోషిస్తూ తనతో కలిసి పనిచేసిన పాండ్యన్‌పై ప్రధాని మోదీకి ఎంతో నమ్మకం. మంచి సాన్నిహిత్యం కూడా. ఈ క్రమంలోనే 2014 నవంబర్ 1న గుజరాత్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను పాండ్యన్‌కు అప్పగించారు. అనంతరం పాండ్యన్ వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్‌గా మారారు. మోదీ సన్నిహితుడిగా పేరున్న అదే పాండ్యన్.. మూసీ ప్రాజెక్టుకు నిధులను ఇస్తామంటూ హామీనివ్వడంతోనే బీజేపీ నేతలు ఈ అంశంపై ఏమీ మాట్లాడటం లేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

బాబుతోనూ సాన్నిహిత్యం

చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను అప్పగించిన సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కంపెనీ సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. మూసీ ప్రాజెక్టు దక్కించుకొన్న మెయిన్‌హార్ట్‌లో కూడా ఈయనకు ప్రధాన వాటాలు ఉన్నాయి. ఈ ఈశ్వరన్‌కు పాండ్యన్ మంచి మిత్రుడు. ఈ క్రమంలోనే పాండ్యన్‌తో చంద్రబాబుకు కూడా మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఏపీ రాజధాని అమరావతి నగరాభివృద్ధికి కూడా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అండదండలు ఇస్తామంటూ హామీనిచ్చింది. దీన్ని ధ్రువపరుస్తూ.. గత జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబు పాండ్యన్‌తో సమావేశమవ్వడం, అనంతరం అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడటం గమనార్హం.

మోదీ డ్రీమ్ ప్రాజెక్టులకు మెయిన్‌హార్ట్ దన్ను

గుజరాత్‌లోని నర్మదా నది ఒడ్డున ప్రపంచంలోనే ఎత్తయిన పటేల్ విగ్రహం (స్టాట్యూ ఆఫ్ యూనిటీ), యూపీలోని గ్రేటర్ నోయిడా-ఆగ్రా మధ్య ఆరు లేన్ల యమున ఎక్స్‌ప్రెస్ వే, అదే యూపీలోని తన నియోజకవర్గం వారణాసిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వారణాసి ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ తన డ్రీమ్ ప్రాజెక్టులంటూ ప్రధాని మోదీ తరుచూ చెప్తూ ఉండేవారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ మెయిన్‌హార్ట్ కంపెనీనే చేపట్టడం గమనార్హం. మెయిన్‌హార్ట్‌కు ఈ ప్రాజెక్టులు దక్కడంపై బీజేపీ పెద్దల రాయబారం ఉండొచ్చన్న అనుమానాలూ లేకపోలేదు. మోదీ కలల ప్రాజెక్టులను పూర్తిచేసిన కంపెనీపై విమర్శలు వ్యక్తం చేస్తే, బీజేపీ అధిష్ఠానానికి ఆగ్రహం కలుగుతుందేమోనన్న కారణంతోనే రాష్ట్ర నేతలు మూసీ విషయంలో 'మెయిన్‌హార్ట్'పై నోరుమెదపడం లేదా? అనే అనుమానాలను నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు.

మెయిన్‌హార్ట్ వల్లే లక్షన్నర కోట్లు!

- తొలుత 50 వేల కోట్లుగా ప్రకటించిన సీఎం రేవంత్
- ఫిబ్రవరి 6న సెక్రటేరియట్‌లో మెయిన్‌హార్ట్ బృందం భేటీ
- 3 నెలల తర్వాత లక్షన్నర కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు



ఫిబ్రవరి 6న సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మెయిన్‌హార్ట్ ప్రతినిధులు (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): చంద్రబాబు హయాంలో పురుడుపోసుకున్న మూసీ సుందరీకరణను ఎవరు అడ్డుపడినా పూర్తి చేస్తామని రేవంత్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు బాబు తర్వాత వైఎస్.. రోశయ్య.. కిరణ్‌కుమార్‌రెడ్డి.. కేసీఆర్ ఇలా ప్రతి సీఎం హయాంలో ఏదో ఒక పేరుతో కొనసాగుతున్నదే. కానీ కేసీఆర్ ప్రభుత్వ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ప్రకటించిన రేవంత్.. సీఎం కుర్చీలో కూర్చున్నది మొదలు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును 'గురు'తర బాధ్యతగా భుజానికెత్తుకున్నారు. థేమ్స్ తరహాలో ఈ ప్రాజెక్టును చేపడతామంటూ జనవరి 19న మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి లండన్‌లోని థేమ్స్‌ను సందర్శించి వచ్చారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మొదలు ఇప్పటివరకు వందల సార్లు మూసీ సుందరీకరణ ప్రాజెక్టును జపిస్తూనే ఉన్నారు.

8 నెలల ముందే భేటీ

మూసీ సుందరీకరణ మాస్టర్‌ప్లాన్ రూపొందించే కీలక బాధ్యతను సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇందుకు 8 నెలల ముందే ఆ కంపెనీకి చెందిన ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 6న సచివాలయంలో కంపెనీ ప్రతినిధులు కలిసి.. కంపెనీ గతంలో చేపట్టిన పలు రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల వివరాలను ప్రజెంటేషన్ రూపంలో తెలియజేశారు. అయితే మూసీకి సంబంధించి కూడా ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం అప్పట్లోనే వారికి సూచించారు. మార్చి 10న భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో.. మూసీ సుందరీకరణకు రూ.50 వేల కోట్లు ఖర్చవుతుందని రేవంత్ ప్రకటించారు. ఆ తర్వాత పలుమార్లు కూడా అదే ప్రకటన చేశారు. మే చివర్లో మెయిన్‌హార్ట్ కంపెనీ.. మూసీ సుందరీకరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సుందరీకరణ ఎలా చేయాలి? ఏయే పనులు చేపట్టాలి? అందుకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు అందులో సమర్పించినట్టు తెలిసింది. అందులోనే మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని పొందుపరిచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అప్పటినుంచి నెమ్మదిగా ప్రభుత్వ పెద్దల నోటి నుంచి మూసీ సుందరీకరణ అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది. జూన్ 14న ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.71 వేల కోట్లుగా ప్రకటించారు. జూలై 4న గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో మూసీ అంచనా వ్యయాన్ని రూ.లక్షన్నర కోట్లుగా వెల్లడించారు. అంటే.. డీపీఆర్ తయారు కాకముందే అంచనా వ్యయం మూడు రెట్లు పెరగడం వెనక అసలు మతలబు 'మెయిన్‌హార్ట్' ప్రతిపాదనలు అనేది స్పష్టం అవుతున్నది.

అవినీతిలో రాటుదేలిన సింగపూర్ కన్సార్షియం

సింగపూర్ మాజీ మంత్రి, ప్రస్తుతం అవినీతి కేసుల్లో జైలులో ఉన్న ఈశ్వరన్ మెయిన్‌హార్ట్ కంపెనీలో ప్రధాన భాగస్వామి. ఈశ్వరన్‌కు చెందిన మరో కంపెనీ సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జి (మెయిన్‌హార్ట్ అనుబంధ సంస్థ)కే అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను గతంలో చంద్రబాబు ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థలో ప్రధాన పెట్టుబడిదారు, డైరెక్టర్ ఈశ్వరన్. అమరావతి రాజధాని గ్రాఫిక్స్ మాయాజాలం ఏపాటిదో.. ఇటీవల వరదలతో తేలిపోయింది. తొలుత రాజధాని అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అంటూ రంగప్రవేశం చేసిన ఈశ్వరన్ సింగపూర్ కన్సార్షియం.. ఆపై అవినీతికి దారులు వెతికింది. అప్పటి ఏపీ ప్రభుత్వ పెద్దలతో కలిసి కృష్ణా నదీతీరాన ఏకంగా రూ.66 వేల కోట్ల దోపిడీకి ఈశ్వరన్ స్కెచ్ వేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్విస్ చాలెంజ్ విధానంలో అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా అసెండర్స్ కన్సార్షియంకు అప్పగించగా.. 1,691 ఎకరాలతో పాటు రూ.5,500 కోట్లు పెట్టే ఏపీ సర్కారుకు 42 శాతం వాటా, కేవలం పర్యవేక్షణ చేసే అసెండర్స్‌కు 58 శాతం వాటా దక్కేలా ఒప్పందం జరిగిందని మీడియాలో కథనాలు వచ్చాయి. సింగపూర్ బయట అవినీతి తీరు ఇలా ఉంటే.. ప్రపంచంలోనే అవినీతిరహిత దేశాల్లో ఐదో స్థానంలో నిలిచిన సింగపూర్‌లోనూ ఈశ్వరన్ అవినీతి చక్రవర్తిగా విరాజిల్లారు.

'మూసీ' సంధానకర్త జైలుకు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు టెండర్ వివాదాస్పద మెయిన్‌హార్ట్ కంపెనీకి దక్కింది. ఈ డీల్ వెనుక కీలక పాత్ర పోషించినట్టు భావిస్తున్న భారత సంతతికి చెందిన సింగపూర్ మాజీ రవాణా శాఖ మంత్రి ఎస్ ఈశ్వరన్ ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు. సింగపూర్ హైకోర్టు గత గురువారం ఆయనకి 12 నెలల జైలు శిక్ష విధించింది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇద్దరు వ్యక్తుల నుంచి ఈశ్వరన్ గడిచిన ఏడేండ్లలో 2.61 కోట్ల విలువైన బహుమతులు తీసుకున్నట్టు రుజువు కావడంతో కోర్టు ఈ శిక్ష విధించింది. బహుమతుల స్వీకరణకు సంబంధించిన 4 ఆరోపణలను, న్యాయస్థానాన్ని తప్పుదోవపట్టించడానికి సంబంధించిన మరో ఆరోపణను ఈశ్వరన్ గత నెల 24న అంగీకరించారు.సోమవారం నుంచి ఆయన జైలు జీవితాన్ని ప్రారంభించారు. ఈశ్వరన్ బహుమతులుగా స్వీకరించిన వైన్ బాటిల్స్, గోల్ఫ్ క్లబ్స్, బ్రాంప్టన్ సైకిల్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

భగ్గుమన్న సింగపూర్ ప్రజలు

కోర్టు విధించిన శిక్షను అనుభవించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, న్యాయస్థానం తీర్పును సవాల్ చేయబోనని ఆదివారం ఈశ్వరన్ తన ఫేస్‌బుక్ పోస్టులో రాసుకొచ్చారు. దీనిపై సింగపూర్ ప్రజలు భగ్గుమంటున్నారు. 1965లో సింగపూర్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒక క్యాబినెట్ మంత్రి నేరస్తుడిగా శిక్ష అనుభవించడం ఇదే మొదటిసారని కామెంట్లు పెడుతున్నారు. మీ చర్యలతో భారత్, సింగపూర్ ప్రతిష్ఠ మసకబారిందన్నారు.

అమరావతి టూ మూసీ

అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం అప్పగించిన సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కంపెనీ ఈశ్వరన్‌కు చెందినది కావడం గమనార్హం. అంతేకాదు, మూసీ ప్రాజెక్టు దక్కించుకొన్న మెయిన్‌హార్ట్‌లో కూడా ఈయనకు ప్రధాన వాటాలు ఉన్నాయి.

మూసీకి నిధులు.. చైనా బ్యాంకు నుంచే?

- ఫిబ్రవరి 1న సచివాలయంలో భేటీ
- మూసీ ప్రాజెక్టుకు సాయం చేయాలంటూ సీఎం అభ్యర్థన
- సరేనన్న న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ పాండ్యన్
- భేటీని ఏర్పాటు చేసింది ఏపీ సీఎం చంద్రబాబు మిత్రుడు ఈశ్వరన్
- పాండ్యన్‌కు ఈశ్వరన్ సన్నిహితుడు!
- ఏపీలోని అమరావతికి కూడా ఈ బ్యాంకుదే సహకారం!



జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబుతో ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ భేటీ



ఫిబ్రవరి 1న రేవంత్‌రెడ్డితో ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ భేటీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): దేశంలోకి ఉగ్రవాదులను ఎగదోస్తూ పక్కలో బల్లెంలా పాకిస్థాన్ మారింది. సరిహద్దు కయ్యాలతో డ్రాగన్ దేశం చైనా తరుచూ భారత్‌పై తన విషాన్ని చిమ్ముతున్నది. దేశ అస్తిత్వానికే ముప్పుగా మారిన ఈ రెండు దేశాలతో సీఎం రేవంత్ సర్కారు తీసుకొచ్చిన 'మూసీ రివర్ ఫ్రంట్' ప్రాజెక్టు ముడిపడి ఉండటం సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. పాకిస్థాన్‌లో పలు కుంభకోణాలకు పాల్పడిన మెయిన్‌హార్ట్ కంపెనీకి 'మూసీ రివర్ ఫ్రంట్' అభివృద్ధి పనులను కట్టబెట్టగా, ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధుల్లో మెజార్టీ డబ్బులను చైనా కేంద్రంగా పనిచేస్తున్న న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు సమకూర్చనున్నట్టు తేలడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సీఎం విజ్ఞప్తితో సమ్మతి

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) డైరెక్టర్ జనరల్ పాండ్యన్‌ను సీఎం రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరి 1న రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మూసీ పునరుద్ధరణ పనుల్ని చేపట్టబోతున్నామని, మూసీ పరీవాహక ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని బ్యాంకు ద్వారా అందించాలని పాండ్యన్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పాండ్యన్.. మూసీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని హామీనిచ్చారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశమున్నట్టు సంబంధితవర్గాలు తెలిపాయి. అలా చైనా కేంద్రంగా కార్యకలాపాలు జరుపుతున్న ఓ బ్యాంకు మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగమౌతున్నట్టు అర్థమవుతున్నది.

ఎవరీ పాండ్యన్??

ఏపీ సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్ తమిళనాడుకు చెందినవారు. అంతేకాదు, ఆయన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండ్యన్‌కు మంచి మిత్రుడిగా చెప్తారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆర్థిక వనరులు సమకూర్చడంలో ఈశ్వరన్ కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. అంతేకాదు.. ఏపీ రాజధాని అమరావతి నగరాభివృద్ధికి కూడా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అండదండలు అందించనున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి. దీన్ని ధ్రువపరుస్తూ.. గత జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబు పాండ్యన్‌తో సమావేశమవ్వడం, అనంతరం అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడటం గమనార్హం.

బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసినా..

బ్రిక్స్ కూటమి దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలో ప్రభుత్వాలు లేదా ప్రైవేటు కంపెనీలు చేపట్టే పలు ప్రాజెక్టులకు ఆర్థిక సాయాన్ని సమకూర్చే లక్ష్యంతో 2014లో బ్రిక్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఏర్పడింది. అయితే, కూటమిలోని దేశాలపై ఆధిపత్యం సాధించే ఉద్దేశంతో బ్యాంకు ప్రధాన కార్యాలయం తమ దేశంలోనే ఏర్పాటు చేయాలని, అలా అయితేనే బ్యాంకు ఏర్పాటుకు, ఆర్థిక సహకారానికి సాయమందిస్తామని చైనా మెలిక పెట్టింది. దీంతో సభ్య దేశాలు సరేనన్నాయి. అలా షాంఘైలో ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం బ్రిక్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు పేరును న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకుగా మారుస్తున్నట్టు చైనా ప్రకటించింది. ఇక, బ్యాంకులో బ్రిక్స్ కూటమిలోని ఒక్కో దేశం షేర్ వాటా 18.45 శాతానికి పరిమితంకాగా.. చైనా వాటా 26.2 శాతంగా ఉన్నది. దీనికోసం బంగ్లాదేశ్, అల్జీరియా, ఈజిప్ట్, యూఏఈ, ఉరుగ్వే తదితర దేశాలను బ్యాంకులో పరోక్ష భాగస్వాములుగా చైనా చేర్చింది. అలా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకుపై చైనా తన ఆధిపత్యాన్ని పెంచుకొన్నది.

మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం లేదు!

- మెరిట్ ఉన్నా అర్హులు కాదని వెనక్కి!
- ఇన్‌సర్వీస్‌లో బీఈడీ చేస్తే ఉద్యోగం ఇవ్వరా
- డీఎస్సీ అభ్యర్థుల ఎంపికలో చిత్రవిచిత్రాలు
- విద్యాశాఖ అధికారులపై అభ్యర్థుల ఆగ్రహం



నారాయణపేటలో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ అభ్యర్థులు మంగళవారం నారాయణపేటలోని డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన డీఈవోను సస్పెండ్ చేయాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు.
– నారాయణపేట రూరల్

సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఓ వైపు టీచర్ల నియామక పత్రాలు అందించబోతున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది.. మరోవైపు అదే నియామకాల ప్రక్రియలో మెరిట్ ఉన్నా ఉద్యోగాలు రాలేదని డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మొదటి ర్యాంకు సాధించినా అర్హులుకారని వెనక్కి పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బోళ్ల రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి నాన్ లోకల్ కింద ఎస్.ఏ సోషల్ తెలుగు మీడియంలో మొదటి ర్యాంకు సాధించాడు. అన్ రిజర్వ్‌డ్ పోస్టులో అతడికి కేటాయించాల్సిన ఉద్యోగాన్ని మరొకరికి కేటాయించారని హైదరాబాద్ విద్యాశాఖ అధికారి రోహిణికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఇలా చాలా మంది తమకు అన్యాయం జరిగిందని డీఈవోకు దరఖాస్తుల రూపంలో మొరపెట్టుకున్నారు.

ఇన్‌సర్వీస్ తిప్పలు

హైదరాబాద్ జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు 616 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి బుధవారం ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేస్తారు. హైదరాబాద్‌లో 878 పోస్టులకుగాను 262 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో ఉంది. ఉర్దూ మీడియం రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేకపోవడంతో పోస్టులు పెండింగ్‌లో ఉంచినట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఇన్‌సర్వీస్‌లో ఉండి సెలవులు పెట్టకుండానే బీఈడీ చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 8మంది అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడినట్టు తెలిసింది. దీంతో సదరు అభ్యర్థులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. పరీక్షల విభాగం ముందుగానే తమను నిరాకరించాల్సిందని.. పరీక్షకు అనుమతించి ర్యాంకు వచ్చాక ఇప్పుడు ఇన్‌సర్వీస్ అని ఇబ్బందులు సృష్టించడం సరైనది కాదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

1,056 టీచర్ పోస్టుల భర్తీకి బ్రేక్

కోర్టు కేసులతో నిలిచిన నియామక ప్రక్రియ

నేడు 10,006 మందికి ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-24లో 1,056 టీచర్ పోస్టుల భర్తీకి బ్రేక్‌పడింది. కోర్టు కేసుల కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో 10,006 మంది టీచర్లకే బుధవారం నియామక ఉత్తర్వులివ్వనున్నారు. డీఎస్సీలో 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయగా, 1,056 పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త టీచర్లకు బుధవారం ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేయనున్నారు. జాబితాలను జిల్లాలకు పంపించగా, డీఈవోలు నియామక ఉత్తర్వులను తయారు చేసి బుధవారం హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. ఎల్బీస్టేడియంలో సీఎం కొందరికే నియామక పత్రాలివ్వనుండగా, మిగతా వారికి జిల్లాలవారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులే పత్రాలను అందజేయనున్నారు.

2 లక్షల్లోపు రుణమున్నా నాకు మాఫీ కాలే

గాంధీభవన్‌లో మంత్రి తుమ్మల ముందే కార్యకర్త కుండబద్ధలు

రాజాపేట, అక్టోబర్ 8: 'నేను కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తను. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌రెడ్డికి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేసిన. రాష్ట్రంలో మా ప్రభుత్వం చేసిన పంట రుణాలు సగం మంది రైతులకే మాఫీ అయ్యాయి. అందుకు నేనే ఉదాహరణ. నాకు బ్యాంకులో రూ.2 లక్షల లోపు పంట రుణం ఉంది. అయినా మాఫీ కాలేదు. నా లాంటి వాడికే రుణం మాఫీ కాకపోతే.. ఇక సామాన్య రైతుల పరిస్థితి ఏమిటి?' అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నెమిలెకు చెందిన కల్లూరి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో జరిగిన రుణమాఫీ సమావేశంలో ఆయన పాల్గొని సొంత పార్టీ సర్కారుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంట్లో ఇద్దరు రుణం తీసుకుంటే రుణమాఫీ వర్తించదని ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రకటించకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తీరు 'ఓడ ఎక్కాక ఓడ మల్లయ్య.. ఓడ దిగాక బోడ మల్లయ్య' చందంగా ఉందని విమర్శించారు. తాను నమ్మిన కాంగ్రెస్ ప్రభుత్వం తనతో పాటు ఎంతోమంది రైతులకు అన్యాయం చేసిందని, రుణమాఫీని ఎగ్గొట్టడానికే జాప్యం చేస్తున్నదని మంత్రి ఎదుటే కుండబద్దలు కొట్టారు. వెంటనే రుణమాఫీ చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పక పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మల్లారెడ్డి ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో మంగళవారం వైరల్ అయ్యింది.

మరో రైతు ఆత్మహత్య


కామారెడ్డి జిల్లా ఆత్మకూరులో విషాదం



కిష్టయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 8: అప్పులు బాధ తో ఓ రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లాలో నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూరుకు చెందిన నాయికోటి కిష్టయ్య (55) రైతు. పొలం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో కోళ్లఫారాన్ని ఆర్నెళ్ల క్రితం లీజుకు తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పెరుగడంతో మానసికంగా కుంగిపోయాడు. సోమవారం రాత్రి కోళ్ల ఫారంలో నిద్రించడానికి వెళ్లిన కిష్టయ్య మంగళవారం ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి వెతకగా పెద్ద ఆత్మకూర్ శివారులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లోకం పోకడ



వామ్మో.. భయమేస్తున్నది సార్.. ఇక పిల్లి, ఎలుక, పాములకు బదులు ఏమొస్తాయో ఏమో సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.4°c	24.7°c
మెదక్	36.3°c	21.5°c
నిజామాబాద్	35.8°c	24.5°c
రంగారెడ్డి	35.6°c	20.0°c
మహబూబ్‌నగర్	33.4°c	22.1°c
ఖమ్మం	32.0°c	23.0°c
కరీంనగర్	32.0°c	24.0°c
హైదరాబాద్	31.0°c	22.0°c
వరంగల్	31.0°c	24.0°c
నల్లగొండ	30.0°c	23.6°c

రెండు రోజులు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండ్రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతం నుంచి లక్షద్వీప్ వరకూ ఒక ద్రోణి ఏర్పడిందని, లక్షద్వీప్ దగ్గర మరో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్ ఉన్నదని చెప్పారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వచ్చే రెండ్రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు కూడా పడవచ్చునని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఉదయం పొడి వాతావరణం, మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమవుతూ చిరు జల్లులు కురిసే వీలుంటుందని తెలిపారు.

నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

మొదటిపేజీ తరువాయి...

బిగ్‌బాస్ హోస్ట్‌గా, అన్నపూర్ణ స్టూడియో అధినేతగా కొనసాగుతున్న తనకు అభిమానుల నుంచి గుర్తింపు లభించిందని, తెలుగు, హిందీ, తమిళ భాషల్లో 90కిపైగా చిత్రాల్లో నటించానని వివరించారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని తెలుగు సినీ పరిశ్రమలో అభిమానుల ఆదరణ పొందానని, సినీ రంగంలో తన విశేష కృషికి గుర్తింపుగా 9 నంది అవార్డులు, 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు లభించాయని చెప్పారు. 2017లో పెద్దల అంగీకారంతో నాగచైతన్య-సమంత వివాహం జరిగిందని, తెలుగుతోపాటు పలు ఇతర భాషల్లో కథానాయికగా నటించి సమంత మంచి గుర్తింపు తెచ్చుకున్నదని తెలిపారు. నాగచైతన్య-సమంతల మధ్య తలెత్తిన వివాదాల వల్ల వారిద్దరూ సొంత నిర్ణయం మేరకు 2021లో ఇష్టపూర్వకంగానే విడాకులు పొందారని, అనంతరం వారిద్దరు వేర్వేరుగా గౌరవప్రదంగా జీవిస్తున్నారని కోర్టుకు వివరించారు. నిరాధార ఆరోపణల వల్ల వారి వ్యక్తిగత జీవితాలపై దుష్ప్రభావం పడే అవకాశమున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అక్కినేని కుటుంబం పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు పలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతోపాటు పత్రికల్లోనూ వార్తలు వచ్చాయని వివరించారు. అనంతరం ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వార్తల క్లిప్పింగులు, పెన్‌డ్రైవ్‌లను మేజిస్ట్రేట్‌కు చూపించారు. ఎన్-కన్వెన్షన్ హాల్‌కు, నాగచైతన్య-సమంత విడాకులకు ఎలాంటి సంబంధం లేదని నాగార్జున స్పష్టం చేశారు.

యార్లగడ్డ సుప్రియ వాంగ్మూలం ఇదీ..

నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో అభిమానులు, స్నేహితులు, కుటుంబసభ్యులు తనకు ఫోన్లు చేశారని నాగార్జున కోడలు యార్లగడ్డ సుప్రియ కోర్టుకు వివరించారు. తన మామపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అక్కినేని కుటుంబాన్ని తీవ్రంగా బాధించాయని, ఆ వ్యాఖ్యలు తమ కుటుంబం పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం మంత్రి సురేఖ మీడియా ఎదుట చేసిన వ్యాఖ్యలను చదివి కోర్టుకు వినిపించారు. నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం వాస్తవం లేదని, వారిద్దరు పరస్పర అంగీకారంతో ఇష్టపూర్వకంగానే విడాకులు తీసుకున్నారని వివరించారు. సమంత కూడా పేరున్న నటిగా సమాజంలో చలామణి అవుతున్నారని, రాజకీయ లబ్ధి కోసమే అక్కినేని కుటుంబంపై మంత్రి సురేఖ నిందారోపణలు చేశారని కోర్టుకు స్పష్టం చేశారు.



మంగళవారం తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు బడుగుల లింగయ్యయాదవ్, దేవీప్రసాద్ తదితరులు

మూసీని మురికికూపం చేసిందే కాంగ్రెస్

- తెలంగాణలో సకల దరిద్రాలకు ఆ పార్టీయే కారణం
- ఢిల్లీకి మూటలు పంపేందుకే మూసీ సుందరీకరణ
- మూసీ, చెరువులపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- మూసీ సుందరీకరణ, ప్రక్షాళన మాకు అప్పగించండి
- 16 వేల కోట్లతోనే చేసి చూపిస్తం: జగదీశ్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో 1956 నుంచి 2014 వరకు మూసీ, చెరువులు, నాలాలు ఎలా ఉండేవి? ఎలా అయ్యాయో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమా? అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. మూసీని మురికికూపంగా మార్చిందే కాంగ్రెస్ అని, తెలంగాణలో సకల దరిద్రాలకు ఆ పార్టీయే కారణమని మండిపడ్డారు. ఢిల్లీకి డబ్బుల మూటలు మోసేందుకే లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని విమర్శించారు. బుకాయింపుల్లో, అబద్ధాల్లో భట్టి విక్రమార్క రేవంత్‌రెడ్డిని మించిపోయాడని జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మూసీ సుందరీకరణ ఎవరి కోసమో?, దానిని ఏం చేయదలుచుకున్నారో? చెప్పాలంటూ నిలదీశారు. సీఎం చెప్పిన మాటలు కూడా డిప్యూటీ సీఎంకు తెలియడం లేదని, లక్షా 50 వేల కోట్లు అని స్వయంగా సీఎం చెప్పారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యాలయాలను నిర్మించాయని, వాటిలో కొన్ని ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని, ఆ ప్రాజెక్టులను కూలగొట్టే దమ్ము ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు ఉన్నదా అని జగదీశ్‌రెడ్డి సవాల్ చేశారు. మూసీతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని, ఇప్పటికే వెయ్యి కోట్ల విలువైన పేదల ఇండ్లను కూల్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీ కడుపు నింపుకొనేందుకు మూసీ ప్రాజెక్టు, డబ్బుల కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను నాశనం చేస్తున్నారు' అని మండిపడ్డారు. డబ్బుల సంపాదనలో భట్టి సీఎంతో పోటీ పడుతున్నారని ఆరోపించారు. 'మీ వద్ద మూసీ ప్రణాళిక ఉన్నదా? మూసీ మురికిగా మారడానికి పాత బాసులు, కొత్త బాసులు కారణం కాదా?' అంటూ నిలదీశారు.

మాకు అప్పగించండి చేసి చూపిస్తాం..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మహమ్మారికి కారణం కాంగ్రెస్ కాదా? అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. ఫ్లోరోసిస్‌ను రూపుమాపింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు మూసీని మురికికూపంగా మార్చితే ప్రక్షాళనకు 16 వేల కోట్లతో బీఆర్‌ఎస్ పనులు ప్రారంభించిందని, ఇప్పటికైనా మూసీ సుందరీకరణ, ప్రక్షాళన పనులను దమ్ముంటే తమకు అప్పగించాలని, రూ.16వేల కోట్లతోనే పూర్తిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హిమాయత్‌సాగర్‌కు నీళ్లు తీసుకొచ్చే కార్యక్రమానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని, ఈ పని పూర్తిచేసేందుకు కాంగ్రెస్‌కు చేతకాకుంటే చేసేందుకు తాము రెడీగా ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు నిధుల్లేవు కానీ, మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని నిలదీశారు.

తెలంగాణ భవన్ అంటే ప్రజలకు ధైర్యం

తెలంగాణ భవన్ అంటే తెలంగాణ ప్రజలకు ఓ ధైర్యమని, ఆత్మగౌరవానికి ప్రతీక అని కేసీఆర్ ఏనాడో చెప్పారని, మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా బాధితులు తెలంగాణ భవన్‌కు తండోపతండాలుగా రావడం కేసీఆర్ మాటలను రుజువు చేసిందని జగదీశ్‌రెడ్డి చెప్పారు. 'సోషల్ మీడియా వాళ్లను చూసి భయపడుతున్న రేవంత్‌రెడ్డికి కేసీఆర్ కావాల్నా? మా కార్యకర్త చాలు' అంటూ ఎద్దేవాచేశారు. కర్ణాటక, తెలంగాణలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని హర్యానా ప్రజలు గ్రహించి కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బీ లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నేతలు జీ దేవిప్రసాద్, ఓ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

• కల్యాణలక్ష్మి చెక్కుల కోసం పడిగాపులు



కల్యాణలక్ష్మి చెక్కుల కోసం వచ్చిన లబ్ధిదారులు.. సాయంత్రం వరకు వేచిచూశారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలానికి చెందిన 79 మంది లబ్ధిదారులు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల కోసం రైతువేదిక వద్దకు వచ్చారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు చెక్కులు పంపిణీ చేసేందుకు హాజరుకావాల్సిన ప్రజాప్రతినిధి రాలేదు. దీంతో అక్కడున్న వారిని నిలదీయగా.. ఇప్పుడు.. అప్పుడు వస్తారంటూ సర్ది చెప్తూ సమయం గడిపారు. ఎదురుచూసిన లబ్ధిదారులు నీరసించి ఆకలితో అలమటించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలివ్వండి

మాజీ మంత్రి టీ హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్య గోచరంగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడంలేదని, దీనివల్ల విద్యార్థులు విద్యాసంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 19 వేల కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేసినట్టు గుర్తు చేశారు. మంగళవారం తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల దసరా, దీపావళి వేళ సిబ్బందికి జీతాలు చెల్లించలేకపోతున్నామని గోడు వెల్లబోసుకున్నారు. భవనాల అద్దెలు చెల్లించలేక, అప్పుల వడ్డీలు కట్టలేక కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

కళ తప్పిన హైదరాబాద్

రేవంత్ తొందరపాటు నిర్ణయాల వల్ల కుదేలైన రియల్ రంగం

- సీఎం భాష కట్టు తప్పింది.. పాలన అదుపుతప్పింది
- తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పింది
- ఏ వర్గం సంతోషంగా లేదు
- కాంగ్రెస్ మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలి: హరీశ్‌రావు



"గ్రామ పంచాయతీలు కళ తప్పినయ్. బతుకమ్మ, దసరా పండుగలకు బుగ్గలు వేసేందుకు కూడా పైసల్లేవ్. పంచాయతీల్లో డబ్బుల్లేక కార్యదర్శులు అప్పుల పాలైండ్రు. చిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నరు. ఎవరిని కదిలించినా కండ్లల్లో నీళ్లు పెట్టుకుంటున్నరు.
- హరీశ్"

సిద్దిపేట, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి తొందరపాటు నిర్ణయాలు, చర్యల వల్ల హైదరాబాద్ కళ తప్పిందని, రియల్ ఎస్టేట్ కుదేలైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం భాష కట్టు తప్పిందని, పరిపాలన గాడి తప్పిందని, అవినీతి అదుపు తప్పిందని, మొత్తంగా తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పిందని వాపోయారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం చిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీల్లో డబ్బుల్లేక కార్యదర్శులు అప్పుల పాలవుతున్నారని, ఒక్కొక్కరు లక్ష నుంచి మూడు లక్షల దాకా అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'గ్రామాల్లో బుగ్గలు వేయకపోతే గ్రామస్థులు తిడుతున్నరు.. బుగ్గలు వేస్తే కరెంటు బిల్లులు ఎక్కువ వస్తయని ఇంట్ల కుటుంబ సభ్యులు తిడుతున్నరు' అంటూ ఆయా గ్రామాల్లో పరిస్థితిని వివరించారు. చిన్న కాంట్రాక్టర్లు బిల్లులు రాక కష్టాలు పడుతున్నారని, వారికి వెంటనే ప్రాధాన్యత క్రమంలో బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ దవాఖానల్లో మందులు కూడా లేవని మండిపడ్డారు.

"యువకులు, విద్యార్థులు గ్రామాలకు వచ్చి నాయనమ్మకు, అమ్మమ్మకు, తాతకు కాళ్లు మొక్కి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు కోసం ఓటు వేయాలని ఆరోజు అడిగిండ్రు.. ఇవ్వాళ అదే యువతకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలపై మీ గ్రామాల్లో చర్చ పెట్టండి.. మీ కుటుంబ సభ్యులకు వివరించి చెప్పండి.
-హరీశ్"

పోలీస్ సిబ్బంది కుమిలిపోతున్నరు

ఒకటో తారీఖునే వేతనాలు ఇస్తున్నామని ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటున్నదని, రాష్ట్రంలో సకాలంలో జీతాలు రాక అనేక మంది ఇబ్బంది పడుతున్నారని హరీశ్ తెలిపారు. పోలీస్ సిబ్బందికి టీఏ, సరెండర్ లీవుల డబ్బులు 10 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, బయటకు చెప్పుకోలేక వారు కుమిలిపోతున్నారని చెప్పారు. ప్రతి నెలా హోం గార్డుల వేతనాలు ఆలస్యంగా ఇస్తున్నారని, మున్సిపాలిటీ ఆర్పీలకు నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామ సంఘాల్లో పని చేసే వీఓలకు జీతాలు లేవని, మహిళా సంఘాల వీఓలు, ఆర్పీలకు కూడా ఈ పండుగకు జీతాలు అందలేదని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ హాస్టళ్లలో పనిచేసే వంటవాళ్లు, కామాటీలు కూడా వేతనాలు రాక ఏడు నెలలుగా అవస్థలు పడుతున్నారని, మధ్యాహ్న భోజన కార్మికులకు మార్చి నుంచి వేతనాలు, వంట సరుకుల డబ్బులు రావడం లేదని, రెండో ఏఎన్‌ఎంలకు కూడా జీతాల్లేవని, గాంధీ, ఉస్మానియా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందికి మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదని చెప్పారు. పండుగ పూట కూడా ఆసరా పెన్షన్లు ఇవ్వరా? అని ప్రశ్నించారు. నాలుగు వేలు ఇస్తామని చెప్పి రెండు వేలే ఇస్తున్నారని, అవీ రెండు నెలలు బాకీ పడ్డారని విమర్శించారు. 'మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టే మీరు.. రెండు వేల పెన్షన్ ఎందుకివ్వడం లేదు? కోతలు పెట్టేది పేదల మీదేనా' అని ప్రశ్నించారు.

మోసాలపై చర్చ పెట్టండి..

కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలని దసరాకు ఇండ్లకు వచ్చే యువత, విద్యార్థులకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని చెప్పి రేవంత్‌రెడ్డి మోసం చేసిండని, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినవి తప్ప, కాంగ్రెస్ సర్కార్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, దీనిపై గ్రామాల్లో చర్చ పెట్టాలని కోరారు. నాలుగు వేల నిరుద్యోగ భృతి, రైతుబంధు వస్తున్నదా? అడగాలని, వానకాలం పంట చేతికొచ్చినా పెట్టుబడి సాయం మాత్రం చేతికి రాలేదని, రూ.15 వేలు ఇస్తామన్న రైతు భరోసా ఏమైందని, వీటన్నింటిపైనా యువత, విద్యార్థులు ఎండగట్టాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో నాయకులు రాజనర్సు, శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భూపేశ్, సోంరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

గోల్‌మాల్ గ్యారెంటీలు

'**కాంగ్రెస్ గ్యారెంటీ** అంటే గోల్డెన్ గ్యారెంటీ అని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. అది గోల్డెన్ గ్యారెంటీయా? గోల్‌మాల్ గ్యారెంటీయా?' అని హరీశ్ ఎద్దేవాచేశారు. 'గోల్డెన్ గ్యారెంటీ అంటే వంద రోజుల్లో 4వేల పెన్షన్, రూ.15 వేల రైతుబంధు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఇవ్వాలి కదా? మీరిచ్చిన హామీలు పూర్తి చేయాలి కదా? ఇవేవీ పూర్తి చేయకుంటే అది గోల్డెన్ గ్యారెంటీ ఎట్లయితది?' అని ప్రశ్నించారు. ఇవన్నీ గోబెల్స్.. గోల్‌మాల్ గ్యారెంటీలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వచ్చాక బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని, నిత్యావసరాల ధరలు బాగా పెరిగాయన్నారు. రియల్ ఎస్టేట్ రంగం ఆగమైపోయి లక్షల మంది రోడ్డు మీద పడ్డారని చెప్పారు. కాంగ్రెస్ మోస పూరిత వైఖరి, ఆ పార్టీ చేసిన మోసాలు, బాండ్ పేపర్ల మీద రాసిచ్చి, మాట తప్పిన తీరుపై గ్రామాల్లో యువత, విద్యార్థులు చర్చించాలని పిలుపునిచ్చారు.



తెలంగాణలో పోలీస్ రాజ్యం

- సోషల్ మీడియా ప్రతినిధులపై అణచివేతలు
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని నడుపుతున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవస్థలన్నింటినీ తన గుప్పిట్లో పెట్టుకొని నియంతపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ యావత్తు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ప్రతినిధులను అరెస్ట్ చేయడమే పనిగా పెట్టుకున్నట్టు కనిపిస్తున్నదని, వారేమైనా టెర్రరిస్టులా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల కదలికలపైనా నిఘా ఎందుకని నిలదీశారు. ప్రధాన మీడియాను గుప్పిట్లో పెట్టుకొని సోషల్ మీడియాను కూడా కంట్రోల్ చేయాలన్న భ్రమలో సీఎం ఉన్నారని ఆరోపించారు. తెలంగాణ గడ్డ మీద అణిచివేత ఏ స్థాయిలో ఉంటే అంతకు రెట్టించిన వేగంతో నిరసన ఉబికివస్తుందనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంతటి దారుణమైన నిర్బంధాలను చూడలేదని, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అంటే సీఎం ఎందుకు వణుకుతున్నారని ప్రశ్నించారు.

దూకుడుగా ఫార్మా పోరు!

- నేడు పోలేపల్లి నుంచి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాదయాత్ర
- హాజరుకానున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- యాత్రను అడ్డుకోవడానికి కాంగ్రెస్ యత్నం



కొడంగల్ నియోజకవర్గం హకీంపేట చౌరస్తాలో రిలే దీక్షలో పాల్గొన్న రైతులు

బొంరాస్‌పేట, అక్టోబర్ 8 : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ఇప్పటికే బాధిత గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయ ముట్టడి, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించి తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ప్రభుత్వం ఫార్మా ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నది. ఇందులో భాగంగా భూ సేకరణకు నోటిఫికేషన్ కూడా జారీ చేయడంతో రైతులు భగ్గుమంటున్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుని బతుకుతున్న భూములను సర్కారు లాగేసుకుంటే ఎలా బతకాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఫార్మా విలేజ్ ఏర్పాటు వల్ల నీటి, వాయు కాలుష్యం ఏర్పడి పంటలు పండవని, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుద్యాల మండలం హకీంపేట చౌరస్తాలో నెల రోజులుగా రైతులు రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు.

ఇప్పటికే 703.65 ఎకరాలకు నోటిఫికేషన్

ఫార్మా విలేజ్‌పై రైతుల ఆందోళనను రేవంత్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పోలేపల్లిలోని సర్వే నంబరు 67లో 130 ఎకరాలు, హకీంపేటలోని 252 సర్వే నంబరులో 366 ఎకరాలు, లగచెర్లలో 102 సర్వే నంబరులో 140 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ప్రభుత్వ భూమి ఫార్మా విలేజ్‌కు సరిపోకపోవడంతో ప్రభుత్వ, పట్టా భూములను కలిపి మూడు గ్రామాల పరిధిలో మొత్తం 1274.25 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. హకీంపేటలో 505.37 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్లలో 643 ఎకరాలను ఫార్మా విలేజ్ కోసం సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే లగచెర్ల గ్రామ పరిధిలోని 632.26 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల పట్టా భూములను సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

నేడు పోలేపల్లి నుంచి పాదయాత్ర

ఫార్మా విలేజ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం పాదయాత్రకు సిద్ధమయ్యారు. దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో ఉదయం పూజలు చేసి అక్కడి నుంచి హకీంపేట, పులిచెర్లకుంటతండా, రోటిబండతండా, లగచెర్ల గ్రామాల మీదుగా దుద్యాల మండల కేంద్రం వరకు పాదయాత్ర చేపడతారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. పాదయాత్రకు మద్దతుగా ఫార్మా బాధిత గ్రామాల రైతులతోపాటు వివిధ మండలాల నుంచి రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొనే అవకాశం ఉన్నది.

పాదయాత్రను అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నం

ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా పట్నం నరేందర్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నది. బుధవారం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయానికి రావాలని కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భూములు కోల్పోతున్న రైతులకు భరోసా ఇవ్వాల్సిన అధికార పార్టీ నాయకులు ఇలా వ్యవహరించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



హామీల అమలులో వైఫల్యంతోనే కాంగ్రెస్ ఓటమి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ) : కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతోనే హర్యానాలో కాంగ్రెస్ ఏడు గ్యారెంటీలను ప్రజలు విశ్వసించలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మోసం ఎప్పుడూ చెల్లదని, ప్రజలు చాలా తెలివైన వారని కొప్పుల పేర్కొన్నారు. తప్పుడు వాగ్దానాలతో ఒకసారి గెలుపొందవచ్చేమో కానీ మరోసారి గెలువలేరని, అందుకు హర్యానా ఎన్నికల ఫలితాలే నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే లాబీయింగ్, పైరవీలు, సొంత ఎజెండా, నాయకుల అభివృద్ధి అని, ప్రజల అభివృద్ధిపై దృష్టి పెట్టదని ఎద్దేవా చేశారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలా హర్యానా ప్రజలు మోసపోలేదని, కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టినట్టు ఫలితాలు ఇచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీసే సమయం త్వరలోనే రానున్నట్టు కొప్పుల తెలిపారు.



తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

గురుకులాల రద్దుకు సర్కారు కుట్ర

- గురుకుల వ్యవస్థపై సీఎం, డిప్యూటీ సీఎంలకు అవగాహన లేదు
- స్కూళ్లు కోళ్లఫాంలు కాదు.. స్టూడెంట్స్ కోడిపిల్లలు కాదు
- 2560మందికి 25కోట్లతో బిల్డింగ్‌ల నిర్మాణం సాధ్యమేనా?
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తేతెలంగాణ): నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు కేసీఆర్ సర్కారు తెచ్చిన గురుకులాల రద్దుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నుతున్నదని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురుకుల వ్యవస్థపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి అవగాహన లేదని విమర్శించారు. అందుకే 21 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెబుతున్నారన్నారు. 'కేవలం రూ. 25కోట్లతో 2560 మంది విద్యార్థులకు ఒకేచోట భవనాలు ఎలా నిర్మిస్తారు? స్కూళ్లేమైనా కోళ్ల ఫారాలా? విద్యార్థులను కోడిపిల్లలనుకుంటున్నారా? అసలు మీరెప్పుడైనా గురుకుల విద్యార్థుల వద్దకు వెళ్లారా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు గ్యారెంటీలపై దృష్టి మళ్లించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను తెరపైకి తెచ్చారని నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం సకల హంగులతో గురుకులాలను నిర్మించి అన్నివర్గాల పిల్లలకు చదువుకొనే అవకాశం కల్పించిందని చెప్పారు. కానీ కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు గురుకులాల్లో సామాజిక న్యాయం పాటించలేదని, 666 స్కూళ్లల్లో కనీస వసతులు కల్పించలేదని సీఎం రేవంత్ అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే 662 గురుకులాల్లో మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలకు క్రేజ్ తగ్గిందన్నారు. పిల్లలకు రగ్గులు, టీచర్లకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. ఈ ఏడాది మెడికల్, ఐఐటీ సీట్లు సాధించిన 160మంది విద్యార్థులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయ్, నరేందర్ ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్

- మొదట ఆరు జిల్లాల్లో పంపిణీకి నిర్ణయం
- ఆడబిడ్డల ఆగ్రహం తప్పదని వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- పండుగ పూట మహిళలకు నిరాశే

ములుగు, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఆరు జిల్లాల మహిళా సంఘాలు, గిరిజనులకు బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్ పడింది. ఈ నెల 6న ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర చేనేత సహకార సంఘం నుంచి చీరలను సరఫరా చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్‌తో చీరల పంపిణీ ఆగిపోయింది. సంఘం వద్ద మిగిలి ఉన్న బతుకమ్మ చీరలకు అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫొటోలు ఉండగా వాటి పేరుమార్చి తెలంగాణ ఆడపడుచుల చీరల పంపిణీ పథకం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఫొటోలతో స్టిక్కర్లు అంటించి ఆయా జిల్లాలకు చేరవేశారు. ఈ నెల 7న మహిళా సంఘాల వీవో గ్రూప్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు, గిరిజన ఆడబిడ్డలకు పంపిణీని ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన చీరలే ఇప్పుడు ఇచ్చారని, వాటికి వీటికి ఎలాంటి తేడా లేదని, పేరు, ఫొటోలు మార్చి ఇవ్వడం ఏమిటని మహిళలు గుసగుసలాడినట్టు తెలిసింది. పండుగ వేళ అందరికీ ఇవ్వకుండా కొందరికే ఇస్తున్నారని పంపిణీ కేంద్రాల వద్ద బాహాటంగానే వ్యతిరేకత వచ్చినట్టు సమాచారం. కేవలం ఆరు జిల్లాల్లోనే చీరల పంపిణీ చేపట్టగా మిగతా 27 జిల్లాల ఆడబిడ్డలకు ఇవ్వకుంటే వారి నుంచి ఆగ్రహం తప్పదని భావించిన ప్రభుత్వం అప్పటికప్పుడు పంపిణీని నిలిపివేయాలని రాష్ట్ర చేనేత సహకార సంఘం ఎండీ శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీచేసి కలెక్టర్లకు పంపించారు. అప్రమత్తమైన కలెక్టర్లు ఉత్తర్వుల కాపీని పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు పంపించి చీరల పంపిణీని నిలిపివేయించారు. బతుకమ్మ పండుగ తర్వాత ఈ నెల 15 నుంచి చీరల పంపిణీని చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి అధికారుల అనాలోచిత నిర్ణయాలతో బతుకమ్మ పండుగకు ఎంపిక చేసిన ఆరు జిల్లాల్లోని మహిళలతోపాటు ఇతర జిల్లాల్లోని మహిళలకు తీవ్ర నిరాశ ఎదురైందని పలువురు చర్చించుకుంటున్నారు.



ములుగు జిల్లా ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిల్వ చేసిన బతుకమ్మ చీరెలు



సీఎం రేవంత్‌రెడ్డిపై ఆదిలాబాద్ డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

రుణమాఫీ విషయంలో రేవంత్ చీటింగ్

2 లక్షల వరకు మాఫీ విషయంలో దగా.. పోలీసులకు జోగు రామన్న ఫిర్యాదు

ఆదిలాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు మాజీ మంత్రి జోగు రామన్న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు పత్రం అందజేశారు. రుణమాఫీ విషయంలో సీఎం అబద్ధాలు ఆడుతున్నారని, రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. 'బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల రుణం తీసుకోండి.. మేము అధికారంలోకి రాగానే డిసెంబరు 9న మాఫీ చేస్తాం' అని చెప్పిన రేవంత్‌రెడ్డి ఆ తరువాత మాట మార్చినట్టు ఆరోపించారు. సీఎం రేవంత్ సోమవారం ప్రధాని నరేంద్రమోదీకి రాసిన లేఖలో 7 అక్టోబర్ 2024 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ మూడు దశల్లో పూర్తిస్థాయిలో అమలు చేశామని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉన్నదని అన్నారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

నెత్తురోడిన బస్తర్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతం మరోసారి మావోయిస్టు, పోలీసు బలగాల రణరంగమైంది. దంతెవాడ, నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 13 మంది మహిళా నక్సలైట్లు ఉన్నారు. భారీ మొత్తంలో రివార్డులున్న పలువురు సీనియర్లను మావోయిస్టు పార్టీ కోల్పోయింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటైన 24 సంవత్సరాల కాలంలో ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్. వరుస నష్టాలతో కునారిల్లుతున్న మావోయిస్టులకు తాజా ఎన్‌కౌంటర్ పెద్ద దెబ్బే అని చెప్పాలి. ఐదు మాసాల క్రితం కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మరణించారు. బస్తర్ ప్రాంతంలో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 188 మంది నక్సల్స్ హతులయ్యారు. మొత్తంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎదురుకాల్పుల మృతుల సంఖ్య 237కు చేరుకుంది. శుక్రవారం నాటి ఎదురు కాల్పుల్లో పోలీసులకు ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. మారుమూల అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు పూర్తి సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించడం వల్లే ఇది సాధ్యమైందన్న ప్రశంసలు వినిపిస్తున్నాయి. కానీ, హింస ఎటువైపు నుంచి జరిగినా ప్రాణ నష్టం తప్ప సాధించేదేమీ ఉండదు.

సుమారు ఆరు దశాబ్దాల కిందట సమ సమాజం, తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం అనే భావనలతో మొదలైన నక్సలైట్ ఉద్యమం కాలక్రమంలో అనేక చీలికలకు గురైంది. ప్రస్తుతం నక్సల్ ఉద్యమం కొన్ని ప్రాంతాలకే, ముఖ్యంగా గిరిజనులు అధిక సంఖ్యలో ఉండే అటవీ ప్రాంతాలకే పరిమితమైంది. గిరిజనులకు వారసత్వంగా సంక్రమించిన అటవీ సంపదను కార్పొరేట్‌శక్తుల బారి నుంచి కాపాడే ప్రయత్నాలకు నక్సలైట్లు మొదటినుంచీ అండగా నిలుస్తున్నారు. అయితే అందుకు వారు సాయుధ మార్గాన్ని ఎంచుకోవడం సమస్య అయింది. నక్సల్ ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా చూసే ప్రభుత్వం పోలీసు బలంతో అణచడం వైపే ఎక్కువగా మొగ్గు చూపడం తెలిసిందే. అందునా కమ్యూనికేషన్స్, నిఘా సాంకేతికత ఎంతగానో విస్తరించిన ప్రస్తుత కాలంలో పోలీసు వ్యవస్థకు ఉండే ఆధిక్యతను తక్కువగా అంచనా వేయలేం. ప్రపంచవ్యాప్తంగా సాయుధ పోరాటాలు విఫలమయ్యాయనేది ఎంత సత్యమో, కేవలం ఆయుధ బలంతో ఉద్యమాలను అణచివేయలేమనేదీ అంతే సత్యం.

ఈ నేపథ్యంలో జరిగిన బస్తర్ ఎన్‌కౌంటర్ అటు ప్రభుత్వ వ్యవస్థ, ఇటు మావోయిస్టులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అగత్యాన్ని నొక్కి చెప్తున్నది. పోలీసుల్లోనూ, నక్సల్స్‌లోనూ అధికంగా బలయ్యేది అట్టడుగు, నిరుపేద వర్గాల యువతే. ఈ దేశ సంపదలో భాగమైన యువత ఇలా హింసాత్మక ఘటనలకు బలైపోవడం బాధాకరమైన విషయం. నక్సల్స్‌కు నెలవులుగా మిగిలిపోయిన గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తే సమస్యకు పరిష్కారం కనుగొనడం సాధ్యమే. అదేవిధంగా నక్సల్స్ కూడా కాలం చెల్లిపోయిన సాయుధ పోరాట వ్యూహాలను వదిలిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాల్సిన అవసరమూ ఉన్నది. ఇప్పటివరకు జరిగిన నష్టం చాలు. ఇకనైనా ఇరుపక్షాలూ పట్టు విడుపులు ప్రదర్శించి ఏకాభిప్రాయానికి వస్తే దేశానికి అంతకన్నా కావాల్సింది ఏముంటుంది.

తిరోగమన దిశలో తెలంగాణ వికాసం



ఏనుగుల రాకేశ్ రెడ్డి

ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పాలన సాగాలి. అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలి. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలకులు పని చేయాలి. కానీ, రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏడాది తిరక్కముందే తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగిన తెలంగాణ తిరోగమనంలో పయనిస్తున్నది. రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ పేరిట జరుగుతున్న విధ్వంసమే అందుకు నిదర్శనం.

స్వరాష్ట్రం ఏర్పడే నాటికి మన తెలంగాణ అనేక సమస్యలకు నిలయం. తెలంగాణలోని పది జిల్లాల్లో హైదరాబాద్ మినహా మిగతా 9 జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరచడమే అందుకు ఉదాహరణ. అలాంటి రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనతికాలంలోనే దేశంలోనే నెంబర్ 1గా ఎదిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్నో అవార్డులు గెలుచుకొని ఆదర్శంగా నిలిచింది. కేసీఆర్ సర్కార్ దార్శనికత, విధానాలు, దూరదృష్టి, విజనరీ నాయకత్వం, అద్భుతమైన పాలనా పటిమ అందుకు ప్రధాన కారణం. పదేండ్లలోనే తెలంగాణ, హైదరాబాద్ అంటే ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ఏర్పడింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటిస్తే 'అసలు మనం హైదారాబాద్‌లోనే ఉన్నామా?' అన్న సందేహం కలిగేలా అభివృద్ధి జరిగింది.

పునర్నిర్మాణం దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తున్న సమయంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మార్పు అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా, మూసీ సుందరీకరణ వంటి అగమ్యగోచరమైన విధానాలతో హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీస్తున్నది. పెట్టుబడులకు స్వర్గధామమైన తెలంగాణ ఇప్పుడు విధ్వంసం దిశగా సాగుతున్నది. కూల్చివేతల కారణంగా రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలైంది.

ఈ కూల్చివేతల విషయంలో ప్రభుత్వం, స్వయంగా ముఖ్యమంత్రే సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను, హైడ్రా బాధితులను ఆక్రమణదారులుగా, సంఘ విద్రోహ శక్తులుగా, కబ్జాదారులుగా చిత్రీకరిస్తున్నారు. ఇది అత్యంత పైశాచికం. ఇల్లు వాకిలితో పాటు జీవనోపాధిని కోల్పోయిన వారంతా చేయని తప్పుకు నిందలు మోస్తూ, సామాజిక వెలివేతకు గురవుతూ మానసిక వేదనను అనుభవిస్తున్నారు.

చాలామందిలో ఒక అపోహ ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటే ఆక్రమిత భూములని అనుకుంటున్నారు. కానీ, అవన్నీ పట్టా భూములే. ప్రభుత్వమే వారికి పట్టాలు ఇచ్చింది. ప్రతి ఇంటి స్థలం సుమారు 20, 30 సార్లు రిజిస్ట్రేషన్ అయింది. ప్రభుత్వం అందుకు పన్నులు కూడా స్వీకరించింది. అందులో గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో పాటు విద్యుత్తు, నీళ్ల కనెక్షన్, రోడ్లు, నాలాలు నిర్మాణాలు చేసి అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఉన్నపళంగా అవన్నీ అక్రమమని అంటే ఎలా? వారంతా ఎక్కడికి వెళ్లాలి? పన్నులు కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములు అక్రమమెలా అవుతాయి?

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలెన్నుకున్న ప్రభుత్వం ప్రజా సంక్షేమార్థమే పని చేయాలి. ఏ ప్రభుత్వానికైనా ప్రజలు సుఖసంతోషాలతో జీవించడమే తొలి ప్రాధాన్యం కావాలి. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చేసే విధ్వంసం అభివృద్ధి ఎలా అవుతుంది? ఒక ప్రభుత్వం అనుమతి ఇస్తే మరో ప్రభుత్వం ఎలా కూలగొడుతుంది? ఒక ఐఏఎస్ అధికారి అనుమతులు ఇస్తే మరో ఐపీఎస్ అధికారి కూలగొట్టడమేంటి? ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో సమాజం పురోగతి సాధిస్తుందా? విధ్వంసం జరిగేచోట వికాసం సాధ్యమవుతుందా? ఈ నేపథ్యంలో నిర్మాణం చేయడం అభివృద్ధా? లేదా కూల్చడం అభివృద్ధా? అన్నది మేధావులు, ప్రజలు ఆలోచించాలి. కూల్చివేతలు పెట్టుబడులను ఆకర్షిస్తాయా? నిలబెడితే పెట్టుబడులు వస్తాయా? అన్నది ప్రభుత్వం, పాలకులు గుర్తించాలి.

అసలు ఇప్పటివరకు మూసీ ప్రాజెక్టుకు సంబంధించి స్పష్టమైన డీపీఆర్ లేదు. ఒక్కో మంత్రి ఒక్కో విధంగా అంచనాలు లెక్క గడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు రూ.50 వేల కోట్లని చెబితే.. ముఖ్యమంత్రి ఏకంగా రూ.1.50 లక్షల కోట్ల అంచనా వ్యయం అవుతుందని చెప్తుండటం కాంగ్రెస్ పాలకుల తీరుకు నిదర్శనం.



చెరువులను, కుంటలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమైతే ముందుగా ఒక కమిటీ వేయాలి. ఏ నిర్మాణాలు అక్రమమో, ఏవి సక్రమ నిర్మాణాలో గుర్తించాలి. ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలి. పట్టా ఇళ్లకు మార్కెట్ ధర నిర్ణయించి నష్ట పరిహారం చెల్లించాలి. ఇలా ఒక విధానం ప్రకారం ముందుకు సాగాలి. అది అసలైన ప్రజా పాలన. హైడ్రా పేరిట చెరువులు, కుంటలు రక్షిస్తామని చెప్పి ఆ చెరువులను పేదల కన్నీళ్లతో నింపడం ప్రజాపాలన అవుతుందా?

హైడ్రాకు అందరూ సమానమే అంటున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క నాగార్జున ఎన్ కన్వెన్షన్ మినహా ఒక్క బడా నాయకుడి ఫామ్ హౌస్ మీదికి కూడా బుల్డోజర్ పంపలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావుల ఫామ్‌హౌస్‌లు పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నప్పటికీ వాటిని కూల్చలేదు. అందుకు విరుద్ధంగా పైసా పైసా పోగుచేసి కట్టుకున్న నిరుపేదల ఇళ్లను మాత్రం నేలమట్టం చేస్తున్నారు.

నదులే నాగరికత నిర్మాతలు. నదుల వెంబడే నాగరికత పరిఢవిల్లుతుంది. అందుకే మూసీ పక్కనే నగరం నిర్మాణమైంది. అలా కాలక్రమంలో వేల కుటుంబాలు మూసీ తీరం వెంబడి ఇళ్లు నిర్మించుకున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వల్ల ఇప్పుడు వారంతా రోడ్డున పడుతున్నారు. ప్రాజెక్ట్ అంటే తాగునీరో, సాగునీరో అందించేది కాదు. నది సుందరీకరణ మాత్రమే.

కాళేశ్వరం, నాగార్జున సాగర్, శ్రీశైలం, దేవాదుల, సీతారామ లాంటి ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేస్తే జరిగే నష్టమేమీ లేదు. జాతి ప్రయోజనాల కోసం జరిగే బృహత్తర కార్యంలో భాగస్వాములు అవుతున్నదందుకు నిర్వాసితులు సంతోషిస్తారు. కానీ, మూసీ సుందరీకరణ అలాంటి కాదు. బడా బాబుల కోసం జరిగే సుందరీకరణ కోసం పేదల బతుకులను ఛిద్రం చేయడమేమిటి?

అసలు ఇప్పటివరకు మూసీ ప్రాజెక్టుకు సంబంధించి స్పష్టమైన డీపీఆర్ లేదు. ఒక్కో మంత్రి ఒక్కో విధంగా అంచనాలు లెక్క గడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు రూ.50 వేల కోట్లని చెబితే.. ముఖ్యమంత్రి ఏకంగా రూ.1.50 లక్షల కోట్ల అంచనా వ్యయం అవుతుందని చెబుతుండటం కాంగ్రెస్ పాలకుల తీరుకు నిదర్శనం.

నమామి గంగా ప్రాజెక్ట్‌కు కిలోమీటర్‌కు రూ.17 కోట్లు ఖర్చు అవుతుండగా.. మూసీ సుందరీకరణకు మాత్రం కిలోమీటర్‌కు రూ.2,727 కోట్లు ఖర్చు అవుతున్నట్టు ప్రాథమిక అంచనా. అంటే నమామి గంగాతో పోలిస్తే ఇది 160 రెట్లు ఎక్కువ. ప్రాజెక్టు మొదలయ్యాక ఇది మరింతగా పెరగొచ్చు.

మూసీ తీరంలో నివసించే వేల ఇండ్లను కూల్చడం ద్వారా నగరంలో భయోత్పాతాన్ని సృష్టించడమే పాలకుల కుట్ర. తద్వారా రియల్ ఎస్టేట్ రంగం కుదేలై పెట్టుబడిదారులు, కార్పొరేట్ కంపెనీలను అమరావతి వైపు తరలించాలన్నది వారి లక్ష్యం. ఈ కుట్ర ఇలా ఉంటే, సినీ పరిశ్రమను సైతం తరలించడానికి భారీ కుట్ర జరుగుతున్నది. ప్రముఖ హీరో నాగార్జునపై మంత్రి కొండా సురేఖ చేసిన దిగజారుడు వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సినీ పరిశ్రమను లక్ష్యంగా చేసుకొని మాట్లాడుతున్నారు. అదే సమయంలో ఏపీకి పరిశ్రమ తరలిరావాలని, అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు ఇస్తామని అక్కడి పాలకులు పిలుపునిస్తుండటంతో సినీ పరిశ్రమ సైతం ఆలోచనలో పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక, సామాజిక దోపిడీని తెలంగాణ ప్రజలు, మేధావులు, విద్యావంతులు గ్రహించాలి. తెలంగాణపై కాంగ్రెస్ పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

పాత పాటే పాడుతున్న రాహుల్!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తాను చిన్న పిల్లాడి మనస్తత్వం ఉన్న 'పప్పూ'ను కాదని నిరూపించడానికి రొడ్డకొట్టుడు ప్రకటనలకు బ్రాండ్ అంబాసిడర్ అవుతున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న ఏ రాజకీయ పార్టీ అయినా పాలకపక్షం పక్షపాత ధోరణులను నిరంతరం ఎండగట్టవచ్చు. కేంద్రంలో సంకీర్ణ సర్కార్‌ను నడుపుతున్న బీజేపీపై గత ఆరు నెలలుగా నేరుగా విమర్శలు ఆయన గుప్పించడం లేదు. దేశంలో సంపద విలువలో, తమ పరిశ్రమల ఆదాయం, లాభార్జనలో అగ్రస్థానాల్లో ఉన్న ముకేష్ అంబానీ, గౌతమ్ అదానీల పేర్లతోనే నరేంద్ర మోదీ సర్కార్‌ను ఎక్కువగా ఎండగట్టడం రాహుల్‌కు ఇష్టమైన వ్యాపకమని దినపత్రికలు చదివేవారికి అర్థమవుతున్నది. వారంలో కనీసం మూడుసార్లు అదానీ, అంబానీల ప్రస్తావన లేకుండా కాంగ్రెస్ పార్టీ సమావేశాల్లో, ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ ప్రసంగం సాగడం లేదు.



నాంచారయ్య మెరుగుమాల

2014 నుంచి కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా లేకుండా బతికింది. 2024 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకోవడంతో రాహుల్‌కు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అనే కొత్తహోదా వచ్చింది. అప్పటి నుంచీ ఈ 'యువనేత'లో ఎనలేని తొందర ఎక్కువైంది. దేశాన్ని ఐదు దశాబ్దాలకు పైగా పరిపాలించిన ప్రభుత్వాలకు కాంగ్రెస్ నాయకత్వం వహించిందనే విషయం తెలియకుండా రాహుల్ మాట్లాడుతున్నారా? అనే అనుమానం వస్తున్నది. పదే పదే అంబానీ, అదానీల పేర్లు ప్రస్తావిస్తూ ప్రధాని మోదీని దుయ్యబట్టే ధోరణి చూస్తుంటే పాత తరం ప్రజలకు దేశంలో 1960లు, 70లు, 80ల చివరివరకూ సాగిన రోజులు గుర్తుకొస్తున్నాయి. దేశంలో మొదటిస్థానంలో ఉన్న పారిశ్రామిక కుటుంబంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ స్థాపకుడు ధీరూభాయ్ అంబానీ పరివారం అవతరించకముందు దాదాపు 50 ఏండ్ల కిందట రెండు కమ్యూనిస్ట్ పార్టీలు, ఇతర ప్రతిపక్షాల నాయకులు 'టాటాలు బిర్లాలు' మాత్రమే దేశంలో ఆర్థికంగా బలపడుతున్నారని, సామాన్య ప్రజానీకం స్థితిగతులు మెరుగుపడడం లేదని తరచు నాటి పాలకపార్టీ కాంగ్రెస్‌పై విరుచుకుపడేవారు. కొన్ని దశాబ్దాలపాటు వ్యాపార లావాదేవీలు, లాభార్జనలో ముందుండి సంపద విలువలో మొదటి పది స్థానాల్లో ఉన్న పారిశ్రామిక గ్రూపుల ఆదాయ వివరాలు అప్పట్లో పత్రికల్లో ప్రచురించినప్పుడు గోద్రెజ్‌లు, సింఘానియాలు, గోయెంకాలు, దాల్మియాలు, కిర్లోస్కర్లు, మోదీలు తదితర కుటుంబాల నియంత్రణలోని పారిశ్రామిక గ్రూపుల పైన మొదటి రెండు ర్యాంకుల్లో టాటాలు, బిర్లాలు ఉండేవారు. అప్పట్లో గుత్తాధిపత్యాన్ని నిరోధించే ఎంఆర్‌టీపీ చట్టం అమలులో ఉండేది. అయినా, టాటాలు, బిర్లాలు సంపదలో, వ్యాపార పరిమాణంలో ఎవరికీ అందనంత దూరంలో ఉన్నత స్థానాల్లో ఉండేవారు. వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు పదే పదే తమ పేర్లు ప్రస్తావించినా ఈ రెండు గ్రూపులూ స్పందించేవి కావు. పాలకపక్షమైన కాంగ్రెస్ పార్టీ మాత్రం కేంద్రంలో, రాష్ట్రాల్లో తిరుగులేని ఆధిపత్యంతో పరిపాలన కొనసాగిస్తూ ఏకైక అతి పెద్ద పాలక జాతీయపార్టీగా వ్యాపారసంస్థల నుంచి విరాళాలు మొదలుకొని అన్నివిధాలా లబ్ధి పొందేది.

మాజీ ప్రధాని నెహ్రూ నాటి పరిస్థితులను తన దృక్పథంతో అంచనా వేసి ప్రవేశపెట్టిన 'లైసెన్స్ కోటా రాజ్' విధానాలు నిజంగానే కొన్ని పారిశ్రామిక గ్రూపులకే అవకాశాలు కల్పించేవి. ఎంఆర్‌టీపీ చట్టం దేశంలో గుత్తాధిపత్యాన్ని ఆశించిన రీతిలో కట్టడి చేయలేకపోయింది. అందుకే ఐదారు దశాబ్దాల కిందట కొన్ని పారిశ్రామిక గ్రూపులే అగ్రస్థానాల్లో కొనసాగాయి. 1991 నుంచీ ప్రధాని పీవీ, ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ ద్వయం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో కొత్త కొత్త రంగాల్లో కొత్త పారిశ్రామికవేత్తల ఆవిర్భావానికి, అలాగే ఐటీరంగంలో ఇన్ఫోసిస్ ఎన్.ఆర్.నారాయణ మూర్తి, విప్రో అజీమ్ ప్రేంజీ వంటి నూతన ఆంత్రపెన్యూర్లు అవతరించడానికి దోహదం చేశాయి.

టాటాలు, బిర్లాలు మాత్రమే అగ్రస్థానాల్లో కొనసాగడానికి కాంగ్రెస్ సర్కార్లు ఎంతవరకు కారణమో చెప్పడం కష్టం. అయితే, 1980లు, 90ల ఆరంభంలో అంబానీలకు కాంగ్రెస్ ప్రభుత్వాల అండదండలున్నాయని, 1990ల చివరినుంచి 2004 వరకూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని రెండు ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వాలు సానుకూలంగా వ్యవహరించాయనే మాటలు వినిపించేవి. వాటిలో నిజం లేదని ఆ తర్వాత ఈ గ్రూపు కంపెనీలు, పరిణామాలు నిరూపించాయి.

భారీ మొత్తాల్లో పెట్టుబడులు పెట్టగలిగే అనుభవం ఉన్న వ్యాపార గ్రూపులకు కొన్ని రంగాలు ఈ 'గ్లోబలైజ్డ్ వెల్ కనెక్టెడ్' ప్రపంచంలో ఎనలేని లాభావకాశాలు ఇస్తాయని మన అనుభవాలు చెప్తున్నాయి. 2024 ఆరంభం నుంచే 'అదానీ, అంబానీ' వ్యాఖ్యలతో బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శల జోరు పెంచారు. తోటి గుజరాతీలైన ముకేష్ అంబానీ, గౌతమ్ అదానీలకు మోదీ సర్కార్ అడ్డగోలుగా ప్రయోజనాలు కల్పిస్తున్నదని కాంగ్రెస్ నేత విరుచుకుపడేవారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య ఈ 'అంబానీ, అదానీ' ఆట ఎందాకా వెళ్లిందంటే కిందటి మే మొదటివారం పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఒక సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. 'ఈ మధ్య అదానీ, అంబానీలపై రాహుల్ మౌనం పాటిస్తున్నారెందుకో మరి? సాధారణ ఎన్నికల షెడ్యూలు వచ్చినప్పటి నుంచీ ఆయన ఈ ఇద్దరి సంగతి ఎత్తడం లేదు. ఆటోల్లో కరెన్సీ కట్టలేమైనా అందుకున్నారా, కాంగ్రెస్ నేత?' అంటూ వ్యంగ్య బాణాలు సంధించారు.



రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముఖ్యమంత్రి సమక్షంలోనే అదానీ గ్రూపు అంగీకారం తెలిపింది. అప్పటికే అదానీ గ్రూపుపై రాహుల్ ఆరోపణలు గుప్పిస్తున్నారు. న్యాయబద్ధమైన పోటీ మూలసూత్రంగా నడిచే పెట్టుబడిదారీ వ్యవస్థలో పాలకుల అడ్డగోలు అండదండలతో కొన్ని కంపెనీలు విశేష లబ్ధి పొందితే అలాంటి విషయాలను ఎండగట్టి, దిద్దుబాటు చర్యలకు దోహదం చేయడం ప్రతిపక్షాల బాధ్యత. 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' అంటే అమెరికాలోనైనా ఐరోపా దేశాల్లోనైనా ప్రజాస్వామిక వాదులు, పౌరులు వ్యతిరేకించే విధానమే. అలాంటప్పుడు రెండు పారిశ్రామిక కుటుంబాల నిర్వహణలోని రెండు గ్రూపులు ఎలా ప్రభుత్వ తోడ్పాటుతో ఎక్కువ లాభాలు సంపాదించాయో సాక్ష్యాధారాలు చూపించకుండా రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ఊళ్లో, చూడండి అదానీ బ్యాంకు ఖాతాల్లోకి నగదు సునామీలా వచ్చిపడుతున్నది. పేదలు, బడుగువర్గాల అకౌంట్ల నుంచి తుఫాన్ మాదిరిగా సొమ్ము ఎగిరిపోతోందని క్లుప్తంగా చెప్పడం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదు.

ఇలాంటి రాహుల్ గంభీర ప్రకటనల ద్వారా 1950లు, 60ల్లో పేదల పాలిట పెన్నిధులుగా ప్రజలు కొన్ని ప్రాంతాల్లోనైనా నమ్మిన కమ్యూనిస్టు నేతల తరహాలో మాట్లాడితే రాహుల్‌కు వచ్చే రాజకీయ ప్రయోజనం శూన్యమే. దశాబ్దం తర్వాత లోక్‌సభలో పదో వంతు సీట్లు సంపాదించి (543 సీట్లకు కనీసం 55 సీట్లు) కాంగ్రెస్ గుర్తింపు పొందిన ప్రతిపక్షంగా అవతరించి, రాహుల్‌కు ఆ పార్టీ నేతగా ఎల్‌ఓపీ హోదా వచ్చిన తర్వాత కూడా తాను 'పప్పూ' స్థాయి నుంచి ఎదగలేదని పదే పదే నిరూపించుకుంటున్నారు.

డా.లోహియా అంబేద్కర్ విచారధారతో నడిచే హిందీ రాష్ట్రాలకు చెందిన 'జనతా పరివార్' పార్టీల అరిగిపోయిన అజెండా అయిన 'కులగణన'ను, మొత్తం కోటాలన్నీ కలిపి 50 శాతం దాటిపోయినా చట్టపరమైన ఇబ్బంది లేకుండా చూడాలనే తమిళనాడుకు చెందిన ద్రావిడ పార్టీల వాదనను తన సొంత ఐడియాలుగా చెప్పుకొంటున్న కాంగ్రెస్ నాయకుడి బాటనే ఈ పార్టీ ప్రాంతీయ నేతలు కూడా నడుస్తున్నారు. కులగణనపై కాంగ్రెస్‌కు పేటెంట్ హక్కు ఉన్నదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఇటీవల చెప్పడం ఈ జాతీయపక్షం దివాలాకోరుతనానికి పరాకాష్ఠ.

టాటా బిర్లాలు అనే నినాదం ఒక్కటే దేశంలో కాంగ్రెసేతర జాతీయ, ప్రాంతీయ పక్షాలకు కొన్ని దశాబ్దాలకు అధికారం సాధించిపెట్టలేదు. అలాగే, అదానీ అంబానీలు అనే అరిగిపోతున్న రాహుల్ మాటలు కాంగ్రెస్‌కు 'బ్రహ్మాస్త్రం' కాలేవని ప్రతి భారత పౌరుడు చెప్తాడు.

ఏ శక్తి వైకల్య ఘడియన శని నెత్తి మీద కూసుందో..! పాడి బర్రెను జారవిడిచి ఎగిరి తన్నే దున్నను తెచ్చుకున్నాం. అదిప్పుడు ఎగిరెగిరి తంతుంటే ఒళ్లంతా గాయాలైతున్నయి. గాయపడ్డ బిడ్డ 'అమ్మా' అనటం ఎంత ప్రాకృతికమో..! నిలువెల్లా గాయపడ్డ తనువులు అంతే ప్రాకృతికంగా 'బాపూ' అని పలవరిస్తూ గుండెలు బాదుకుంటన్నయి.

కొట్లాడటం మనకు కొత్తనా?



వర్ధెల్లి వెంకటేశ్వర్లు



వెనుకటికి ఎండకాలంతో పాటే ఊళ్లకు దొంగల భయం చొరబడేది. ఆ ఊళ్లె దొంగలు పడ్డరు.. ఈ ఊళ్లె దొంగలు పడ్డరు. దోస్కపోయింర్రు అని వదంతులు పుట్టేయి. అవి వదంతులు కావు, నిజం కూడా ఉండేది. తమను తాము కాపాడుకునేందుకు ఊరు, ఊరంతా నిద్రాగారం లేకుండా జాగారం చేసేది. ఇంటికి పంటకు కాకుండా జనం తీవ్ర ఒత్తిడితో ఉండేవాళ్లు. అలిసి విసిగి వేసారి పోయేవాళ్లు. 'ఆరు పథకాలు ఇస్తా.. ఆనాటి రోజులు మళ్లీ తెస్తా' అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పాతర పెట్టి ఆనాటి రోజులను టంచన్‌గా మళ్లీ తెచ్చింది. ఇవ్వాళ తెలంగాణ పట్టణాలు పల్లెలు మళ్లీ జాగారం చేస్తున్నాయి. దొంగరాత్రి వేళ బుల్డోజర్లు వస్తున్నయి. లంకిని పడ్డట్టు ఇళ్ల మీద పడుతున్నయి. కంటి మీది రెప్ప వాలినంతలో గూళ్లను చిదిమేస్తున్నయి. పాలకులు పంపిన రాక్షస బుల్డోజర్లు ఎప్పుడు ఎవరి ఇంటిమీద పడుతయో తెల్వక జనం హడలిపోతున్నరు. వీటికి వదంతులు తోడైనయి. 'అగో వచ్చే.. ఇగో వచ్చే' నంటూ అధికారులే లీకులు వదులుతున్నరు. జనం కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నరు. నిద్ర కాచి ఇంటి కావలి కాసుకుంటున్నరు.

'నా ఇల్లు కూలిపోతంది.. కేసీఆర్ అన్నా రాయే' అని దంపతులు గుండెలు బాదుకుంటా గోసటిల్లిన దృశ్యం మానవ గుండె తడిని తడిమింది. 'సర్ నిలబడ్డ చోటు నుంచి జారిపోతున్నం' అని ఓ తల్లి దీనత్వానికి హరీశ్‌రావే వలవల ఏడ్చిండు. ఒక్క మూసీ నది కాదు.. ముప్పేట సర్కారు బుల్డోజర్లు జనం మీద పడుతుంటే పేద, మధ్యతరగతి కుటుంబాలు కకావికలమైపోతున్నయి.

ఇది ఊహించని ఆపదైతే కాదు. ఎన్నికలకు ముందే కేసీఆర్ పసిగట్టి చెప్పిండు. లోకం పోకడను గమనించే..! 'మనం చెదిరిపోయిననాడు మళ్లీ పాత తెలంగాణ వస్తది. బతుకులు ఆగమైతయి. మోసపోతే గోసపడుతం. చెప్పటం నా బాధ్యత. ఒక్కసారి దెబ్బ తింటే..! ఉన్న కూర్పు చెడిపోతే తెలంగాణ సమాజానికి మంచిది కాదు' అని కేసీఆర్ మా జిల్లా కేంద్రం సూర్యాపేట సభలో వ్యథభరిత స్వరంతో చెప్పిండు. అసుంటపోయి ఖమ్మం సభల చెప్పిండు. అదేమాట పాలమూరు, ఇందూరుల చెప్పిండు. కానీ, మన చెవికెక్కలేదు. ఆ సందర్భంలో తెలంగాణ ఆగమైపోతదేమో..! అనే బాధే కానీ.. తన మదిన రాజ్యకాంక్ష ఇసుమంతైనా లేదు. రాజకూటం మీద యావే ఉంటే.. వీళ్లను జూట కొట్టడం పెద్ద పనే కాదు. కానీ, ఆయన మహాభారతం, రామాయణ ఇతిహాసాలను ఔపోసన పట్టిన నిర్వికారుడు. విలువల వైరుధ్యాలను, నైతిక సంఘర్షణను రాజకీయ ప్రయోజనాలకు ఆపాదించటాన్ని నిర్ద్వంద్వంగా తృణీకరించిన నిరాకారి. భవిష్యత్తు నిర్ణయాన్ని జనానికే వదిలేశారు. కానీ, మనం జూట మెరుపులకే తలవంచినం. కేసీఆర్ మీద ఎందుకంత కోపం వచ్చిందని అడిగితే..! 'సద్ది తిన్న కాడ రేవు తల్వమా... తిన్నోళ్లము చెప్పమా.. సారు మీద మాకెక్కడిది. కేసీఆర్ పాలనుండగ సంసారం పాలు పొంగినట్టు ఉండే. కానీ 'నేను అంతిత్త.. ఇంతిత్త' అని శని మీద పడ్డట్టే మీది మీదికొచ్చే అన్నది కల్వకుర్తి మధునవ్వ. మానవ స్వభావమే లోభం ద్వేషంల సంగమం. దాన్ని పెంచి పోషించి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ.

ఆ కర్మ ఫలమే ఈ కాంగ్రెస్ పాలన. మన తలరాతను మనమే తిరగరాసుకోవాలి గాని, ఆత్మహత్య చేసుకోవటం పరిష్కారం కాదు. తన బిడ్డల ఇంటిని 'హైడ్రా' భూతం కబళిస్తుందనే భయంతో బుచ్చమ్మ అనే తల్లి ఉసురు తీసుకున్నది. ఆమెను చూసి ఇంకొకరు ఆ ప్రయత్నం చేయవద్దు. ఇప్పుడు దొంగ పొద్దు కాలమే నడుస్తున్నది. కానీ, మనకు రాజ్యహింస కొత్త కాదు.. కొట్లాడటం కొత్త కాదు. రజాకార్ల కండ్లళ్ల కారం కొట్టి రాజ్యం తెచ్చుకున్నవాళ్లం. సోనియాగాంధీ మెడలు వంచి తెలంగాణను గుంజుకున్నవాళ్లం. ఈ హైడ్రాలు, అమీబాలు మనకు లెక్కే కాదు. మొన్న హరీశ్‌రావు రాల్చిన కన్నీటి చుక్కలకే సర్కారు కూసాలు కదిలినయి. రజాకార్లు ఊళ్ల మీద పడ్డనాడు గుత్ప సంఘం పుట్టింది. దొంగలు ఊళ్ల మీద తెగబడ్డ రోజుల్లో తెగుబాటు ఊరును కాపాడుకున్నది.

కేసీఆర్ తెలంగాణ ఉద్యమం నడిపినప్పుడు యువజన సంఘం, మహిళా సంఘం, కూలీ సంఘం, కులసంఘం పురుడు పోసుకున్నయి. మళ్లీ జనం సంఘటితం కావాలి. ప్రజా ఉద్యమాలకు ఊపిరిపోయాలి. దండు కడితే నేనే ముందుంటనని హరీశ్‌రావు మాటిచ్చిండు.

ఈ సందిట్లనే మళ్లీ గోతి కాడి నక్కల కూత మొదలైంది. కేసీఆర్ ఏడీ.. ఏడీ అని వగలు పోతున్నరు. అవన్నీ ఢిల్లీ ప్రేరిత గుంట నక్కల ఊలలే. కేసీఆర్‌ది అప్పుడైనా, ఇప్పుడైనా శిష్ట రక్షణకు, దుష్ట శిక్షణకు కృష్ణావతారమే. జనానికి తన అవసరం ఉంటేనే ప్రత్యక్ష ఉద్యమంలోకి వస్తారు. ఇక కంఠం తెగినా వెన్ను చూపడు. కడదాకా నిలబడుతాడు. గాలి రాజకీయాలు.. చిల్లర ఎత్తులు వేసే నేత కాదు. మదింపు లేనిదే ఏ పని చేయడు. వ్యూహాలను నిర్ణయించటం, వాటిని మదించటం.. వాంఛిత ఫలితాలను నిష్కర్షగా అమలుచేయటం ఆయన నైజం. జనం గోస ఆయనకెప్పుడో సుతిముట్టింది. ఆయన మనసిప్పుడు వాయుగుండం ఏర్పడ్డ సముద్రం. వేయి ఆలోచనల ఘర్షణ సంగమం. ఒక్క హైడ్రా కాదు, పిశాచ పాలకుల జేజమ్మ దిగివచ్చినా పేదింటిని ముట్టుకోలేనంత పక్కా వ్యూహంతో ప్రజల మధ్య నిలబడుతడు. అప్పటి దాకా మన ప్రయత్నం మనం చేద్దాం. సకల జనులం సంఘటితమై కొట్లాడుదాం.

పెండింగ్ ప్రాజెక్టుల టెండర్లు వేగవంతం : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): పెండింగ్ ప్రాజెక్టుల టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఆ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు సీతారామ, డిండి, దేవాదుల తదితర ప్రాజెక్టుల భూసేకరణను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువలు, ఇతర ప్రాజెక్టులకు పాలనాపరమైన అనుమతులు సత్వరమే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిత్యానాథ్‌దాస్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ ఈఎన్‌సీలు పాల్గొన్నారు.

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున?

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జునను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపినట్టు తెలిసింది. దీంతో త్వరలోనే ఉత్తర్వులు విడుదల కానున్నాయి. ప్రస్తుతం ఈఆర్సీ చైర్మన్‌గా తన్నీరు శ్రీరంగారావుతోపాటు ఇద్దరు సభ్యుల పదవీ కాలం ఈ నెల 29తో ముగియనున్నది. అదే రోజు ఈఆర్సీ చైర్మన్‌గా నాగార్జున బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది. వనపర్తి జిల్లాకు చెందిన నాగార్జున జడ్జిగా వివిధ కోర్టుల్లో పని చేశారు. 2019లో కామారెడ్డి జిల్లా జడ్జిగా విధులు నిర్వహించారు. 2022లో హైకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. 2023లో మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయి అక్కడే పదవీ విరమణ పొందారు.



జస్టిస్ నాగార్జున

● శ్రీ రాజరాజేశ్వరీదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి మంగళవారం రాజరాజేశ్వరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

– బంజారాహిల్స్

● కరుణించమ్మా.. శ్రీమహాలక్ష్మి



వర్గల్ విద్యాసరస్వతీ ఆలయంలో ఆరవరోజు మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు, పంచామృతాభిషేకాలతో వర్గల్‌శంభుని గిరికొండలు భక్తులను ఆనందపరవశులను చేశాయి.

– వర్గల్

వైభవంగా శ్రీవారి గరుడ సేవ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : తిరుమల బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడసేవ మంగళవారం వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని చూసి ఆధ్యాత్మిక తన్మయత్వం పొందారు. వెంకటగిరులన్నీ గోవిందనామస్మరణతో మార్మోగాయి. పెద్ద, చిన్న శేష, హంస, సింహ, ముత్యపు పందిరి, కల్ప వృక్ష, సర్వభూపాల వాహనాలపై విహరించిన వేంకటేశుడు.. తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడవాహనంపై భక్తులకు అభయ ప్రదానం చేశారు. మూలవరులకు అలంకరించే లక్ష్మీకాసులహారం, మకరకంఠి ఆభరణాలను మలయప్పస్వామికి అలంకరించారు. టీటీడీ తిరుమాఢ వీధుల్లోని గ్యాలరీల్లో దాదాపు 2 లక్షల మంది భక్తులు కూర్చునే అవకాశం కల్పించారు.

అట్టహాసంగా సాలకట్ల బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఐదోరోజు మలయప్పస్వామి మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగురంగుల పట్టువస్త్రాలు ధరించి, మిరుమిట్లు గొలిపే ఆభరణాలు ధరించి, పల్లకీలో కూర్చొని శ్రీకృష్ణస్వామితో కలిసి మాఢ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో జే శ్యామలరావు, అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి వచ్చాం.. ఇరుక్కుపోయాం!

- పనులు కావు.. పలుకుబడి లేదు
- రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి
- ఫిరాయింపు ఎమ్మెల్యేల అంతర్మథనం
- పట్టించుకునేవారే లేరని ఆవేదన
- గాంధీ భవన్‌కు పోలేరు.. సీఎంను కలవలేరు
- ముఖం చాటేస్తున్న ప్రభుత్వ పెద్ద
- రాగానే పిలవద్దని వ్యక్తిగత నీడకు హుకుం
- ప్రజల్లో నవ్వులపాలయ్యామని ఓ ఎమ్మెల్యే మనస్తాపం!
- ఇల్లిల్లూ తిరిగి కండువా కప్పి.. ఇప్పుడు కలవకపోవడంపై ఆ పది మంది గుర్రు!

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'అధికార పక్షాన ఉంటే.. అనుకున్నది సాధించుకోవచ్చు' అని ఆశపడి గోడ దుంకిన ఎమ్మెల్యేలకు ఆశాభంగమే అయిందా? అటు పనులు చేసుకోలేక.. ఇటు పరువు నిలబెట్టుకోలేక తమ నియోజకవర్గాల్లో ఆ పది మంది తిరగలేకపోతున్నారా? అంటే.. 'అవును' అన్నదే సమాధానం! 'ఇది గ్యారెంటీగా మోసమే.. ప్రజలకు ఇచ్చిన హామీల సంగతేమోగానీ మాకు ఇచ్చిన మాటయితే నిలబెట్టుకుంటరనుకున్నం. అదీ లేదు.. ఇదీ లేదు.. రెంటికీ చెడ్డరేవడిలా మా పరిస్థితి తయారైంది' అని బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ సీనియర్ ఎమ్మెల్యే వాపోవడం వారి పరిస్థితిని బయటపెడుతున్నది. ఇలా ఒకరిద్దరు కాదు.. పార్టీ మారిన 10 మంది, ఆరుగురు ఎమ్మెల్సీలదీ అదే దుస్థితి అని తెలుస్తున్నది. 'కండువా మారేదాకా వెంటపడ్డరు.. ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకున్నపాపాన పోవటంలేదు' అని వాపోతున్నారు. పార్టీలో చేరిన సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకరిద్దరికి హామీని నిలబెట్టుకున్నా, మిగతా వారికి మొండిచెయ్యే చూపారు. అందరికీ 'అజ్ఞాతబంధువు' ఆశీస్సులు ఉండవు కదా? అని వారే నిట్టూరుస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం అటుంచితే.. కనీసం తమను కలిసేందుకు కూడా ముఖం చాటేస్తున్నారని, పైపెచ్చు 'వీళ్లను ఎప్పుడు ప డితే అప్పుడు రానియ్యొద్దని చెప్పిన కదా.. మ ళ్లీ ఎందుకు రానిస్తున్నరు' అని ప్రభుత్వ పెద్ద తన వ్యక్తిగత నీడకు హుకుం జారీ చేశారని చెప్తున్నారు.

అందరిదీ అదే వరుస..

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి ఈ 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే, బీఆర్‌ఎస్‌ను జీరో చేస్తామని, అసలు ఆ పార్టీ అంటూ ఉండదని, ఆ పార్టీలో ఉండి చేసేదేమీ లేదని కాంగ్రెస్‌లో చేరండి అని కాంగ్రెస్ పెద్దలు ఇల్లిల్లూ తిరిగి ఆహ్వానాలు పలికారు. స్వయంగా వీరందరినీ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ చేరుతున్నవారికి ఎదురులేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరి స్థాయిని బట్టి వారి కమిట్‌మెంట్‌కు అనువైన అవకాశం కల్పిస్తానని వాగ్దానం చేసి, కండువా మారిన తెల్లారి నుంచే తమను పట్టించుకోవటం మానేశారని వారు వాపోతున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేరే సమయంలో క్యాబినెట్ మంత్రి హోదాతోపాటు, అన్ని రకాలుగా 'రోజువారీ' రాయబారాలకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని, తీరా అమలు విషయానికి వచ్చేసరికి మొదట్లో సూపర్‌హిట్ సినిమాను తలపించినా తర్వాత బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డట్టయిందని ఆయన గుర్రుగా ఉన్నట్టు స న్నిహితులే చెప్తున్నారు. ఇక ఇచ్చిన పదవి విషయంలోనూ 'పండ్లులేని నోటికి వెలగపండు ఇచ్చి కొరుక్కుతినుమన్నట్టే ఉంది' అని ఆయన మథనపడుతున్నట్టు తెలిసింది. చేరిక ఒప్పందంలో కీలక హామీ.. బకాయిలానే ఉన్నదని, ప్రజల ముందు బకరా అయినట్టు పరిస్థితి ఉన్నదని తన సన్నిహితులతో ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే ఆవేదన వెళ్లగక్కినట్టు తెలిసింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, కడియం శ్రీహరి పరిస్థితి కూడా అధ్వానంగా తయారైందని అంటున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణుల అంశం ఓ వైపు ఇబ్బందిగా మారితే మరోవైపు తమకు సీఎం రేవంత్‌రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటం లేదని మథనపడుతున్నారు. పైపెచ్చు 'వీళ్లను ఎప్పుడు పడితే అప్పుడు రానివ్వద్దు' అని వీరిలో ముగ్గురిని ఉద్దేశించి వారికి వినపడేలానే పేర్కొనటంతో కంగుతినటం ఆ ఎమ్మెల్యేల వంతు అయిందట! అటు నియోజకవర్గంలో, ఇటు పార్టీలో తమకు ఎలాంటి ప్రాధాన్యత లేక, తాము చేరిన ప్రయోజనం నెరవేరుతుందన్న నమ్మకం లేక పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రజల్లో కనిపించటం లేదని అంటున్నారు.

హెచ్చరికలో భాగంగానే తిరిగొచ్చే మంతనాలు?

అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కలిసి తాము కాంగ్రెస్‌లో ఇమడలేకపోతున్నామని, తిరిగి బీఆర్‌ఎస్‌లోకే వస్తామని మంతనాలు సాగించిన విషయం బయటికి పొక్కింది. మీడియాలో ఆ భేటీ పతాకస్థాయి కావడంతో పరిస్థితిని పసిగట్టిన సీఎం, మంత్రి జూపల్లి కృష్ణారావును రంగంలోకి దింపి కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి రాయబేరం నెరపటంతో అప్పటికప్పుడు ఘర్‌వాపసీకి బ్రేకులు పడ్డాయి. ఇదే అదనుగా పార్టీ మారిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు అల్టిమేటం జారీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నపళంగా రంగంలోకి దిగి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో 'కిం కర్తవ్యం' భేటీ నిర్వహించారు. ఫలితంగా ఒకరిద్దరికి పదవులు దక్కినా అవీ 'గురువు' ఆదేశాలతోనేననే ప్రచారం జరుగుతున్నది.

ముందు నుయ్యి వెనుక గొయ్యి..

పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. గాంధీభవన్‌కు వెళ్లలేరు.. సీఎంను నేరుగా కలువలేరు అన్నట్టు తయారైంది. జగిత్యాల, గద్వాల, పటాన్‌చెరు, చేవెళ్ల, స్టేషన్‌ఘన్‌పూర్, ఖైరతాబాద్, బాన్సువాడ సహా దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ వర్సెస్ చేరికవర్గం మధ్య తీవ్ర అగాథం నెలకొన్నది. స్థానిక నేతల మధ్య పొసగని బంధం పోరు కుంపట్లను రాజేస్తున్నది. బయటకు సుస్థిర ప్రభుత్వమని చెప్తున్నా లోపల అస్థిర కాంగ్రెస్‌గా మారిపోయిందని, ఒకవేళ అనర్హత వేటుపడితే తమ రాజకీయ భవిష్యత్తుకు తామే సమాధి కట్టుకునట్టు అవుతుందని సదరు ఎమ్మెల్యేలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నట్టు తెలిసింది.

డీఏలు చెల్లించండి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): దసరా కానుకగా ఉద్యోగులకు పెండింగ్ డీఏలను చెల్లించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని జేఏసీ నేతలు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి, కే రామకృష్ణ, జీ నిర్మల, రమేశ్ తదితరులున్నారు.

ఐసెట్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐసెట్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదలయ్యింది. 15,16 తేదీల్లో విద్యాసంస్థల్లోనే స్పాట్ ద్వారా సీట్లను భర్తీచేస్తారు.ఖాళీల వివరాలను https://tgicet. nic.in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి: టీఎన్జీవో

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): దీపావళిలోపు ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. మరోవైపు టీఎన్జీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, మహిళా నేతలు ఉమాదేవి, శైలజ, అనురాధ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని టీఎస్ యూటీఎఫ్ ఖరారుచేసింది.

డిసెంబర్ 1న మిలిటరీ కాలేజీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(డెహ్రాడూన్)లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష డిసెంబర్ 1న జరగనున్నది. దరఖాస్తుల స్వీకరణ గడువు సెప్టెంబర్ 30తో ముగియగా, ఈనెల 10వరకు పొడిగించినట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

ఎంబీబీఎస్‌కు 32 మంది గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 32 మంది గురుకులాల విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్టు సొసైటీ కార్యదర్శి రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి అభినందించారు.

పీజీఈసెట్ రెండో విడత సీట్ల కేటాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): పీజీఈసెట్ రెండో విడత సీట్లను మంగళవారం కేటాయించారు. 4,221 సీట్లు భర్తీ అయ్యాయి. 14 నుంచి 17 వరకు రిపోర్ట్ చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు సూచించారు.

గ్రూప్-1 కోసం ఒక్కో సెంటర్‌లో ఒక పోలీస్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఒక్కో సెంటర్‌కు ఒక్కో పోలీసు అధికారి, ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు. ఇవి గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు కల్పిస్తున్న పటిష్ట బందోబస్తు. 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్ పరీక్షలను నిర్వహించనున్నారు.

విదేశీ యాత్రలు ఘనం | సాధించింది శూన్యం

- ఇప్పటికే ఐదు దేశాల్లో పర్యటించిన సీఎం
- వరుసగా టూర్లు వేస్తున్న మంత్రులు
- అత్యధిక శాతం అమెరికాకే టికెట్
- లెక్కే లేని ఢిల్లీ పర్యటనలు



హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'విదేశీ యాత్రలు ఘనం.. సాధించింది శూన్యం' అన్నట్టుగా తయారైంది మంత్రుల పరిస్థితి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలే అయినా, దాదాపు సగం మంది మంత్రులు విదేశీ టూర్లకు వెళ్లి వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండు దఫాలుగా ఐదు దేశాల్లో పర్యటించారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, తాము వృథా ఖర్చులు తగ్గించి, పొదుపుగా ప్రభుత్వాన్ని నడుపుతామని చెప్తున్న మంత్రులు ఒకరి వెంట ఒకరు విదేశీ పర్యటనలకు వెళ్లిరావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడులను ఆకర్షించడానికే విదేశీ పర్యటనలు అని చెప్పుకుంటున్నా, ఆచరణలో కొత్త పెట్టుబడులు వచ్చిన దాఖలాలు లేవనే విమర్శలొస్తున్నాయి. అంతేకాకుండా ఎక్కువ మంది అమెరికాకే వెళ్లి రావడం గమనార్హం.

ముఖ్యమంత్రి రెండుసార్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు విదేశీ పర్యటనలకు వెళ్లి వచ్చారు. మొదటిసారి ఈ ఏడాది జనవరిలో.. స్విట్జర్లాండ్, బ్రిటన్, దుబాయ్‌లో పర్యటించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్నారు. అక్కడినుంచి లండన్‌కి వెళ్లి థేమ్స్ నదిని పరిశీలించి వచ్చారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్‌పై చర్చలు జరిపారు. తర్వాత దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఆ పర్యటనలో ఆయన వెంట మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా పాల్గొన్నారు. ఈ ఏడాది ఆగస్టులో రెండోసారి విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం అమెరికా, దక్షిణ కొరియా, దుబాయ్‌లో పర్యటించారు. ఈసారి ఆయనతోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. రెండు పర్యటనలతో వేల కోట్ల పెట్టుబడులు సాధించామని ప్రభుత్వం చెప్తున్నా, కొత్తగా ఏ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయో, అందులో ఏవి వాస్తవ రూపం దాల్చాయో చెప్పలేని పరిస్థితి. ముఖ్యంగా ఆగస్టులో జరిగిన అమెరికా పర్యటన తీవ్ర విమర్శలకు దారితీసింది. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి చెందిన స్వచ్ఛ బయో గ్రీన్ సంస్థతో ఒప్పందం అందులో ఒకటి.

మంత్రులూ.. వరుసగా టూర్లు

- మంత్రులు సైతం వరుసగా విదేశీ టూర్లకు వెళ్లివస్తున్నారు. సగటున నెలకోమంత్రి విదేశాల్లో పర్యటిస్తుండటం విశేషం.
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దాదాపు పది రోజులపాటు అమెరికా, జపాన్‌లో పర్యటించారు. మూడు రోజుల క్రితమే తిరిగి వచ్చారు.
- పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన ఈ ఏడాది జనవరిలో స్పెయిన్‌లో పర్యటించారు. గత నెలలో బ్యాంకాక్‌కు వెళ్లి వచ్చారు.
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సీఎంతోపాటు పలు దేశాల్లో పర్యటించారు.
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మేలో అమెరికాలో పర్యటించారు.
- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే రెండుసార్లు అమెరికాలో పర్యటించారు.

ఢిల్లీ టూర్ వయా బెంగళూరు

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 25సార్లు ఢిల్లీకి వెళ్లివచ్చారు. గత 11 నెలల్లో ఆయన సగటున రెండు వారాలకోసారి ఢిల్లీ వెళ్లారు. మంత్రులు సైతం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారో లెక్కలేదు. ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి ఒంటరిగా ఢిల్లీకి వెళ్లిన సందర్భం లేదనే చెప్పొచ్చు. ఒకట్రెండుసార్లు మినహా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి వెళ్లారు. వారితోపాటు ఒకరిద్దరు మంత్రులు వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది. మంత్రులు సొంత పనుల మీద ఢిల్లీకి వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మంత్రివర్గం అత్యధికంగా పర్యటించిన మూడో నగరంగా బెంగళూరును చెప్పుకోవచ్చు. ఢిల్లీ పర్యటనలో సగం కర్ణాటక రాజధాని మీదుగా జరిగాయంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వం ఏర్పడింది మొదలు.. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యేదాకా హైదరాబాద్-బెంగళూరు మధ్య విపరీతమైన రాకపోకలు సాగాయి. బెంగళూరులో ఒక మినీ అధిష్ఠానం నడిచిందని కాంగ్రెస్ వర్గాలే అప్పట్లో జోకులు వేసుకున్నాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలవడానికి రాష్ట్ర మంత్రులు వరుస కట్టారు. ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత కుమ్ములాటలతో ఎదురీదుతుండటంతో ఈ ప్రయాణాలు కాస్త తగ్గినట్టు కనిపిస్తున్నాయి.

ఫలితం ఏముంది?

పెట్టుబడులు తేవడానికి, రాష్ట్ర ప్రయోజనాల కోసం, తెలంగాణ బ్రాండ్‌ను మరింత ప్రచారం చేయడానికి మంత్రులు దేశ, విదేశీ పర్యటనలు చేస్తే ఎవరూ తప్పుపట్టరు. అయితే, ముఖ్యమంత్రి సహా మంత్రుల పర్యటన వల్ల కలిగిన లాభం ఏమిటన్నదే రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఇప్పటివరకు ఒక పెద్ద పెట్టుబడి కూడా రాష్ట్రానికి రాలేదని పారిశ్రామిక వర్గాలు చెప్తున్నాయి. ఢిల్లీ పర్యటనల్లో 90% కేవలం రాజకీయ ప్రయోజనాలు, పార్టీ అంతర్గత వ్యవహారాల కోసమే తప్ప తెలంగాణ కోసం కాదనే ఆరోపణలున్నాయి. బెంగళూరు పర్యటనలు పూర్తిగా రాజకీయ పర్యటనలే. ఇలా మంత్రుల పర్యటనల వల్ల అటు ప్రజాధనం వృథాకావడంతోపాటు ఇటు పాలన కుంటుపడుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు పాలనా వ్యవహారాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షిస్తుంటారని, కానీ గత పర్యటనలో ముఖ్యమంత్రితోపాటు సీఎస్ కూడా వెళ్లారని గుర్తుచేస్తున్నారు. దీంతో పదిరోజులపాటు రాష్ట్రంలో పాలన పడకేసిందని, ముఖ్యమైన ఫైళ్లు అన్నీ ఆగిపోయాయని అంటున్నారు. సీఎం ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ, పాలన స్తంభిస్తున్నదని చెప్తున్నారు.

పర్యటించండి.. పెట్టుబడులు పెట్టండి

అమెరికా పర్యటనలో మంత్రి జూపల్లి పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రపంచస్థాయి మౌలిక వసతులతో పర్యాటకుల, పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణకు రావాలని, కొత్త ప్రదేశాలను చూసి, కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలను పోగేసుకోవాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. అమెరికాలో పర్యటిస్తున్న జూపల్లి మంగళవారం లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు, విదేశీ ప్రతినిధులు, పర్యాటకులు, అక్కడి అధికారులతో మాట్లాడారు. ప్రపంచ స్థాయి ఐటీ, ఆరోగ్య సంరక్షణ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు కేంద్ర బిందువుగా హైదరాబాద్ ఎదిగిందని వివరించారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ఎన్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాజయ్య. చిత్రంలో సుంకె రవిశంకర్, గువ్వల బాలరాజు, ఎర్రోళ్ల శ్రీనివాస్

ఎస్సీ వర్గీకరణ పేరిట రేవంత్ మోసం

- అసెంబ్లీలో సీఎం ప్రగల్భాలు
- వర్గీకరణ అమలులో విఫలం
- ఉద్యోగాల భర్తీలో మాదిగలకు అన్యాయం
- చిత్తశుద్ధి ఉంటే ఆర్డినెన్స్ తేవాలి
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే అన్ని రాష్ట్రాల కంటే ముందే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఢంకా బజాయించి చెప్పారు.. అమల్లో మాత్రం తాత్సారం చేస్తూ మాదిగలను మోసం చేస్తున్నారు' అని బీఆర్‌ఎస్ నేత, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ఎస్సీ స్థానాల్లో రెండింటిలో మాలలు, ఒకటి బైండ్ల సామాజిక వర్గానికి ఇచ్చి మాదిగలకు మొండిచెయ్యి చూపారని విమర్శించారు. మంత్రివర్గంలోనూ మాదిగలకు చోటివ్వలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, సుంకె రవిశంకర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తన తోనే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టించి చిత్తశుద్ధిని చాటుకున్నారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే తెలంగాణలోనే వర్గీకరణను అమలుచేస్తామని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారని తెలిపారు. 65 రోజులవుతున్నా ఆచరణకు ఉపక్రమించనే లేదని తెలిపారు. అగ్రవర్ణానికి చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా ఉపసంఘం ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. వర్గీకరణను పక్కనబెట్టి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ మాదిగ బిడ్డలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ చేసేదాకా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయవద్దని డిమాండ్ చేశారు.

ఆర్డినెన్స్ ఎందుకు తేలే : సుంకె రవిశంకర్

హైడ్రా అమలు కోసం ఆర్డినెన్స్ తెచ్చిన రేవంత్ సర్కారు ఎస్సీ వర్గీకరణపై ఎందుకు తేలేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరిగితే డీఎస్సీలో 1,200 ఉద్యోగాలు మాదిగలకు వచ్చేవని తెలిపారు. రేవంత్‌రెడ్డి మాదిగ ద్రోహిగా మారారని మండిపడ్డారు.

మంత్రివర్గంలో చోటేది?: గువ్వల

ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తేకుండా, మంత్రివర్గంలో మాదిగలకు చోటుకల్పించకుండా సీఎం రేవంత్‌రెడ్డి ద్రోహం చేశారని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో ఎస్జీటీ పోస్టుల్లో ఆరు ఉంటే ఐదు మాలలకు రాగా, ఒక్కటే మాదిగలకు వచ్చిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు జాతీయస్థాయి ఉద్యమానికి సైతం సిద్ధమేనని హెచ్చరించారు.

కాంగ్రెస్ విధానం తేల్చాలి: ఎర్రోళ్ల

ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ విధానాన్ని స్పష్టంచేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలయ్యాక వర్గీకరణ జరిగితే ఏమి లాభమని ప్రశ్నించారు. మాదిగల వాటా తేల్చి నియామకాలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాదిగ ఎమ్మెల్యేలు నోరు విప్పాలని, ఎస్సీ వర్గీకరణపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మాదిగల ఉద్యమానికి బీఆర్‌ఎస్, కేసీఆర్ అండగా ఉన్నారని తెలిపారు.

సంపూర్ణ కులగణన!


- బీసీ, ఎస్సీలతోపాటు అన్ని కులాల
- సంఖ్యను తేల్చే యోచనలో సర్కారు
- జీఏడీ లేదా మరో శాఖ ద్వారా కులగణన
- సీనియర్ అధికారికి కులగణన బాధ్యతలు?
- రెండ్రోజుల్లో సీనియర్ మంత్రులతో భేటీ



హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సంపూర్ణ కులగణన చేపట్టే దిశగా సర్కారు కసరత్తు చేస్తున్నది. ఎస్సీ, బీసీ కులగణన మాత్రమే కాకుండా అన్ని కులాల వివరాలను సేకరించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అంశాలపై మంత్రివర్గ ఉపసంఘాలు, కమిషన్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆయా వర్గాల జనాభా సంఖ్యను తేల్చేందుకు రెండు వేర్వేరు సర్వేలు చేపట్టే బదులు, మొత్తంగా కులగణన చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నది. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, లా సెక్రటరీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులగణనపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అధికారులు పర్యటించి రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రభుత్వం ఇప్పటికే బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, కులగణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. కర్ణాటక, బీహార్, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన ఎలా చేశారు? ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు? ఆయా రాష్ట్రాల్లో ఎదురైన సమస్యలను ఎలా పరిష్కరించారు? తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. కర్ణాటకలో బీసీ కమిషన్ ద్వారా, బీహార్‌లో జీఏడీ ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా సర్వేచేసిన తీరుపై చర్చ జరిగింది. ఈ మూడు రాష్ట్రాల్లోని మంచి పాలసీని తీసుకొని తెలంగాణలో అమలుచేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణకు కులగణన సర్వే నివేదిక అవసరమున్నందున, పూర్తిస్థాయిలో సమగ్రంగా కులగణన చేపట్టాలని, ఇందుకు అవసరమైన వివరాలను ఏవిధంగా సేకరించాలనే అంశంపై సమాలోచనలు చేశారు. కులగణన నివేదిక పారదర్శకంగా రూపొందించేందుకు బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలకు సంబంధం లేకుండా జీఏడీ లేదా పంచాయతీరాజ్ లేదా రెవెన్యూ శాఖలకు ఆ బాధ్యతను అప్పగిస్తే ఎలా ఉంటుందనే విషయంపై చర్చించారు. దీనిపై సమగ్రంగా చర్చించేందుకు రెండు, మూడు రోజుల్లో సీనియర్ మంత్రులతో కీలక సమావేశం ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కుల గణన ప్రక్రియను సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని, కులగణన ప్రారంభించిన తర్వాత నెలలోగా పూర్తిచేయాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల వ్యతిరేకి

- ఎస్సీ వర్గీకరణ అమలులో సీఎం విఫలం
- వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలెలా భర్తీచేస్తారు?
- రేవంత్ వైఖరిపై నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



రవీంద్రభారతి, అక్టోబర్ 8:(నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణను అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల వ్యతిరేకిగా మారారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా టీచర్ పోస్టులను ప్రభుత్వం ఎలా భర్తీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాలలకు అనుకూలంగా ఉంటూనే మాదిగలను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ కచ్చితంగా అమలు చేసి తీరుతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్.. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ప్రతి జిల్లాలో అంబేద్కర్ విగ్రహాల నుంచి నల్లజెండాలతో ర్యాలీలుగా బయల్దేరి కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. నేడు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శనలు చేపడుతామని చెప్పారు.

పదవి పోతుందనే సీఎంకు భయం?

సీఎం పదవి పోతుందనే భయంతోనే రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేయలేదని మందకృష్ణ మాదిగ విమర్శించారు. వర్గీకరణ చేస్తే మాల సామాజిక వర్గానికి చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు ఆగ్రహానికి గురై పదవి కోల్పోవాలా? అని రేవంత్‌రెడ్డి మాదిగ ఎమ్మెల్యేలతో అన్నారని, అవసరమైతే త్వరలో ఆ ఎమ్మెల్యేల పేర్లను బయటపెడతానని స్పష్టంచేశారు.

మంత్రి దామోదరను చూసి సిగ్గుపడుతున్న!

ఎస్సీ వర్గీకరణ చేయకుండానే 9న ఎల్బీ స్టేడియంలో టీచర్ ఉద్యోగాలకు నియామకపత్రాలు అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి వల్ల మాదిగ టీచర్ అభ్యర్థులకు తీరని నష్టం జరిగిందని మందకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ కోటా నుంచి మంత్రి అయిన దామోదర రాజనరసింహను చూసి సిగ్గుపడుతున్నానని మందకృష్ణ వ్యాఖ్యానించారు. మాదిగల ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే వర్గీకరణ చేసే వరకు ఉద్యోగ నియామకాలు ఆపించాలని డిమాండ్ చేశారు. అనుబంధ సంఘాలతో ఈ నెల 15న సమావేశమై, ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, ఇందుకు జరిగే పరిణామాలకు కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, శ్యాంసన్, సోమశేఖర్, కార్తీక్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు, బీసీలు, దళితులకు ప్రోత్సాహం

- ఎంఎస్‌ఎంఈ విధానంలో ప్రాధాన్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) విధానంలో మహిళలు, వెనుకబడిన తరగతులు, దళిత పారిశ్రామిక వేత్తలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మంగళవారం రాష్ట్రస్థాయి జిల్లా పరిశ్రమల కేంద్రాల జనరల్ మేనేజర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎంఈ హ్యాండ్‌బుక్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలు ప్రధాన లబ్ధిదారులుగా ఉన్న పీఎం విశ్వకర్మ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. జైకా మద్దతుతో చేపడుతున్న ఎంఎస్‌ఎంఈ పథకాలు గరిష్ఠ స్థాయిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ మల్సూర్, ఉన్నతాధికారులు ఎస్ స్వామినాథన్, రామానంద శుక్లా, గౌరి మొన్వా నీ, ఆర్ శ్రీనివాస్, రవివర్మ, బావయ్య పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ కేంద్రం

అహ్మదాబాద్‌లోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో తెలంగాణలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. మంగళవారం ఈడీఐఐ డైరెక్టర్ జనరల్ సునీల్ శుక్లా సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమై శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు.

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్

మొదటిపేజీ తరువాయి...

తీర్మానించింది. వెంటనే కార్యాచరణ రూపొందించాలని నిర్దేశించింది. సచివాలయంలో మంగళవారం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపసంఘం నాలుగోసారి సమావేశమైంది. వైస్ చైర్మన్, మంత్రి దామోదర, సభ్యులుగా ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, సీతక్క, సీఎస్ శాంతి కుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, లా సెక్రటరీ తిరుపతి హాజరయ్యారు. ఇతర రాష్ట్రాల్లో వర్గీకరణ అమలుతీరుపై చర్చించారు. గతంలో ఎస్సీలను 4 గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఎస్సీ జనాభాలో మార్పులు వచ్చి ఉంటాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరిగా 4 గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు వర్తింపజేయాలా? లేదంటే తమిళనాడు, పంజాబ్ తరహాలో రెండు గ్రూపులుగా విభజిస్తే ఎలా ఉంటుంది? న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయా? అనే విషయంపై చర్చించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే అధికారుల బృందం తమిళనాడు, పంజాబ్‌లో పర్యటించి ఎస్సీ వర్గీకరణ అమలుపై అధ్యయనం చేసిందని తెలిపారు. ప్రభుత్వానికి నివేదించిందని వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉపకులాల వర్గీకరణ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని చెప్పారు. విద్య, ఉద్యోగ నియామకాలతో సహా సమగ్ర సమాచారంతో నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాభిప్రాయ సేకరణకు త్వరలో జిల్లాల్లో పర్యటించనున్నట్టు వెల్లడించారు. నిర్దేశిత కాలపరిమితిలో వర్గీకరణపై అధ్యయనాన్ని పూర్తిచేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. బీసీ కుల గణనకు కూడా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్యారెంటీల గారడీతో బొక్కబోర్లా

- హర్యానా తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- గ్యారెంటీలకు వారంటీ లేదని తేలిపోయింది
- రాహుల్‌గాంధీ ఇప్పటికైనా బుద్ధితెచ్చుకోవాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



'అలవి కాని హామీలతో గద్దెనెక్కాలని చూసిన కాంగ్రెస్‌కు జనం కర్రుకాల్చి వాత పెట్టారు. హర్యానా ప్రజల తీర్పుతో గ్యారెంటీలకు వారెంటీ లేదని స్పష్టంగా తేలిపోయింది. -కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హర్యానా ప్రజలు కాంగ్రెస్‌కు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కర్ణాటకలో 5గ్యారెంటీలు, తెలంగాణలో 6 గ్యారెంటీలని అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, 7 గ్యారెంటీల పేరిట హర్యానా ప్రజలను మభ్యపెట్టాలని చూసిందని, కానీ అక్కడి ప్రజలు కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టారని విమర్శించారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తున్నద ని చెప్పడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రాంతీయ పార్టీలకే సత్తా

కాంగ్రెస్‌తో హోరాహోరీ ఉన్న రాష్ట్రా

> హర్యానాలో ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలి. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలుచేయకుంటే కాంగ్రెస్‌కు ఇంతకంటే పెద్ద ఎదురు దెబ్బలు తప్పవు. -కేటీఆర్

ల్లోనే బీజేపీ గెలుస్తున్నదని కేటీఆర్ తెలిపారు. ఆ పార్టీ ఓటమికి రాహుల్ గాంధీ బలహీన నాయకత్వం కూడా ప్రధాన కారణమని స్పష్టంచేశారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకే ఉన్నదని, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ ఫలితాలు కూడా రెండు జాతీయ పార్టీలకు ఏమాత్రం ఆశాజనకంగా ఉండే అవకాశం లేదని తెలిపారు. ఈ ఫలితాలు చూస్తుంటే 2029లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌కు సాధారణ మెజార్టీ సాధ్యం కాదన్నది తెలిసిపోతున్నదని వివరించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ బుల్డోజర్‌రాజ్‌లు, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే వ్యవహారాలు నడుస్తుంటే రాహుల్ గాంధీ చూసీ చూడనట్టు వ్యవహరించిన తీరును దేశం గమనిస్తున్నదని, పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగిన చందంగా తాను చేసే పనులను ప్రజలు గుర్తించరని భావించటం రాహుల్‌గాంధీ అమాయకత్వమని పేర్కొన్నారు.

దండగ మారి పాలనలో పస్తులు

పండుగ సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కుటుంబాలను పస్తులుంచొద్దని ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. 'దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు' అని ఘాటుగా విమర్శించారు. పంచాయతీ వర్కర్స్, మున్సిపాలిటీ కార్మికులు, హాస్పిటల్ సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్ ఇలా ప్రతిశాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు విలవిలలాడుతున్నారని తెలిపారు.

గౌతంగౌడ్ పోస్టులో తప్పేముంది?

జర్నలిస్టు గౌతంగౌడ్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో తప్పేముందని డీజీపీని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ వీడియో షేర్ చేసినందుకు కేసు పెడతారా? అని ఎక్స్ వేదికగా ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రైతు మల్లయ్యను వారి స్వగ్రామంలో తాను కూడా కలిశానని, రైతు పరిస్థితి ఎలా ఉందో ఆరా తీశానని, అంతమాత్రానికే కేసు పెడతారా? అని ప్రశ్నించారు.

> కాంగ్రెస్‌తో పోటీ ఉన్న చోటే బీజేపీ గెలుస్తున్నది.. బీజేపీని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉన్నదనే విషయం ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు స్పష్టం చేసినయ్. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉన్నది. -కేటీఆర్

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది!

- కాంగ్రెస్‌ను ఈడ్చికొట్టిన హర్యానా ఓటర్
- ఏడు గ్యారెంటీలతో ఏమార్చాలనుకొన్న హస్తానికి దిమ్మదిరిగేలా భారీ షాక్
- కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ఎఫెక్ట్‌తో అప్రమత్తమై.. ఎవరూ ఊహించని తీర్పు
- మ్యాజిక్ మార్క్‌కు 9 సీట్ల దూరంలో స్టాప్
- 3 రాష్ట్రాల్లో వైఫల్యాలే మెమొరాండంగా జవాబు

> కాంగ్రెస్ అధిష్ఠానం భయపడినట్టే అయ్యింది. కర్ణాటక, తెలంగాణను చూపించి హర్యానాలో, దాన్ని చూపించి రానున్న మహారాష్ట్ర ఎన్నికల్లో పాగా వేయాలనుకొన్న హస్తం నేతలకు పెద్ద షాక్ తగిలింది. కర్ణాటక, తెలంగాణలో పాలనా వైఫల్యాలు హర్యానా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపొచ్చన్న రాహుల్‌గాంధీ హెచ్చరికలే చివరకు నిజమయ్యాయి.లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఏమోగానీ.. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హర్యానాలో కాంగ్రెస్ ఏడు గ్యారెంటీల వ్యూహం బెడిసికొట్టింది. 10 గ్యారెంటీలంటూ హిమాచల్‌ను దివాలా తీసేలా చేసి, 5 గ్యారెంటీల పేరిట కర్ణాటకను అథోగతి పాల్జేసి, 6 గ్యారెంటీలంటూ తెలంగాణను నిండాముంచిన కాంగ్రెస్ చేష్టలను హర్యానా ఓటర్ జాగ్రత్తగా గమనించాడు. అదును చూసి సిరా చుక్కతో కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఎంతలా అంటే, హర్యానా పీఠం కాంగ్రెస్‌దే అని అన్ని ఎగ్జిట్ పోల్స్ ఢంకా భజాయించి చెప్పినా.. మా తీర్పే సపరేటు అన్నట్టు ఓటరు మహాశయుడు వ్యవహరించాడు. వెరసి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, హర్యానాలో మెజారిటీ మార్క్‌కు ఆమడ దూరంలో కాంగ్రెస్ ఉసూరుమన్నది.

ఊరించి.. ఉసూరుమనిపించి..

హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 5న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈ సారి కాంగ్రెస్‌కే ఓటరు పట్టం కడతాడంటూ అన్ని ఎగ్జిట్ పోల్స్ తమ అంచనాలను వెలువరించాయి. అయితే, మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఓటరు వినూత్నమైన తీర్పునిచ్చాడు. 7 గ్యారెంటీలతో ఆకట్టుకోవాలనుకొన్న హస్తానికి రిక్తహస్తం ఇచ్చాడు. 90 స్థానాలకు గానూ కాంగ్రెస్‌ను 37 స్థానాలకే పరిమితం చేశాడు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 46 మ్యాజిక్ ఫిగర్‌కు 9 సీట్ల దూరంలో హస్తాన్ని నిలువరించాడు. తొలుత ట్రెండ్స్‌లో కాంగ్రెస్ మెజారిటీ మార్క్‌ను దాటి 48కి పైగా స్థానాల్లో ముందంజలో ఉన్నట్టు ఫలితాల సరళి నమోదైంది. దీంతో హర్యానా పీఠం తమదేనని కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి మిఠాయిలు పంచుకొంటూ పటాకులు కాల్చారు. అయితే, 3, 4 రౌండ్ల నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రకటించిన అన్ని రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థులు వెనుకంజలో ఉండటం కనిపించింది. చివరకు 37 స్థానాలకే పరిమితమైంది.

ఏడు హామీలతో ఆకట్టుకోవాలని..

హిమాచల్ ప్రదేశ్‌లో 10 గ్యారెంటీలు, కర్ణాటకలో 5 గ్యారెంటీలు, తెలంగాణలో 6 గ్యారెంటీలతో అధికారాన్ని చేజిక్కించుకున్నట్టే హర్యానాలో 7 గ్యారెంటీల పేరిట పీఠాన్ని ఎక్కాలని కాంగ్రెస్ భావించింది. రాష్ట్ర బడ్జెట్ పరిమితి కూడా పట్టించుకోకుండా మ్యానిఫెస్టోలో 7 గ్యారెంటీల పేరిట అలవిగాని హామీలను కురిపించింది. మహిళలకు నెలకు రూ. 2 వేలు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ. 6 వేలు, రూ. 500కు ఎల్పీజీ, రూ. 25 లక్షల ఉచిత వైద్యం, 100 గజాల స్థలంతో ఇండ్లు, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, కులగణన, ఓల్డ్ పెన్షన్ స్కీమ్, ఎమ్మెస్పీకి చట్టబద్ధత వంటి



హామీలిచ్చింది. ఇవన్నీ అమలు చేయాలంటే రూ. 1.90 లక్షల కోట్లు ఉన్న రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా ఏకంగా రూ. 70 వేల కోట్లు (బడ్జెట్‌లో 37 శాతం) అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు. హామీలకే ఇంత కేటాయింపులు పోతే, అభివృద్ధి, పాలన, సంక్షేమం మాటేమిటని విమర్శలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ, కాంగ్రెస్ ముందుకే వెళ్లింది.

అప్రమత్తమైన హర్యానా ఓటరు

కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో హిమాచల్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా అంచుకు చేరింది. చివరకు పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి నిధులను తీసుకొనే స్థాయికి దిగజారింది. గ్యారెంటీలకు, రాయితీలకు కోత పెట్టింది. కర్ణాటకలో 5 గ్యారెంటీల అమలుకు పెట్రోల్, డీజిల్ ధరలను సర్కారు అమాంతం పెంచింది. సేల్స్ ట్యాక్స్ పేరిట వడ్డింపులకు తెరతీసింది. ఇక, ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పది నెలల్లోనే తెలంగాణను అప్పుల కుప్పగా మార్చింది. ఒకటి అరా హామీలు మినహా మరే ఇతర గ్యారెంటీలను అమలు చేయలేదు. పైగా ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకొంటూ విమర్శలు మూటగట్టుకొన్నది. ఇవన్నీ గమనించిన హర్యానా ఓటరు ఎంతో చాకచక్యంగా వ్యవహరించాడు. 7 గ్యారెంటీల వలలో పడితే తమ పని కూడా ఇంతేనని ముందే గ్రహించాడు. అసత్యాల హస్తానికి సిరా చుక్కతో గట్టి దెబ్బ కొట్టాడు.

దివాలా అంచున హిమాచల్

2022 చివర్లో జరిగిన హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. ఇదేమీ పట్టించుకోకుండా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్వీందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది. ఆఖరికి పెన్షన్ల శాఖలో ఉండే పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి సైతం ప్రభుత్వం డబ్బును వాడుకుంది. మొత్తం 14 సబ్సిడీలపై కోతలు విధించేందుకు సిద్ధమైంది. తమ జీతాలు రెండు నెలలు వాయిదా వేసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. కాంగ్రెస్ పాలనలో తలసరి అప్పు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.1.17 లక్షల అప్పు భారం ఉంది.

పన్నులతో కర్ణాటకలో మోత

5 గ్యారెంటీలను ఆశగా చూపెట్టి కిందటి ఏడాది మేలో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలపై పన్నుల వాతను కొనసాగిస్తున్నది. ఐదు హామీల అమలుకు అవసరమైన నిధుల కోసం సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నది. పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచుతూ నోటిఫికేషన్ జారీచేసింది. పెట్రోల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 25.92 నుంచి 29.84 శాతానికి (3.92 శాతం పెరుగుదల), డీజిల్‌పై 14.3 శాతం నుంచి 18.4 శాతానికి (4.1 శాతం పెరుగుదల) పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. ఐదు హామీలను అమలు చేయాలంటే రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.52 వేల కోట్ల భారం పడుతుంది. దీంతో గ్యారెంటీల అమలుకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోడానికి ఛార్జీల పెంపు, పన్ను వసూళ్లకు సర్కారు తెగబడుతున్నది. గైడెన్స్ వాల్యూ ట్యాక్స్, దేశీయ లిక్కర్‌పై, బీర్లపై అదనపు ఎక్సైజ్ డ్యూటీ, కొత్తగా రిజిస్టరైన రవాణా వాహనాలపై అదనపు సెస్, రూ.25 లక్షల పైబడిన ఎలక్ట్రికల్ వాహనాలపై లైఫ్‌టైమ్ ట్యాక్స్ విధించింది. ఇక, 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీసింది. మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీంకు కొత్త ఆంక్షలు జోడించింది. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చింది. బస్సు సర్వీసులను తగ్గించింది. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీంలోనూ కోతలు విధిస్తున్నది. అంతేకాదు, ముడా, వాల్మీకి తదితర స్కాంలతో కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు చిరునామాగా మారింది.

తెలంగాణ 'హస్త'వ్యస్తం

6 గ్యారెంటీల పేరిట తెలంగాణలో నిరుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అటకెక్కించింది. ఒకటీ, అరా పాక్షికంగా అమలు చేసి చేతులు దులుపుకొన్నది. మహాలక్ష్మి పథకంలో ప్రధానమైన హామీ ప్రతీ మహిళకు నెలకు రూ. 2,500 సాయం ఇంకా అమలుకాలేదు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత వంటి హామీలను గాలికొదిలేసింది. రుణమాఫీ అంటూ ప్రకటించి అభాసుపాలైంది. 10 నెలల వ్యవధిలో రూ. 73 వేల కోట్ల అప్పుచేసి రాష్ట్రాన్ని అథోగతిపాల్జేసింది. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చెరువుల పరిరక్షణ పేరిట హైడ్రాను తెరమీదకు తెచ్చిం ది. పేదల ఇండ్ల కూల్చివేతే టార్గెట్‌గా హైడ్రా చర్యలు ఉండటంతో ప్రజాక్షేత్రం నుంచి విమర్శలపాలైంది. ఆర్‌ఆర్‌ఆర్ రూట్ మ్యాప్, మూసీ రివర్ ఫ్రంట్‌లో పెద్దయెత్తున అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు రావడంతో రేవంత్ సర్కారుపై ఢిల్లీలోని అధిష్ఠానం కూడా ఒకింత ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం.

జాతీయ పార్టీలపై ప్రజల్లో విముఖత

కశ్మీర్, హర్యానా ఫలితాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ): కాశ్మీర్‌లో బీజేపీని, హర్యానాలో కాంగ్రెస్‌ను విశ్వసించలేదని, రెండు జాతీయ పార్టీలపై ప్రజల్లో విముఖత ఉన్నదనేది స్పష్టమైందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల గారడీని హర్యానా ప్రజలు విశ్వసించలేదని ఫలితాలు తేల్చిచెబుతున్నాయని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేసిన మోసాన్ని హర్యానా ప్రజలు నిశితంగా గమనించారని పేర్కొన్నారు. ఈ ఫలితాలు చూసిన తర్వాత అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతీకార, దృష్టి మళ్లింపు రాజకీయాలు మానుకొని, ఆరు గ్యారెంటీలను, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు.

రేవంత్‌రెడ్డికి ఆశాభంగం!

- ఢిల్లీ నుంచి నిరుత్సాహంతో వెనుదిరిగిన సీఎం
- హర్యానా ఓటమితో అంతా తలకిందులు

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ) : హర్యానా ఎన్నికల్లో గెలిస్తే తెలంగాణ మోడల్ గెలిచిందని ప్రచారం చేసుకోవాలని ఉవ్విళ్లూరిన సీఎం రేవంత్‌రెడ్డికి శృంగభంగం తప్పలేదు. అనూహ్యంగా కాంగ్రెస్ ఓటమిపాలవ్వడంతో రేవంత్‌రెడ్డి ఎవరితోనూ మాట్లాడకుండా.. ఎవర్నీ కలవకుండా నిరుత్సాహంతో రాష్ట్రానికి తిరిగి పయనమయ్యారని తెలిసింది. ఎలాగూ కాంగ్రెస్ గెలుస్తుంది కాబట్టి ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ తెలంగాణ మోడల్ గెలిచిందని ప్రచారం చేయాలని రేవంత్‌రెడ్డి తొలుత భావించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి మీడియా వాళ్లకు సమాచారం కూడా ఇచ్చారు. కానీ తీరా ఫలితాలు తారుమారు కావడంతో ప్రెస్‌మీట్‌ను రద్దు చేసుకున్నారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్‌ఎంసీజీపై పామాయిల్ పిడుగు


న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.



బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.


దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.



ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షల్లో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ట్రానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్ఎస్ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.

పీఆర్టీయూలో పదవుల కొట్లాట!

- రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు పోటాపోటీ
- ఒకరి నామినేషన్ తిరస్కరణతో గొడవ, తోపులాట
- ఉద్రిక్తతల మధ్యే పదవుల ప్రకటన, ప్రమాణస్వీకారం
- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి



శ్రీపాల్‌రెడ్డి



దామోదర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శ పదవుల ఎన్నిక విషయంలో గలాటా చోటుచేసుకున్నది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన పీఆర్టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన ఈ ఘటనలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి శ్రీపాల్‌రెడ్డితోపాటు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి దామోదర్‌రెడ్డితోపాటు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి నామినేషన్లను దాఖలు చేశారు. చర్చల అనంతరం మోహన్‌రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోగా, దామోదర్‌రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంపై అభిప్రాయ సేకరణ జరపగా 30కి పైగా జిల్లాల ప్రతినిధులు శ్రీపాల్‌రెడ్డికి మద్దతు పలికారు. అయినా సురేశ్ పోటీకే మొగ్గుచూపారు. దీంతో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ఈ ప్రక్రియలో అధ్యక్ష పదవికి పోటీచేసిన సురేశ్‌ను బలపరిచిన వ్యక్తి తాను ఆయన్ను బలపరచడాన్ని ఉపసంహరించుకున్నట్టు ప్రకటించడంతో సురేశ్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించారు. దీంతో శ్రీపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సమయంలో ఆయన వర్గీయులు సమావేశంలో గొడవకు దిగారు. ప్రమాణస్వీకారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. ఈ గలాటా మధ్యే రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సురేశ్ వర్గం సమావేశం నుంచి బయటికెళ్లిపోయింది. ఆ తర్వాత మంగళవారం జరిగిన మావేశానికి హాజరైన సురేశ్.. సోమవారం జరిగిన ఘటనకు చింతిస్తున్నట్టు ప్రకటించడం కొసమెరుపు.

ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: కూర రఘోత్తంరెడ్డి

రెండేండ్లుగా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను దసరా పండుగ లోపు చెల్లించాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పీఆర్టీయూ కౌన్సిల్ సమావేశాల అనంతరం ఆయన మాట్లాడుతూ సరెండర్ లీవులు, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, రెగ్యులర్ వేతనాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను ఏకమొత్తంలో చెల్లించాలని, దసరా కానుకగా, ఐదు డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలుచేయాలని, నగదురహిత హెల్త్‌కార్డులను జనవరిలోగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు బీ మోహన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ సంఘ బాధ్యులు పేరి వెంకట్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, గుర్రం చెన్నకేశవరెడ్డి, గుండు లక్ష్మణ్, మనోహర్ రావు, గీత తదితరులు పాల్గొన్నారు.



డీజీపీ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న డీజీపీ జితేందర్, డీజీ శిఖాగోయెల్, మహిళా సిబ్బంది

ప్రకృతి పండుగ బతుకమ్మ : డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రకృతి ప్రసాదించిన పూల పండుగ బతుకమ్మ అని, తీరొక్క పూలతో ఆడబిడ్డలు సంబురంగా జరుపుకునే ఈ వేడుకకు ఎంతో ప్రాముఖ్యత ఉందని డీజీపీ జితేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ మాట్లాడుతూ.. బతుకమ్మల నిమజ్జనంతో చెరువుల్లోని నీరు శుభ్రమవుతుందని శాస్త్రీయంగా నిరూపితమైందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ కార్యాలయ మహిళా సిబ్బందితో కలిసి డీజీ శిఖాగోయెల్, ఏడీజీ స్వాతిలక్రా, డీఐజీ రెమా రాజేశ్వరి, మహిళా ఎస్పీలు బతుకమ్మ ఆడారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఏడీజీ మహేశ్‌భగవత్, ఐజీలు సత్యనారాయణ, రమేశ్‌రెడ్డి, రమేశ్‌నాయుడు, ఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

- తొలుత రెండు జిల్లాల్లో కొనుగోలు
- సమీక్షించిన మంత్రులు సీతక్క, పొన్నం

హైదరాబాద్, అక్టోబరు 8 (నమస్తే తెలంగాణ): మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ద్వారా బస్సులను కొనుగోలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పనకోసం వారి ద్వారా కొనుగోలు చేసిన బస్సులను హైర్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని నిర్ణయించింది. మంగళవారం సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో రవాణా శాఖ, పీఆర్, ఆర్డీ ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. తొలివిడతలో ప్రయోగాత్మకంగా సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లా కరీంనగర్‌లోని మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని నిర్ణయించారు. తొలుత 100 నుంచి 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయనున్నారు. వాటి నిర్వహణ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలన్నింటితో సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డీఏలు వెంటనే విడుదల చేయాలి: టీఎస్ఎస్ఏ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు రావాల్సిన డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ అసోసియేషన్(టీఎస్ఎస్ఏ) డిమాండ్ చేసింది. అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. డీఏల కోసం రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సద్దుల బతుకమ్మ రోజును సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. సచివాలయంలో ఎన్నికలు జరిపించాలని విన్నవించారు.దసరా తర్వాత సచివాలయం ఎలక్షన్లు జరిగేలా చూస్తామని వేం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారని వారు వెల్లడించారు.

భారీ తేడాతో గెలిస్తేనే..



శ్రీలంకతో భారత్ నేడు కీలక పోరు

సెమీస్ చేరాలంటే నెట్ రన్‌రేట్ కీలకం

మ్యాచ్‌కు హర్మన్‌ప్రీత్ అనుమానమే!

దుబాయ్: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో బుధవారం మరో కీలక పోరుకు తెరలేవనుంది. సంక్లిష్టంగా ఉన్న సెమీస్ అవకాశాలను దాటుకుని రేసులో నిలవాలంటే భారీ తేడాతో గెలవాల్సిన మ్యాచ్‌కు భారత మహిళల క్రికెట్ జట్టు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా దుబాయ్ వేదికగా బుధవారం రాత్రి టీమ్‌ఇండియా.. శ్రీలంకతో తలపడనుంది. నెట్ రన్‌రేట్ అత్యంత కీలకమైన భారత్‌కు ఈ మ్యాచ్‌లో అసాధారణ ఆటతీరుతో ప్రత్యర్థిని ఓడిస్తేనే సెమీస్ అవకాశాలు మెరుగవుతాయి. గ్రూప్-ఏలో పాకిస్థాన్‌తో పాటు రెండేసి మ్యాచ్‌లు ఆడినా భారత్ నెట్ రన్‌రేట్ -1.127తో నాలుగో స్థానంలో ఉండగా పాక్‌కు +0.055తో మూడో స్థానాన ఉంది. ఈ నేపథ్యంలో లంకతో మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తేనే భారత్ సెమీస్ రేసులో నిలుస్తుంది.

బ్యాటర్లు జూలు విదిల్చాల్సిందే..

ఈ టోర్నీలో ఆడిన గత రెండు మ్యాచ్‌లలో భారత్ బ్యాటింగ్ విభాగం విఫలమైంది. ధనాధన్ ఆటతో ఆది నుంచే ప్రత్యర్థులపై విరుచుకుపడే షఫాలీ వర్మ, స్మృతి మంధాన క్రీజులో నిలబడలేకపోతున్నారు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో షఫాలీ 2 పరుగులే చేయగా మంధాన 12 రన్స్ చేసింది. పాక్‌తో షఫాలీ 32 పరుగులతో రాణించినా ఆమె సహజశైలికి భిన్నంగా నిదానంగా ఆడింది. మంధాన 7 పరుగులే చేసి నిష్క్రమించింది. జెమీమా, రిచా వంటి హిట్టర్లు భారీ షాట్లు ఆడాల్సి ఉంది. పాక్‌తో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కాగా లంకతో ఆమె ఆడేది అనుమానంగానే ఉంది. దీంతో మిడిలార్డర్‌లో జెమీమా, రిచాపై అదనపు భారం పడనుంది.

బోణీ కోసం లంక ఆరాటం..

ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన లంకకూ ఈ మ్యాచ్ కీలకమే. నేటి పోరులో ఓడితే ఆ జట్టు ప్రపంచకప్ నుంచి అధికారికంగా నిష్క్రమించినట్టే అవుతుంది. సారథి చమరీ ఆటపట్టు మంచి ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు కలిసొచ్చేదే. గత రెండు మ్యాచ్‌లలో ఓడినా లంకను తేలికగా తీసుకుంటే తప్పులో కాలేసినట్టే అన్న విషయం భారత్‌కు బాగా గుర్తే. ఈ ఏడాది ముగిసిన ఆసియా కప్‌లో ఆ జట్టు భారత్‌కు షాకిచ్చిన విషయాన్ని మన అమ్మాయిలు మరువరాదు.



100మీ విజేతలు గణేశ్, కైఫ్

ముగిసిన తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 8: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల రెండో రోజు జరిగిన బాలుర అండర్-18 100మీ రేసులో గణేశ్ స్వర్ణ పతకంతో మెరిశాడు. ఇదే విభాగంలో హర్షవర్ధన్, అశోక్ వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. బాలుర అండర్-20 100మీ రేసులో కైఫ్‌కు పసిడి లభించగా, రాఘవేంద్ర, గణేశ్‌కు రజత, కాంస్యాలు ఖాతాలో వేసుకున్నారు. 100మీ రేసులో షేక్ సుహానీ(అండర్-18), ప్రవళిక(అండర్-20) స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. జావెలిన్‌త్రో(అండర్-20)లో స్వామి పసిడి విజేతగా నిలిచాడు. ముగింపు కార్యక్రమంలో పారాలింపియన్ దీప్తి, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేశ్, అసోసియేషన్ ప్రతినిధులు సారంగపాణి, రాజేశ్వర్‌రావు, కుమార్‌యాదవ్, డీవైఎస్‌వో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసీస్ జయభేరి

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 60 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బేత్‌మూనీ(40), ఎలీస్ పెర్రీ (30) బ్యాటింగ్‌తో ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 148/8 స్కోరు చేసింది. అమెలియా కెర్ (4/26) రాణించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కివీస్..స్కట్ (3/3), సదర్లాండ్ (3/21) ధాటికి 19.2 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. మేగన్ స్కట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పాక్ 556 ఆలౌట్

ముల్తాన్: బ్యాటర్లు శతకాలతో విజృంభించడంతో ముల్తాన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్థాన్ 556 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 328/4 వద్ద రెండో రోజు ఆట ప్రారంభించిన పాక్‌కు అఘా సల్మాన్ (104 నాటౌట్) మరో శతకం బాదగా సౌద్ షకీల్ (82) రాణించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లండ్.. రెండో ఓవర్లోనే కెప్టెన్ ఓలీ పోప్ (0) వికెట్‌ను కోల్పోయినా జాక్ క్రాలే (64 బ్యాటింగ్), జో రూట్ (32 బ్యాటింగ్) దూకుడుతో ఇంగ్లండ్ ఒక వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది.

నేడు భారత్, బంగ్లా రెండో టీ20

ఢిల్లీలోనే పట్టేయాలని..

జోరు మీదున్న భారత్.. సిరీస్ కాపాడుకునేందుకు పర్యాటక జట్టు యత్నం



ఢిల్లీ: స్వదేశంలో బంగ్లాదేశ్‌పై మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న భారత క్రికెట్ జట్టు.. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగబోయే రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్వాలియర్‌లో తొలి టీ20 నెగ్గిన ఊపులో ఉన్న సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని యువ భారత్.. ఢిల్లీలోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఒడిసిపట్టుకోవాలని భావిస్తోంది. రిషభ్, అక్షర్, బుమ్రా, గిల్, జైస్వాల్ వంటి స్టార్ ఆటగాళ్లు అందుబాటులో లేకున్నా అభిషేక్, మయాంక్, నితీశ్ లాంటి యువ క్రికెటర్లతోనే సత్తా చాటింది. మరోవైపు తమకంటే తక్కువ అనుభవం ఉన్న జట్టుతో ఆడి తొలి టీ20లో దారుణ పరాభవాన్ని మూటగట్టుకున్న బంగ్లాదేశ్.. ఢిల్లీలో అయినా గెలిచి సిరీస్ ఆశలు నిలుపుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం నాటి మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. ఢిల్లీ పిచ్ బ్యాటర్లకు అనుకూలించే అవకాశాలు మెండుగా ఉండటంతో భారీ స్కోర్లు నమోదయ్యే చాన్స్ ఉంది.

సంజూ, అభిషేక్ ఏం చేసేనో?

రెగ్యులర్ ఓపెనర్లు గిల్, జైస్వాల్‌కు విరామంతో గ్వాలియర్‌లో ఓపెనర్లుగా వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, యువ సంచలనం అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ఈ ఇద్దరూ ఇన్నింగ్స్‌ను ధాటిగానే మొదలుపెట్టినా వాటిని భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా శాంసన్‌కు వరుసగా అవకాశాలిస్తున్నా విఫలమవుతుండటం ఆందోళన కలిగించేదే. ఈ నేపథ్యంలో అతడికి నేటి మ్యాచ్ కీలకం కానుంది. అభిషేక్ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ సూర్య, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దూకుడుగా ఆడగా ఢిల్లీలోనే అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. వీళ్ల దూకుడుతో టార్గెట్‌ను భారత్ 12 ఓవర్లలోనే ఊదేసింది. యువ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి ఫర్వాలేదనిపించినా జట్టులో స్థానాన్ని కాపాడుకోవాలంటే ఇంకా మెరుగ్గా రాణించాల్సి ఉంది. గత మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన మయాంక్ యాదవ్ తన పేస్ పదును చూపిస్తే బంగ్లా బ్యాటర్లకు తిప్పలు తప్పవు. ఈ మ్యాచ్‌లో భారత్ తుది జట్టులో మార్పులేమీ చేయకపోవచ్చు.

సిరీస్ కాపాడుకునేందుకు..

తొలి టీ20లో బ్యాటింగ్ వైఫల్యంతో దారుణంగా ఓడిన బంగ్లాదేశ్.. ఢిల్లీలో మాత్రం పుంజుకోవాలని చూస్తోంది. లిటన్ దాస్, నజ్ముల్ హొసేన్ శాంతో, మహ్మదుల్లా, తౌహిద్ వంటి హిట్టర్లు ఉన్నా వాళ్లంతా నామమాత్రపు స్కోర్లకే పరిమితమయ్యారు. మిరాజ్ ఒక్కడే ఉన్నంతలో ఫర్వాలేదనిపించాడు. కానీ ఢిల్లీలో మాత్రం ఆ తప్పులను మళ్లీ చేయకుండా పక్కా ప్రణాళికతో భారత్‌కు షాకిచ్చి సిరీస్‌పై ఆశలు కాపాడుకోవాలని పర్యాటక జట్టు భావిస్తోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లా బౌలింగ్ కూడా నాసిరకంగా ఉండటం ఆ జట్టుకు ఆందోళన కలిగించేదే.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్‌శర్మ, సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), నితీశ్‌రెడ్డి, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్

బంగ్లాదేశ్: పర్వేజ్ హొసేన్/తాంజిద్, లిటన్ దాస్, శాంతో (కెప్టెన్), తౌహిద్ హృదయ్, మహ్మదుల్లా, జాకీర్ అలీ, మెహిది హసన్ మిరాజ్, రిషద్ హొసేన్, టస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం, ముస్తాఫిజుర్

మహ్మదుల్లా రిటైర్మెంట్



బంగ్లాదేశ్ వెటరన్ బ్యాటర్ మహ్మదుల్లా టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్‌తో హైదరాబాద్ వేదికగా జరిగే మూడో మ్యాచ్ ఈ ఫార్మాట్‌లో తన ఆఖరి మ్యాచ్ అని తెలిపాడు. వన్డే ఫార్మాట్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మహ్మదుల్లా వెల్లడించాడు. 2021లోనే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన అతడు.. వన్డేలలో మాత్రం కొనసాగనున్నాడు.



ఆర్చరీలో డీపీఎస్ అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. గత రెండు రోజులుగా కొల్లూరులో జరుగుతున్న పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ టోర్నీలో 20 రాష్ట్రాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా ఆర్చర్లు ఇందులో పోటీపడ్డారు. డీపీఎస్ ఆర్చర్లు ఏకంగా 22 పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నారు. వేర్వేరు వయసు విభాగపు కాంపౌండ్, రికర్వ్ పోటీల్లో 8 స్వర్ణాలు సహా 7 రజతాలు, 7 కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచారు. డీపీఎస్ చైర్మన్ భీంసేన్, కార్యదర్శి పవన్ విజేతలను అభినందించారు.

అజర్‌పై ఈడీ ప్రశ్నల వర్షం

సుదీర్ఘంగా సాగిన విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డరన్న ఆరోపణల నేపథ్యంలో హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్.. మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యాడు. ఉదయం 11 గంటలకు ఈడీ ఎదుట హాజరైన అజర్‌ను అధికారులు సుదీర్ఘంగా విచారించారు. తన హయం (2020-23)లో చోటు చేసుకున్న అక్రమాలపై పలు కేసులు నమోదైన నేపథ్యంలో అజర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ఏసీబీ నమోదు చేసిన రూ.20 కోట్ల కేసుతో పాటు ప్రస్తుత సీఈవో సునీల్ కాంటె వేసిన కేసు విషయంలో అధికారులు ఇప్పటికే పలు ఆధారాలు సేకరించారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో హెచ్‌సీఏలో తీవ్ర అవకతవకలు జరిగినట్లు వెల్లడైంది. ముఖ్యంగా డీజీ సెట్లు, ఫైర్ ఫైటింగ్ సిస్టమ్స్, కనోపీ మార్చే విషయంలో నిధుల గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. అప్పటి కార్యవర్గంలో ఉన్న అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఇష్టారీతిన మార్కెట్ ధరకు మించి టెండర్ల జోలికి పనులు అప్పజెప్పినట్లు బయటపడింది. ఇదిలా ఉంటే కొంత మంది కావాలనే తనను ఇరికించేందుకు చూస్తున్నారని విచారణ సందర్భంగా అజర్ పేర్కొన్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పరిధి కాకున్నా పవర్ పాయింట్

- విదేశాల నుంచి రాగానే హైడ్రాపై ప్రెస్‌మీట్
- చెరువుల ఆక్రమణలు అంటూ పీపీటీ విడుదల
- ముఖ్యమంత్రి మాటలకు భిన్నంగా వ్యాఖ్యలు
- మున్సిపల్, ఇరిగేషన్.. ఏదీ ఆయనది కాదు
- అయినా గంటన్నర సేపు మీడియాతో ముచ్చట్లు
- డిప్యూటీ సీఎం భట్టి వైఖరిపై కాంగ్రెస్‌లో గుసగుసలు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): విదేశీ పర్యటన ముగించుకుని వచ్చీ రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హడావుడిగా హైడ్రాపై ప్రెస్‌మీట్ పెట్టారు. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలు అంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపు గంటన్నర సేపు మీడియాతో ముచ్చటించారు. ఇంతకు వరకు బాగానే ఉంది. కానీ భట్టి మాటలే అనేక సందేహాలకు తావిచ్చాయి. చెరువులు, మూసీ సుందరీకరణ తదితర అంశాలన్నీ ఇటు పురపాలక, అటు ఇరిగేషన్ శాఖకు సంబంధించినవి. వీటిపై సంబంధిత శాఖల మంత్రులు మాట్లాడితే దానికో అర్థం ఉంటుంది. కానీ, ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో ఉండగానే ఇక్కడ అంతా తానై మీడియా సమావేశం నిర్వహించడంపై కాంగ్రెస్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. విదేశీ పర్యటనలో తాను సందర్శించిన థేమ్స్ నది గురించి ప్రస్తావిస్తూనే.. డిప్యూటీ సీఎం హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులన్నింటినీ మళ్లీ సర్వే చేస్తామని బాంబు పేల్చారు. అంతేకాదు చెరువుల ఆక్రమణలపైనా ఏకరవు పెట్టారు. ఆర్థిక శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం.. ఇంత హడావుడి చేయడంపై అధికారవర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీనికీ ఉప ముఖ్యమంత్రి ఓ సమాధానం చెప్పారు. టీజీ ర్యాక్ (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్) తన పరిధిలోనేదే అంటూ సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. నిజమే... ప్రణాళిక విభాగంలో అదీ ఒక భాగమే. కానీ చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, ఆక్రమణలు అనేది దాని బాధ్యత కాదు కదా!! కేవలం సాంకేతిక సహకారం మాత్రమే కదా ర్యాక్ ఇచ్చేది అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాదు... డిప్యూటీ సీఎం లాజిక్ ప్రకారం టీజీ ర్యాక్ వంటి చిటికెన వేలు బంధంతో అది సాంకేతిక సహకారం అందించే ప్రతి శాఖపైనా డిప్యూటీ సీఎం సమీక్షలు చేపట్టే అవకాశం ఉంటుంది.. నిర్ణయాలు ప్రకటించే అధికారం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ప్రాజెక్టులే టార్గెట్‌గా?!

భట్టి ప్రజెంటేషన్‌లో పలు ఆసక్తికర, అనుమానాస్పద అంశాలు ఉన్నట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చెరువుల ఆక్రమణలే జరగనట్టు డిప్యూటీ సీఎం మాటల్లో ధ్వనించింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెరువుల పరిరక్షణ కంటే.. బీఆర్‌ఎస్‌ను సాధించాలనే రాజకీయ దురుద్దేశమే ఉందని భట్టి మాటల్లో స్పష్టమైంది. ప్రజెంటేషన్‌లో చెరువులు, ఆక్రమణల గుర్తింపు అశాస్త్రీయంగా కనిపించిందనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 65 చెరువుల కబ్జాలను పొందుపరచగా.. 11 బడా నిర్మాణ ప్రాజెక్టులను ఉదహరించారు. వీటిని మాత్రమే టార్గెట్ చేయడంపై భట్టి ఉద్దేశమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డిజిటల్ సర్వేకు ఏఈవోల అంగీకారం

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు ఏఈవోలు అంగీకరించారు. ఈ మేరకు ఉద్యోగుల జేఏసీ మంగళవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో చర్చలు జరపగా... ఏఈవోల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈవోలు అంగీకరించారు. రేపటి నుంచే సర్వే ప్రారంభించాలని, సర్వేలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు వెల్లడించారు. కేంద్ర పథకం డిజిటల్ క్రాప్ సర్వేను చేయబోమని, ఈ కార్యక్రమంతో తమకు పనిభారం ఎక్కువవుతున్నదని ఏఈవోలు సర్వేను బహిష్కరించారు. దీంతో ఉద్యోగుల జేఏసీ కల్పించుకొని ప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, నాయకుడు రామకృష్ణ, ఏవో అసోసియేషన్ నేతలు వైద్యనాథం, శశిధర్‌రెడ్డి, ఏఈవో అసోసియేషన్ నేతలు శ్రావణ్‌కుమార్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

హై రిస్క్‌లో భారీ వెంచర్లు

- డిప్యూటీ సీఎం ప్రజెంటేషన్‌లో 11 బడా నిర్మాణాలు
- వాటన్నింటి విలువ దాదాపు 15 వేల కోట్ల పైమాటే!
- అవన్నీ అక్రమమేనంటూ ప్రకటించిన భట్టి విక్రమార్క
- వాటన్నింటినీ కూల్చేస్తారా? లేదా క్రమబద్ధీకరిస్తారా?
- కోట్లు గుమ్మరించిన కొనుగోలు దారుల్లో టెన్షన్ టెన్షన్



సాండియర్ స్కైలైన్, మియాపూర్‌లోని వెర్టెక్స్ విరాట్, పుప్పాలగూడలోని సుమధుర పాలైస్ రాయల్, సైబర్ సిటీలోని ఒరియానా, నెక్నాంపూర్‌లోని పూజా మ్యాజిక్ బ్రీజ్, బండ్లగూడ జాగీర్‌లోని ఎస్‌ఎంఆర్ వినయ్ బౌల్డర్ వుడ్స్, గోపన్‌పల్లిలోని వజ్రం ఇగ్జోరా, హానర్ సిగ్నాటిస్, పుప్పాలగూడలోని ఫోనిక్స్ 285 కమర్షియల్ బిల్డింగ్, ఫోనిక్స్ 25, వైష్ణవి సింబల్ వంటి నిర్మాణాలు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులను సమీపంలో ఉండే చెరువులు, కుంటలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారనేది ఆరోపణ.

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): 'మియాపూర్‌లో ఉన్న ఒక ఆకాశహర్మ్యం చెరువులో నిర్మితమైంది.. పుప్పాలగూడలో చెరువును ఆక్రమించి ఏకంగా ఐటీ టవర్ నిర్మాణం జరిగింది..' ఇవేవో సామాన్యుడు చేస్తున్న ఆరోపణలు కాదు.. అధికారులు చేసిన హెచ్చరికలు అంత కన్నా కాదు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బహిరంగంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించిన వివరాలు. పదకొండు భారీ నిర్మాణ ప్రాజెక్టులు అక్రమమని ఆయన ఆరోపించారు. వాస్తవంగా ఈ 11 ప్రాజెక్టులు మాత్రమే చెరువుల్లో ఉన్నాయా? హైడ్రా వీటిని కూడా కూల్చేస్తుందా? లేదంటే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందా? దాదాపు రూ.15 వేల కోట్లకుపైగా విలువైన ఈ నిర్మాణ ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకమేనా? కోట్లు గుమ్మరించి కొనుగోలు చేసినవారి పరిస్థితి ఏమిటి? అనే చర్చ సోషల్‌మీడియా వేదికగా నడుస్తున్నది. హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న 11 బడా ప్రాజెక్టులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించాయంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా ఒక నివేదికను విడుదలచేశారు. ఆయా నిర్మాణాలతో చెరువుల స్వరూపమే మారిందని, మనుగడలో లేకుండా పోయాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ స్టేట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. 2014 తర్వాత నగరంలో చెరువుల పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా జరిగాయని పేర్కొన్నారు. దీంతో ఈ బడా నిర్మాణాల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశమే ఇప్పుడు కొనుగోలుదారులను కలవరపెడుతున్నది.

నివేదికలో 11 బడా నిర్మాణాలు

చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులను చెరిపివేసి నిర్మాణాలు జరిగాయంటూ ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో 11 బడా నిర్మాణాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న జాబితాలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని

భట్టి వ్యాఖ్యలతో భయాందోళనలు

చెరువులు, కుంటల పరిరక్షణతో సంబంధం లేకుండా కొన్ని ప్రాజెక్టులను ఎంపిక చేసుకుని భట్టి చేసిన వ్యాఖ్యలు వాటి కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన ప్రాజెక్టులన్నీ ఆక్రమణలేనని డిప్యూటీ సీఎం స్పష్టంచేయడంతో వాటిని కొనుగోలుచేసినవారికి హైడ్రా గుబులు పట్టుకున్నది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ప్రాజెక్టులను ప్రభుత్వం ఏం చేయబోతున్నది? ఆక్రమణలుగా గుర్తించిన ఈ ప్రాజెక్టులను కూల్చివేస్తారా? క్రమబద్ధీకరణ చేస్తారా? లేదా ఆయా బిల్డర్లు, నిర్మాణదారులను భయపెట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నారా? అనే ప్రశ్నలు సొంత పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారాయి.

15 వేల కోట్ల ప్రాజెక్టులకు ఎసరు?

- ఎఫ్‌టీఎల్ భూముల్లో ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ 11 ప్రాజెక్టుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.15 వేల కోట్లపైనే ఉంటుంది. ఇందులో కమర్షియల్ ఐటీ పార్కులతోపాటు రెసిడెన్షియల్, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ భవన నిర్మాణ అనుమతులతోపాటు రెరా ఆమోదం తెలిపిన ప్రాజెక్టులే కావడం గమనార్హం.
- నార్సింగి జంక్షన్‌కు సమీపంలోని పుప్పాలగూడలో సాండియార్ స్కైలైన్ విల్లా నగరంలోనే అత్యంత ఎత్తయిన ప్రాజెక్టుల్లో ఒకటి. 59 అంతస్తులు ఉండే నాలుగు భారీ టవర్లతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఐటీ కారిడార్ కేంద్రంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఖరీదు సుమారు రూ.1,050 కోట్లు. ఈ ప్రాజెక్టు మొత్తం కూడా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది.
- మియాపూర్ రామసముద్రం కుంట సమీపంలో చేపట్టిన వెర్టెక్స్ విరాట్ ప్రాజెక్టును ఎనిమిది ఎకరాలకుపైగా విస్తీర్ణంలో చేపట్టారు. ఈ ప్రాజెక్టులో 1,428 యూనిట్లను ఆరు స్కై స్క్రాపర్లతో సుమారు రూ.1,005 కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం చెరువు భూముల్లోనే నిర్మిస్తున్నారని నివేదిక పేర్కొన్నది.
- పుప్పాలగూడ ఖాజాగూడ సమీపంలో సుమధుర పాలైస్ రాయల్‌ను ఏడు ఎకరాల్లో 52 అంతస్తుల భారీ రెసిడెన్షియల్ టవర్‌ను దాదాపు రూ.215 కోట్లతో నిర్మించారు. దీనిని కూడా చెరువులను ఆక్రమించి నిర్మించారనేది ఆరోపణ.
- మూసాపేటలోని సేవాలాల్‌నగర్‌లో సైబర్‌సిటీ ఒరియానా పేరిట 28 అంతస్తుల భారీ భవంతులను నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లోర్‌కు 10 ఫ్లాట్ల చొప్పున నిర్మిస్తున్నారు. దీని విలువ దాదాపు రూ.820 కోట్లు. దీనిని మూడు టవర్లతో నిర్మిస్తుండగా, ఇందులో ఒక టవర్ పూర్తిగా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నట్టు గుర్తించారు.
- నెక్నాంపూర్ సమీపంలో అల్కాపూర్ టౌన్‌షిప్‌లో మ్యాజిక్‌బ్రీజ్ పేరిట 3.8 ఎకరాల విస్తీర్ణంలో 11 అంతస్తుల్లో భారీ ప్రాజెక్టును చేపట్టారు. దీని విలువ రూ.350 కోట్ల పైమాటే. డిప్యూటీ సీఎం విడుదల చేసిన నివేదిక ప్రకారం దీనిని కూడా సమీపంలో ఉండే కుంటను ఆక్రమించి నిర్మాణం చేపట్టారు.
- బండ్లగూడ జాగీర్‌లోని ఎస్‌ఎంఆర్ బౌల్డర్ వుడ్స్ ప్రాజెక్టును 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందులో 583 ఫ్లాట్లు ఉంటాయి. దీనిని దాదాపు రూ.470 కోట్లతో రెండు భారీ టవర్లతో నిర్మిస్తున్నారు. ఇందులో ఎత్తయిన టవర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నది.
- గోపన్‌పల్లి నుంచి నల్లగండ్ల వెళ్లే మార్గంలో వజ్రం ఇగ్జోరా పేరిట నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 17 ఫ్లోర్లతో కూడిన మూడు భారీ టవర్లను నిర్మిస్తున్నారు. 368 కుటుంబాలు నివాసం ఉండే ఈ ప్రాజెక్టు ఖరీదు రూ.370 కోట్లు. దీనిని కూడా ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మిస్తున్నట్టు నివేదిక తెలిపింది.
- కూకట్‌పల్లి నుంచి హైటెక్‌సిటీ వెళ్లే మార్గంలో హానర్ సిగ్నాటిస్ ప్రాజెక్టును సుమారు రూ.800 కోట్లతో 25 అంతస్తులు ఉండే 18 టవర్లను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో కొంత భాగంగా ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది.
- పుప్పాలగూడ కేంద్రంగా ఫోనిక్స్ సంస్థ 57 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద కమర్షియల్ సెజ్ పార్క్‌ను ఆరు టవర్లలో నిర్మిస్తున్నారు. దీని విలువ రూ.3,900 కోట్ల పైమాటే. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని ఎఫ్టీఎల్‌లోనే నిర్మిస్తున్నట్టు నివేదించారు. అదే సంస్థ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఫోనిక్స్ ట్రైటాన్ ప్రాజెక్టును 19.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నది. దీని మొత్తం విలువ రూ.1,420 కోట్లు. అయితే ఈ ప్రాజెక్టు మొత్తాన్ని కూడా చెరువుల భూముల్లోనే నిర్మించినట్టు గుర్తించారు.
- గచ్చిబౌలిలోని వైష్ణవి సింబల్ ఐటీ కమర్షియల్ పార్క్ విలువ రూ.600 కోట్లు ఉండగా ఈ ప్రాజెక్టు మొత్తం కూడా ఎఫ్టీఎల్ పరిధిలోనే ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు.

పార్లమెంట్ ఆఫీసెస్ ప్రాఫిట్ కమిటీ చైర్మన్‌గా ఈటల



హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తేతెలంగాణ): పార్లమెంట్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ జాయింట్ కమిటీ చైర్మన్‌గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్తు ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యుత్తురంగంలో పనిచేస్తున్న 19వేల మంది ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విద్యుత్తురంగ ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న విద్యుత్తురంగ ఆర్టిజన్ కార్మికులు గత 10 ఏండ్లుగా పదోన్నతులు లేకుండా, వేతనాలు పెరుగకుండా పని చేస్తున్నట్టు పేర్కొన్నారు. నిరంతరం విద్యుత్తు సరఫరాలో కీలకపాత్ర పోషిస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న ఆర్టిజన్స్ జీవితాలు ఇబ్బందులపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్స్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బానోతు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అల్లం ఓదేలు, డిప్యూటీ కార్యదర్శిగా బీ లక్ష్మయ్య, కార్యదర్శులుగా రాజునాయక్, కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రూ.10.61 కోట్ల మోసంలో ఇద్దరి అరెస్టు

- వృద్ధుల 'డిజిటల్ అరెస్టు' కేసులో పురోగతి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధ జంటను 'డిజిటల్ అరెస్టు' చేసి, రూ.10.61 కోట్లు కాజేసిన ఘటనలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) పోలీసులు పురోగతి సాధించారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేపట్టి.. కర్ణాటకకు చెందిన ఇద్దరు సైబర్ నేరస్థులను అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన వృద్ధ దంపతులకు సెప్టెంబరు 10 సాయంత్రం 5 గంటలకు వీడియో కాల్ వచ్చింది. కాల్‌లో మాట్లాడిన ఇద్దరు తమను ముంబై పోలీసులుగా పరిచయం చేసుకున్నారు. ఆ దంపతుల ఆధార్, పాన్‌కార్డులను ఉపయోగించి బ్యాంకు ఖాతా తెరిచారని, దాని ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ.. ఆ నేరాలు రుజువైతే 7 ఏండ్ల వరకు జైలుశిక్ష పడుతుందని బెదిరించారు. ఆ కేసులు లేకుండా చేయాలంటే తమకు కోట్ల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని ఆ వృద్ధ దంపతులు చెప్పడంతో రూ.10.61 కోట్లను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. మోసపోయామని గ్రహించిన బాధితులు.. సీఎస్ పోలీసులను ఆశ్రయించగా బెంగళూరుకు చెందిన వినయ్‌కుమార్ ఖడ్కే, జీహెచ్ మారుతిని అరెస్టు చేసి 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 'టింకన్ టెక్నాలజీస్' ఖాతాకు రూ.4.62 కోట్లు బదిలీ చేసినట్టు గుర్తించారు.

కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రైతులకు మేలుచేసే విధంగా కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ కార్పొరేషన్ల పురోగతికి మంగళవారం సచివాలయంలో చైర్మన్లు, ఎండీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా మానిటరింగ్ మరింత సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని గోదాములను ఒకే గొడుకు కిందకు తీసుకోవాలని సూచించారు.

చెరువును చెరబట్టిన కాంగ్రెస్, టీడీపీ!

- రాష్ట్ర ఏర్పాటుకు ముందే హైదరాబాద్ చెరువుల ఆక్రమణ
- 45% చెరువుల కబ్జాలు ఆ రెండు పార్టీల ఏలుబడిలోనే
- 920 చెరువులకుగాను 421 చెరువుల ఆక్రమణ
- గడిచిన పదేండ్లలో 44 చెరువుల్లో ఆక్రమణలు
- గత ప్రభుత్వాల నిర్వాకాన్ని బట్టబయలు చేసిన భట్టి



సున్నం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలు(ఫైల్)

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్, టీడీపీ హైదరాబాద్ నగరంలోని చెరువులను చెరబట్టాయి. ఈ రెండు పార్టీల ఏలుబడిలోనే మెజార్టీ చెరువులు అన్యాక్రాంతమయ్యాయి. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పిన లెక్కలే చాటింపు వేస్తున్నాయి. డిప్యూటీ సీఎం చెప్పిన లెక్కల ప్రకారం.. హైదరాబాద్‌లో 920 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 225 చెరువులు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. మరో 196 చెరువులను పాక్షికంగా ఆక్రమించారు. మిగిలిన 499 చెరువులు భద్రంగా ఉన్నట్టు భట్టి వివరించారు. అంటే ఈ లెక్కన మొత్తం చెరువుల్లో 421 చెరువులు కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ఆక్రమణకు గురైనట్టు ఆయనే తేల్చేశారు. మొత్తం చెరువుల్లో 45 శాతానికిపైగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందే ఆక్రమణలకు గురైనట్టు స్పష్టంచేశారు.

పదేండ్లలో 44 చెరువులు

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేండ్లలో 20 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, ఉమ్మడి రాష్ట్రంలో పాక్షికంగా ఆక్రమణకు గురైన చెరువుల్లో మరో 24 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉమ్మడి ఏపీలో మరో 127 చెరువుల ఆక్రమణలపర్వం ప్రారంభంకాగా గత పదేండ్లలో ఈ ఆక్రమణలు పెరిగినట్టు వెల్లడించారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురికాగా, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో 20 చెరువులు మాత్రమే పూర్తిగా ఆక్రమణకు గురికావడం గమనార్హం. దీనిని బట్టి ఏ ప్రభుత్వాలు చెరువులను కాపాడాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. డిప్యూటీ సీఎం వెల్లడించిన అంకెలు, లెక్కలే చెరువుల పరిరక్షణలో ఉమ్మడి ఏపీలో పాలించిన కాంగ్రెస్, టీడీపీ పార్టీలు ఏ మేరకు శ్రద్ధ పెట్టాయో, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఏ మేరకు శ్రద్ధ పెట్టిందో స్పష్టం చేస్తున్నాయి.

నాడు ఆక్రమణలు.. నేడు పెడబొబ్బలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నాడు టీడీపీ, కాంగ్రెస్‌లో కీలక నేతలే. నాడు చెరువుల ఆక్రమణలపై సడి చప్పుడు చేయని నేతలు ఇప్పుడు పెడబొబ్బలు పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు లెక్కలు చెప్తున్న డిప్యూటీ సీఎం నాడు ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఏం చేశారని పర్యావరణవేత్తలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పుడు కండ్ల ముందు కబ్జా అవుతున్నా పట్టించుకోకుండా, ఇప్పుడు తాము తప్ప మరెవరూ చెరువులను బాగు చేయలేరనే విధంగా ఏమిటని చర్చించుకుంటున్నారు.

హైదరాబాద్‌లోని మొత్తం చెరువులు	920
ఉమ్మడి ఏపీలో పూర్తిగా ఆక్రమణకు గురైనవి	225
పాక్షికంగా ఆక్రమణకు గురైన చెరువులు	196
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆక్రమణకు గురైనవి	20
గతంలో పాక్షికంగా ఆక్రమణకు గురై, స్వరాష్ట్రంలో పూర్తిగా ఆక్రమణకు గురైనవి	24



సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్

50 ఏండ్ల క్రితం చెరువులు ఎట్లున్నయ్?

- సర్వే ఆఫ్ ఇండియా రికార్డులపై ఆరా
- అధికారులతో హైడ్రా కమిషనర్ భేటీ
- సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి


హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పరిధిలో సమగ్రసర్వేకు ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశమయ్యారు. హబ్సీగూడలోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైడ్రా అధికారుల బృందం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల వివరాలు, ఇతర అంశాలపై సర్వే అధికారులతో చర్చించారు. 1971-72 సర్వే ప్రకారం నగరంలో ఉన్న చెరువులు, వాటి విస్తీర్ణంతోపాటు ప్రస్తుత పరిస్థితి అంశాలపై మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీదా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాలిట్‌తో పాటు ఇతర అధికారులు తమ వద్ద ఉన్న రికార్డులను హైడ్రా బృందానికి చూపించారు. యాభై ఏండ్ల క్రితం నగరంలో ఉన్న చెరువుల పరిస్థితిపై ఆనాటి మ్యాపులతోపాటు నేటి పరిస్థితిని పోలుస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాను సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారంతో పోల్చి చూసుకోవడానికి ప్రస్తుతం హైడ్రా కసరత్తు ప్రారంభించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారించడంలో సర్వే ఆఫ్ ఇండియా భాగస్వామ్యం కోరారు. దీనికి తమ దగ్గర సిబ్బంది కొరత ఉన్నట్టుగా అధికారులు చెప్పినట్టు తెలిసింది. తమ బృందం పనిచేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తితే సర్వే పరంగా సహకారం అందించాలని కమిషనర్ సర్వే అధికారులను కోరినట్టు సమాచారం. మరోవైపు సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదిక తయారు చేయనున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించి.. ప్రాధాన్యక్రమంలో చెరువులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు.

సింగరేణి లాభాలు గోప్యం

- సర్క్యులర్‌లో పేర్కొనని యాజమాన్యం
- కేవలం 33% చెల్లిస్తున్నట్టు ప్రకటన
- కార్మికుల్లో అనేక అనుమానాలు
- ఆది నుంచి టీబీజీకేఎస్ ఆందోళనలు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)/గోదావరిఖని: సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరం లాభాల వాటా 33 శాతాన్ని సోమవారం కార్మికులకు పంపిణీ చేసింది. రూ.796.05 కోట్ల లాభాల వాటా పంపిణీ చేస్తున్నట్టు సర్క్యులర్‌లో పేర్కొన్న యాజమాన్యం.. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలు ఎంత అనేది? పేర్కొనకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో లాభాల ప్రకటన వాటాను చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి అందుకు భిన్నంగా లాభాల వాటా చెల్లిస్తున్నట్టు మాత్రమే పేర్కొన్నది. సంస్థకు ఎంత నికర లాభం వచ్చిందనే అంశాన్ని మాత్రం కప్పిపుచ్చింది. సింగరేణి సంస్థలో కొంతకాలంగా యాజమాన్యం ప్రకటించిన విధంగా రూ.4,701 కోట్ల లాభాల్లో కార్మికుల వాటా 33 శాతం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యం మాత్రం సింగరేణి విస్తరణ అవసరాల కోసం రూ.2000 కోట్లకు పైగా నిధులను పక్కనపెట్టి కేవలం రూ.2,412 కోట్ల నిధులపై మాత్రమే 33 శాతం వాటాగా రూ.796.05 కోట్లను చెల్లిస్తున్నట్టుగా పేర్కొన్నది. వాస్తవంగా సింగరేణి సంస్థ సాధించిన రూ.4,701 కోట్లలో 33 శాతం వాటాగా రూ.1,551 కోట్లు రావాల్సి ఉంది. దాదాపు రూ.755 కోట్లను కార్మికులకు ఇవ్వకుండా లాభాలను తక్కువగా చూపించిందన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవ లాభాలపై వాటా చెల్లించాలని బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు కొంతకాలంగా ఆందోళనలు, ధర్నాలు చేపడుతున్నారు.

కార్మికుల శ్రమను దోచుకున్నారు



కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ప్రభుత్వం సగానికి దోచుకున్నాయి. లాభాల వాటాను రూ. 755 కోట్లు తగ్గించారు. కార్మికులకు రూ.4,701 కోట్లపై 33 శాతం వాటా చెల్లించాల్సి ఉండగా రూ.1,551 కోట్లపై రూ.796 కోట్లు మాత్రమే చెల్లించారు. అంటే కార్మికులకు 16.9 శాతం మాత్రమే చెల్లించారు. ఒక్కో కార్మికుడు రూ.1.80 లక్షలు నష్టపోయాడు. లాభాల వాటా సర్క్యులర్‌లో నికర లాభాలు ఎన్ని వచ్చాయి? ఎంత చెల్లిస్తున్నారనే విషయాన్నే పేర్కొనకపోవడం బాధాకరం. ఇది కార్మికులను మోసం చేయడమే. గుర్తింపు సంఘం ఈ విషయమై ఎందుకు నోరు మెదపడం లేదు. కార్మికుల హక్కులను ప్రభుత్వానికి తాకట్టు పెట్టారు.

-మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

సమగ్ర సర్వే కష్టం!

- తేల్చిచెప్పిన హైడ్రా అధికారులు
- లేక్ ప్రొటెక్షన్ కమిటీలో చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలను తేల్చాలి.. క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేసి రిపోర్టులను మూడు నెలల్లోగా అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో రీసర్వే, కూల్చివేతలకు సంబంధించి కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. 'హెచ్‌ఎండీఏ పరిధిలో అసలు ఎన్ని చెరువులు, కుంటలున్నాయి.. వాటి వివరాలేంటి? ఎఫ్టీఎల్ , బఫర్‌జోన్ నిర్ధారించడానికి ఎలా సర్వే చేస్తారు? శాటిలైట్ మ్యాపులతో పాటు డిజిటల్ సర్వే చేసి తొందరగా పూర్తిచేస్తే హైడ్రా పని మొదలుపెట్టొచ్చు. గతంలో ఉన్నవాటితో పాటు ప్రస్తుతం ఉన్న పరిస్థితిని నిర్ధారించడానికి ఎంత సమయం పడుతుంది? రీసర్వే చేస్తే టెక్నికల్‌గా బలంగా ఉంటుంది కదా!' అని అన్నారు. దీంతో అధికారులు.. రీసర్వే చేయటం సాధ్యం కాదని తేల్చేశారు. శాఖల పరంగా సర్వేయర్ల కొరత, సొంత శాఖల్లో పని ఒత్తిడితో పాటు గ్రేటర్ చుట్టుపక్కల సర్వే చేయాలంటే చాలా కష్టమని చెప్పారు. గత ఇరవై ఏండ్లలో సాధ్యం కాని సర్వేలు ఇప్పుడెలా సాధ్యమని స్పష్టంచేశారు.

పాత రిపోర్టులు ఆధారంగా చేసుకుందాం

చెరువులకు సంబంధించి పాత రిపోర్టులు ఆధారంగా చేసుకుని ముందుకెళ్తే బాగుంటుందని కమిషనర్ అభిప్రాయపడ్డారని తెలిసింది. దీనికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు.. ఈ మధ్యకాలంలో కొన్ని చోట్ల కూల్చివేతలకు వెళ్లినప్పుడు ఎదురైన పలు సందర్భాలను చర్చకు తీసుకొచ్చారు. సర్వే సమయంలో వచ్చే సమస్యలపైనా చర్చ జరిగింది. ఇవన్నీ ఒక ఎత్తయితే సిబ్బంది కొరతతో పాత రిపోర్టులే ఆధారంగా సైట్‌లో పెడదామా! అన్న అంశం కూడా తెరపైకి వచ్చింది. పలు రెగ్యులరైజ్ భూముల విషయాన్నీ రెవెన్యూ అధికారులు ప్రస్తావించారు.

పరిధి కాకున్నా పవర్ పాయింట్

- విదేశాల నుంచి రాగానే హైడ్రాపై ప్రెస్‌మీట్
- చెరువుల ఆక్రమణలు అంటూ పీపీటీ విడుదల
- ముఖ్యమంత్రి మాటలకు భిన్నంగా వ్యాఖ్యలు
- మున్సిపల్, ఇరిగేషన్.. ఏదీ ఆయనది కాదు
- అయినా గంటన్నర సేపు మీడియాతో ముచ్చట్లు
- డిప్యూటీ సీఎం భట్టి వైఖరిపై కాంగ్రెస్‌లో గుసగుసలు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): విదేశీ పర్యటన ముగించుకుని వచ్చీ రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హడావుడిగా హైడ్రాపై ప్రెస్‌మీట్ పెట్టారు. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలు అంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపు గంటన్నర సేపు మీడియాతో ముచ్చటించారు. ఇంతకు వరకు బాగానే ఉంది. కానీ భట్టి మాటలే అనేక సందేహాలకు తావిచ్చాయి. చెరువులు, మూసీ సుందరీకరణ తదితర అంశాలన్నీ ఇటు పురపాలక, అటు ఇరిగేషన్ శాఖకు సంబంధించినవి. వీటిపై సంబంధిత శాఖల మంత్రులు మాట్లాడితే దానికో అర్థం ఉంటుంది. కానీ, ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో ఉండగానే ఇక్కడ అంతా తానై మీడియా సమావేశం నిర్వహించడంపై కాంగ్రెస్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. విదేశీ పర్యటనలో తాను సందర్శించిన థేమ్స్ నది గురించి ప్రస్తావిస్తూనే.. డిప్యూటీ సీఎం హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులన్నింటినీ మళ్లీ సర్వే చేస్తామని బాంబు పేల్చారు. అంతేకాదు చెరువుల ఆక్రమణలపైనా ఏకరవు పెట్టారు. ఆర్థిక శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం.. ఇంత హడావుడి చేయడంపై అధికారవర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీనికీ ఉప ముఖ్యమంత్రి ఓ సమాధానం చెప్పారు. టీజీ ర్యాక్ (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్) తన పరిధిలోనేదే అంటూ సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. నిజమే... ప్రణాళిక విభాగంలో అదీ ఒక భాగమే. కానీ చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, ఆక్రమణలు అనేది దాని బాధ్యత కాదు కదా!! కేవలం సాంకేతిక సహకారం మాత్రమే కదా ర్యాక్ ఇచ్చేది అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాదు... డిప్యూటీ సీఎం లాజిక్ ప్రకారం టీజీ ర్యాక్ వంటి చిటికెన వేలు బంధంతో అది సాంకేతిక సహకారం అందించే ప్రతి శాఖపైనా డిప్యూటీ సీఎం సమీక్షలు చేపట్టే అవకాశం ఉంటుంది.. నిర్ణయాలు ప్రకటించే అధికారం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ప్రాజెక్టులే టార్గెట్‌గా?!

భట్టి ప్రజెంటేషన్‌లో పలు ఆసక్తికర, అనుమానాస్పద అంశాలు ఉన్నట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చెరువుల ఆక్రమణలే జరగనట్టు డిప్యూటీ సీఎం మాటల్లో ధ్వనించింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెరువుల పరిరక్షణ కంటే.. బీఆర్‌ఎస్‌ను సాధించాలనే రాజకీయ దురుద్దేశమే ఉందని భట్టి మాటల్లో స్పష్టమైంది. ప్రజెంటేషన్‌లో చెరువులు, ఆక్రమణల గుర్తింపు అశాస్త్రీయంగా కనిపించిందనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 65 చెరువుల కబ్జాలను పొందుపరచగా.. 11 బడా నిర్మాణ ప్రాజెక్టులను ఉదహరించారు. వీటిని మాత్రమే టార్గెట్ చేయడంపై భట్టి ఉద్దేశమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హై రిస్క్‌లో భారీ వెంచర్లు

- డిప్యూటీ సీఎం ప్రజెంటేషన్‌లో 11 బడా నిర్మాణాలు
- వాటన్నింటి విలువ దాదాపు 15 వేల కోట్ల పైమాటే!
- అవన్నీ అక్రమమేనంటూ ప్రకటించిన భట్టి విక్రమార్క
- వాటన్నింటినీ కూల్చేస్తారా? లేదా క్రమబద్ధీకరిస్తారా?
- కోట్లు గుమ్మరించిన కొనుగోలు దారుల్లో టెన్షన్ టెన్షన్



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): 'మియాపూర్‌లో ఉన్న ఒక ఆకాశహర్మ్యం చెరువులో నిర్మితమైంది.. పుప్పాలగూడలో చెరువును ఆక్రమించి ఏకంగా ఐటీ టవర్ నిర్మాణం జరిగింది..' ఇవేవో సామాన్యుడు చేస్తున్న ఆరోపణలు కాదు.. అధికారులు చేసిన హెచ్చరికలు అంతకన్నా కాదు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బహిరంగంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించిన వివరాలు. పదకొండు భారీ నిర్మాణ ప్రాజెక్టులు అక్రమమని ఆయన ఆరోపించారు. వాస్తవంగా ఈ 11 ప్రాజెక్టులు మాత్రమే చెరువుల్లో ఉన్నాయా? హైడ్రా వీటిని కూడా కూల్చేస్తుందా? లేదంటే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందా? దాదాపు రూ.15 వేల కోట్లకుపైగా విలువైన ఈ నిర్మాణ ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకమేనా? కోట్లు గుమ్మరించి కొనుగోలు చేసినవారి పరిస్థితి ఏమిటి? అనే చర్చ సోషల్‌మీడియా వేదికగా నడుస్తున్నది. హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న 11 బడా ప్రాజెక్టులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించాయంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా ఒక నివేదికను విడుదలచేశారు. ఆయా నిర్మాణాలతో చెరువుల స్వరూపమే మారిందని, మనుగడలో లేకుండా పోయాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ స్టేట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. 2014 తర్వాత నగరంలో చెరువుల పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా జరిగాయని పేర్కొన్నారు. దీంతో ఈ బడా నిర్మాణాల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశమే ఇప్పుడు కొనుగోలుదారులను కలవరపెడుతున్నది.

నివేదికలో 11 బడా నిర్మాణాలు

చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులను చెరిపివేసి నిర్మాణాలు జరిగాయంటూ ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో 11 బడా నిర్మాణాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న జాబితాలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని సాండియర్ స్కైలైన్, మియాపూర్‌లోని వెర్టెక్స్ విరాట్, పుప్పాలగూడలోని సుమధుర పాలైస్ రాయల్, సైబర్ సిటీలోని ఒరియానా, నెక్నాంపూర్‌లోని పూజా మ్యాజిక్ బ్రీజ్, బండ్లగూడ జాగీర్‌లోని ఎస్‌ఎంఆర్ వినయ్ బౌల్డర్ వుడ్స్, గోపన్‌పల్లిలోని వజ్రం ఇగ్జోరా, హానర్ సిగ్నాటిస్, పుప్పాలగూడలోని ఫోనిక్స్ 285 కమర్షియల్ బిల్డింగ్, ఫోనిక్స్ 25, వైష్ణవి సింబల్ వంటి నిర్మాణాలు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులను సమీపంలో ఉండే చెరువులు, కుంటలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారనేది ఆరోపణ.

భట్టి వ్యాఖ్యలతో భయాందోళనలు

చెరువులు, కుంటల పరిరక్షణతో సంబంధం లేకుండా కొన్ని ప్రాజెక్టులను ఎంపిక చేసుకుని భట్టి చేసిన వ్యాఖ్యలు వాటి కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన ప్రాజెక్టులన్నీ ఆక్రమణలేనని డిప్యూటీ సీఎం స్పష్టంచేయడంతో వాటిని కొనుగోలుచేసినవారికి హైడ్రా గుబులు పట్టుకున్నది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ప్రాజెక్టులను ప్రభుత్వం ఏం చేయబోతున్నది? ఆక్రమణలుగా గుర్తించిన ఈ ప్రాజెక్టులను కూల్చివేస్తారా? క్రమబద్ధీకరణ చేస్తారా? లేదా ఆయా బిల్డర్లు, నిర్మాణదారులను భయపెట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నారా? అనే ప్రశ్నలు సొంత పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారాయి.

15 వేల కోట్ల ప్రాజెక్టులకు ఎసరు?

- ఎఫ్‌టీఎల్ భూముల్లో ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ 11 ప్రాజెక్టుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.15 వేల కోట్లపైనే ఉంటుంది. ఇందులో కమర్షియల్ ఐటీ పార్కులతోపాటు రెసిడెన్షియల్, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ భవన నిర్మాణ అనుమతులతోపాటు రెరా ఆమోదం తెలిపిన ప్రాజెక్టులే కావడం గమనార్హం.
- నార్సింగి జంక్షన్‌కు సమీపంలోని పుప్పాలగూడలో సాండియార్ స్కైలైన్ విల్లా నగరంలోనే అత్యంత ఎత్తయిన ప్రాజెక్టుల్లో ఒకటి. 59 అంతస్తులు ఉండే నాలుగు భారీ టవర్లతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఐటీ కారిడార్ కేంద్రంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఖరీదు సుమారు రూ.1,050 కోట్లు. ఈ ప్రాజెక్టు మొత్తం కూడా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది.
- మియాపూర్ రామసముద్రం కుంట సమీపంలో చేపట్టిన వెర్టెక్స్ విరాట్ ప్రాజెక్టును ఎనిమిది ఎకరాలకుపైగా విస్తీర్ణంలో చేపట్టారు. ఈ ప్రాజెక్టులో 1,428 యూనిట్లను ఆరు స్కై స్క్రాపర్లతో సుమారు రూ.1,005 కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం చెరువు భూముల్లోనే నిర్మిస్తున్నారని నివేదిక పేర్కొన్నది.
- పుప్పాలగూడ ఖాజాగూడ సమీపంలో సుమధుర పాలైస్ రాయల్‌ను ఏడు ఎకరాల్లో 52 అంతస్తుల భారీ రెసిడెన్షియల్ టవర్‌ను దాదాపు రూ.215 కోట్లతో నిర్మించారు. దీనిని కూడా చెరువులను ఆక్రమించి నిర్మించారనేది ఆరోపణ.
- మూసాపేటలోని సేవాలాల్‌నగర్‌లో సైబర్‌సిటీ ఒరియానా పేరిట 28 అంతస్తుల భారీ భవంతులను నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లోర్‌కు 10 ఫ్లాట్ల చొప్పున నిర్మిస్తున్నారు. దీని విలువ దాదాపు రూ.820 కోట్లు. దీనిని మూడు టవర్లతో నిర్మిస్తుండగా, ఇందులో ఒక టవర్ పూర్తిగా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నట్టు గుర్తించారు.
- నెక్నాంపూర్ సమీపంలో అల్కాపూర్ టౌన్‌షిప్‌లో మ్యాజిక్‌బ్రీజ్ పేరిట 3.8 ఎకరాల విస్తీర్ణంలో 11 అంతస్తుల్లో భారీ ప్రాజెక్టును చేపట్టారు. దీని విలువ రూ.350 కోట్ల పైమాటే. డిప్యూటీ సీఎం విడుదల చేసిన నివేదిక ప్రకారం దీనిని కూడా సమీపంలో ఉండే కుంటను ఆక్రమించి నిర్మాణం చేపట్టారు.
- బండ్లగూడ జాగీర్‌లోని ఎస్‌ఎంఆర్ బౌల్డర్ వుడ్స్ ప్రాజెక్టును 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందులో 583 ఫ్లాట్లు ఉంటాయి. దీనిని దాదాపు రూ.470 కోట్లతో రెండు భారీ టవర్లతో నిర్మిస్తున్నారు. ఇందులో ఎత్తయిన టవర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నది.
- గోపన్‌పల్లి నుంచి నల్లగండ్ల వెళ్లే మార్గంలో వజ్రం ఇగ్జోరా పేరిట నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 17 ఫ్లోర్లతో కూడిన మూడు భారీ టవర్లను నిర్మిస్తున్నారు. 368 కుటుంబాలు నివాసం ఉండే ఈ ప్రాజెక్టు ఖరీదు రూ.370 కోట్లు. దీనిని కూడా ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మిస్తున్నట్టు నివేదిక తెలిపింది.
- కూకట్‌పల్లి నుంచి హైటెక్‌సిటీ వెళ్లే మార్గంలో హానర్ సిగ్నాటిస్ ప్రాజెక్టును సుమారు రూ.800 కోట్లతో 25 అంతస్తులు ఉండే 18 టవర్లను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో కొంత భాగంగా ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది.
- పుప్పాలగూడ కేంద్రంగా ఫోనిక్స్ సంస్థ 57 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద కమర్షియల్ సెజ్ పార్క్‌ను ఆరు టవర్లలో నిర్మిస్తున్నారు. దీని విలువ రూ.3,900 కోట్ల పైమాటే. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని ఎఫ్టీఎల్‌లోనే నిర్మిస్తున్నట్టు నివేదించారు. అదే సంస్థ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఫోనిక్స్ ట్రైటాన్ ప్రాజెక్టును 19.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నది. దీని మొత్తం విలువ రూ.1,420 కోట్లు. అయితే ఈ ప్రాజెక్టు మొత్తాన్ని కూడా చెరువుల భూముల్లోనే నిర్మించినట్టు గుర్తించారు.
- గచ్చిబౌలిలోని వైష్ణవి సింబల్ ఐటీ కమర్షియల్ పార్క్ విలువ రూ.600 కోట్లు ఉండగా ఈ ప్రాజెక్టు మొత్తం కూడా ఎఫ్టీఎల్ పరిధిలోనే ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు.

పార్లమెంట్ ఆఫీసెస్ ప్రాఫిట్ కమిటీ చైర్మన్‌గా ఈటల



హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తేతెలంగాణ): పార్లమెంట్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ జాయింట్ కమిటీ చైర్మన్‌గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్తు ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యుత్తురంగంలో పనిచేస్తున్న 19వేల మంది ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విద్యుత్తురంగ ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న విద్యుత్తురంగ ఆర్టిజన్ కార్మికులు గత 10 ఏండ్లుగా పదోన్నతులు లేకుండా, వేతనాలు పెరగకుండా పని చేస్తున్నట్టు పేర్కొన్నారు. నిరంతరం విద్యుత్తు సరఫరాలో కీలకపాత్ర పోషిస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న ఆర్టిజన్స్ జీవితాలు ఇబ్బందులపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్స్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బానోతు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అల్లం ఓదేలు, డిప్యూటీ కార్యదర్శిగా బీ లక్ష్మయ్య, కార్యదర్శులుగా రాజునాయక్, కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డిజిటల్ సర్వేకు ఏఈవోల అంగీకారం

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు ఏఈవోలు అంగీకరించారు. ఈ మేరకు ఉద్యోగుల జేఏసీ మంగళవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో చర్చలు జరపగా... ఏఈవోల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈవోలు అంగీకరించారు. రేపటి నుంచే సర్వే ప్రారంభించాలని, సర్వేలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు వెల్లడించారు. కేంద్ర పథకం డిజిటల్ క్రాప్ సర్వేను చేయబోమని, ఈ కార్యక్రమంతో తమకు పనిభారం ఎక్కువవుతున్నదని ఏఈవోలు సర్వేను బహిష్కరించారు. దీంతో ఉద్యోగుల జేఏసీ కల్పించుకొని ప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, నాయకుడు రామకృష్ణ, ఏవో అసోసియేషన్ నేతలు వైద్యనాథం, శశిధర్‌రెడ్డి, ఏఈవో అసోసియేషన్ నేతలు శ్రావణ్‌కుమార్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.10.61 కోట్ల మోసంలో ఇద్దరి అరెస్టు

- వృద్ధుల 'డిజిటల్ అరెస్టు' కేసులో పురోగతి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధ జంటను 'డిజిటల్ అరెస్టు' చేసి, రూ.10.61 కోట్లు కాజేసిన ఘటనలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) పోలీసులు పురోగతి సాధించారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేపట్టి.. కర్ణాటకకు చెందిన ఇద్దరు సైబర్ నేరస్థులను అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన వృద్ధ దంపతులకు సెప్టెంబరు 10 సాయంత్రం 5 గంటలకు వీడియో కాల్ వచ్చింది. కాల్‌లో మాట్లాడిన ఇద్దరు తమను ముంబై పోలీసులుగా పరిచయం చేసుకున్నారు. ఆ దంపతుల ఆధార్, పాన్‌కార్డులను ఉపయోగించి బ్యాంకు ఖాతా తెరిచారని, దాని ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ.. ఆ నేరాలు రుజువైతే 7 ఏండ్ల వరకు జైలుశిక్ష పడుతుందని బెదిరించారు. ఆ కేసులు లేకుండా చేయాలంటే తమకు కోట్ల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని ఆ వృద్ధ దంపతులు చెప్పడంతో రూ.10.61 కోట్లను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. మోసపోయామని గ్రహించిన బాధితులు.. సీఎస్ పోలీసులను ఆశ్రయించగా బెంగళూరుకు చెందిన వినయ్‌కుమార్ ఖడ్కే, జీహెచ్ మారుతిని అరెస్టు చేసి 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 'టింకన్ టెక్నాలజీస్' ఖాతాకు రూ.4.62 కోట్లు బదిలీ చేసినట్టు గుర్తించారు.

కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రైతులకు మేలుచేసే విధంగా కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ కార్పొరేషన్ల పురోగతికి మంగళవారం సచివాలయంలో చైర్మన్లు, ఎండీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా మానిటరింగ్ మరింత సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని గోదాములను ఒకే గొడుకు కిందకు తీసుకోవాలని సూచించారు.

చెరువును చెరబట్టిన కాంగ్రెస్, టీడీపీ!

- రాష్ట్ర ఏర్పాటుకు ముందే హైదరాబాద్ చెరువుల ఆక్రమణ
- 45% చెరువుల కబ్జాలు ఆ రెండు పార్టీల ఏలుబడిలోనే
- 920 చెరువులకుగాను 421 చెరువుల ఆక్రమణ
- గడిచిన పదేండ్లలో 44 చెరువుల్లో ఆక్రమణలు
- గత ప్రభుత్వాల నిర్వాకాన్ని బట్టబయలు చేసిన భట్టి



సున్నం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలు(ఫైల్)

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్, టీడీపీ హైదరాబాద్ నగరంలోని చెరువులను చెరబట్టాయి. ఈ రెండు పార్టీల ఏలుబడిలోనే మెజార్టీ చెరువులు అన్యాక్రాంతమయ్యాయి. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పిన లెక్కలే చాటింపు వేస్తున్నాయి. డిప్యూటీ సీఎం చెప్పిన లెక్కల ప్రకారం.. హైదరాబాద్‌లో 920 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 225 చెరువులు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. మరో 196 చెరువులను పాక్షికంగా ఆక్రమించారు. మిగిలిన 499 చెరువులు భద్రంగా ఉన్నట్టు భట్టి వివరించారు. అంటే ఈ లెక్కన మొత్తం చెరువుల్లో 421 చెరువులు కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ఆక్రమణకు గురైనట్టు ఆయనే తేల్చేశారు. మొత్తం చెరువుల్లో 45 శాతానికిపైగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందే ఆక్రమణలకు గురైనట్టు స్పష్టంచేశారు.

పదేండ్లలో 44 చెరువులు

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేండ్లలో 20 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, ఉమ్మడి రాష్ట్రంలో పాక్షికంగా ఆక్రమణకు గురైన చెరువుల్లో మరో 24 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉమ్మడి ఏపీలో మరో 127 చెరువుల ఆక్రమణలపర్వం ప్రారంభంకాగా గత పదేండ్లలో ఈ ఆక్రమణలు పెరిగినట్టు వెల్లడించారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురికాగా, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో 20 చెరువులు మాత్రమే పూర్తిగా ఆక్రమణకు గురికావడం గమనార్హం. దీనిని బట్టి ఏ ప్రభుత్వాలు చెరువులను కాపాడాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. డిప్యూటీ సీఎం వెల్లడించిన అంకెలు, లెక్కలే చెరువుల పరిరక్షణలో ఉమ్మడి ఏపీలో పాలించిన కాంగ్రెస్, టీడీపీ పార్టీలు ఏ మేరకు శ్రద్ధ పెట్టాయో, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఏ మేరకు శ్రద్ధ పెట్టిందో స్పష్టం చేస్తున్నాయి.

నాడు ఆక్రమణలు.. నేడు పెడబొబ్బలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నాడు టీడీపీ, కాంగ్రెస్‌లో కీలక నేతలే. నాడు చెరువుల ఆక్రమణలపై సడి చప్పుడు చేయని నేతలు ఇప్పుడు పెడబొబ్బలు పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు లెక్కలు చెప్తున్న డిప్యూటీ సీఎం నాడు ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఏం చేశారని పర్యావరణవేత్తలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పుడు కండ్ల ముందు కబ్జా అవుతున్నా పట్టించుకోకుండా, ఇప్పుడు తాము తప్ప మరెవరూ చెరువులను బాగు చేయలేరనే విధంగా ఏమిటని చర్చించుకుంటున్నారు.


హైదరాబాద్‌లోని మొత్తం చెరువులు	920
ఉమ్మడి ఏపీలో పూర్తిగా ఆక్రమణకు గురైనవి	225
పాక్షికంగా ఆక్రమణకు గురైన చెరువులు	196
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆక్రమణకు గురైనవి	20
గతంలో పాక్షికంగా ఆక్రమణకు గురై, స్వరాష్ట్రంలో పూర్తిగా ఆక్రమణకు గురైనవి	24

సింగరేణి లాభాలు గోప్యం

- సర్క్యులర్‌లో పేర్కొనని యాజమాన్యం
- కేవలం 33% చెల్లిస్తున్నట్టు ప్రకటన
- కార్మికుల్లో అనేక అనుమానాలు
- ఆది నుంచి టీబీజీకేఎస్ ఆందోళనలు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)/గోదావరిఖని: సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరం లాభాల వాటా 33 శాతాన్ని సోమవారం కార్మికులకు పంపిణీ చేసింది. రూ.796.05 కోట్ల లాభాల వాటా పంపిణీ చేస్తున్నట్టు సర్క్యులర్‌లో పేర్కొన్న యాజమాన్యం.. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలు ఎంత అనేది? పేర్కొనకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో లాభాల ప్రకటన వాటాను చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి అందుకు భిన్నంగా లాభాల వాటా చెల్లిస్తున్నట్టు మాత్రమే పేర్కొన్నది. సంస్థకు ఎంత నికర లాభం వచ్చిందనే అంశాన్ని మాత్రం కప్పిపుచ్చింది. సింగరేణి సంస్థలో కొంతకాలంగా యాజమాన్యం ప్రకటించిన విధంగా రూ.4,701 కోట్ల లాభాల్లో కార్మికుల వాటా 33 శాతం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యం మాత్రం సింగరేణి విస్తరణ అవసరాల కోసం రూ.2000 కోట్లకు పైగా నిధులను పక్కనపెట్టి కేవలం రూ.2,412 కోట్ల నిధులపై మాత్రమే 33 శాతం వాటాగా రూ.796.05 కోట్లను చెల్లిస్తున్నట్టుగా పేర్కొన్నది. వాస్తవంగా సింగరేణి సంస్థ సాధించిన రూ.4,701 కోట్లలో 33 శాతం వాటాగా రూ.1,551 కోట్లు రావాల్సి ఉంది. దాదాపు రూ.755 కోట్లను కార్మికులకు ఇవ్వకుండా లాభాలను తక్కువగా చూపించిందన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవ లాభాలపై వాటా చెల్లించాలని బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు కొంతకాలంగా ఆందోళనలు, ధర్నాలు చేపడుతున్నారు.

కార్మికుల శ్రమను దోచుకున్నారు



కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ప్రభుత్వం సగానికి దోచుకున్నాయి. లాభాల వాటాను రూ. 755 కోట్లు తగ్గించారు. కార్మికులకు రూ.4,701 కోట్లపై 33 శాతం వాటా చెల్లించాల్సి ఉండగా రూ.1,551 కోట్లపై రూ.796 కోట్లు మాత్రమే చెల్లించారు. అంటే కార్మికులకు 16.9 శాతం మాత్రమే చెల్లించారు. ఒక్కో కార్మికుడు రూ.1.80 లక్షలు నష్టపోయాడు. లాభాల వాటా సర్క్యులర్‌లో నికర లాభాలు ఎన్ని వచ్చాయి? ఎంత చెల్లిస్తున్నారనే విషయాన్నే పేర్కొనకపోవడం బాధాకరం. ఇది కార్మికులను మోసం చేయడమే. గుర్తింపు సంఘం ఈ విషయమై ఎందుకు నోరు మెదపడం లేదు. కార్మికుల హక్కులను ప్రభుత్వానికి తాకట్టు పెట్టారు.

-మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు



సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్

50 ఏండ్ల క్రితం చెరువులు ఎట్లున్నయ్?

- సర్వే ఆఫ్ ఇండియా రికార్డులపై ఆరా
- అధికారులతో హైడ్రా కమిషనర్ భేటీ
- సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పరిధిలో సమగ్రసర్వేకు ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశమయ్యారు. హబ్సీగూడలోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైడ్రా అధికారుల బృందం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల వివరాలు, ఇతర అంశాలపై సర్వే అధికారులతో చర్చించారు. 1971-72 సర్వే ప్రకారం నగరంలో ఉన్న చెరువులు, వాటి విస్తీర్ణంతోపాటు ప్రస్తుత పరిస్థితి అంశాలపై మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీదా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాలిట్‌తోపాటు ఇతర అధికారులు తమ వద్ద ఉన్న రికార్డులను హైడ్రా బృందానికి చూపించారు. యాభై ఏండ్ల క్రితం నగరంలో ఉన్న చెరువుల పరిస్థితిపై ఆనాటి మ్యాపులతోపాటు నేటి పరిస్థితిని పోలుస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాను సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారంతో పోల్చి చూసుకోవడానికి ప్రస్తుతం హైడ్రా కసరత్తు ప్రారంభించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారించడంలో సర్వే ఆఫ్ ఇండియా భాగస్వామ్యం కోరారు. దీనికి తమ దగ్గర సిబ్బంది కొరత ఉన్నట్టుగా అధికారులు చెప్పినట్టు తెలిసింది. తమ బృందం పనిచేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తితే సర్వే పరంగా సహకారం అందించాలని కమిషనర్ సర్వే అధికారులను కోరినట్టు సమాచారం. మరోవైపు సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదిక తయారు చేయనున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించి.. ప్రాధాన్యక్రమంలో చెరువులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు.

సమగ్ర సర్వే కష్టం!

- తేల్చిచెప్పిన హైడ్రా అధికారులు
- లేక్ ప్రొటెక్షన్ కమిటీలో చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలను తేల్చాలి.. క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేసి రిపోర్టులను మూడు నెలల్లోగా అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో రీసర్వే, కూల్చివేతలకు సంబంధించి కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. 'హెచ్‌ఎండీఏ పరిధిలో అసలు ఎన్ని చెరువులు, కుంటలున్నాయి.. వాటి వివరాలేంటి? ఎఫ్టీఎల్ , బఫర్‌జోన్ నిర్ధారించడానికి ఎలా సర్వే చేస్తారు? శాటిలైట్ మ్యాపులతో పాటు డిజిటల్ సర్వే చేసి తొందరగా పూర్తిచేస్తే హైడ్రా పని మొదలుపెట్టొచ్చు. గతంలో ఉన్నవాటితో పాటు ప్రస్తుతం ఉన్న పరిస్థితిని నిర్ధారించడానికి ఎంత సమయం పడుతుంది? రీసర్వే చేస్తే టెక్నికల్‌గా బలంగా ఉంటుంది కదా!' అని అన్నారు. దీంతో అధికారులు.. రీసర్వే చేయటం సాధ్యం కాదని తేల్చేశారు. శాఖల పరంగా సర్వేయర్ల కొరత, సొంత శాఖల్లో పని ఒత్తిడితో పాటు గ్రేటర్ చుట్టుపక్కల సర్వే చేయాలంటే చాలా కష్టమని చెప్పారు. గత ఇరవై ఏండ్లలో సాధ్యం కాని సర్వేలు ఇప్పుడెలా సాధ్యమని స్పష్టంచేశారు.

పాత రిపోర్టులు ఆధారంగా చేసుకుందాం

చెరువులకు సంబంధించి పాత రిపోర్టులు ఆధారంగా చేసుకుని ముందుకెళ్తే బాగుంటుందని కమిషనర్ అభిప్రాయపడ్డారని తెలిసింది. దీనికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు.. ఈ మధ్యకాలంలో కొన్ని చోట్ల కూల్చివేతలకు వెళ్లినప్పుడు ఎదురైన పలు సందర్భాలను చర్చకు తీసుకొచ్చారు. సర్వే సమయంలో వచ్చే సమస్యలపైనా చర్చ జరిగింది. ఇవన్నీ ఒక ఎత్తయితే సిబ్బంది కొరతతో పాత రిపోర్టులే ఆధారంగా సైట్‌లో పెడదామా! అన్న అంశం కూడా తెరపైకి వచ్చింది. పలు రెగ్యులరైజ్ భూముల విషయాన్నీ రెవెన్యూ అధికారులు ప్రస్తావించారు.